

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com   WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 114 పేజీలు: 8+4 వెల: 6.50


జులై 1నుంచి విబిజి రామ్‌జీ

## అమలులోకి 3లో

క్వెట్టాలో రైలు పట్టాలపై భారీ 5లో

పేలుడు, 24మంది దుర్మరణం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ (ఫైల్)

# ప్రధాని మోడీకి నేను మెగా ఫ్యాన్‌ను.. ఆయన గొప్ప ఫ్రెండ్

### పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**న్యూఢిల్లీ, మే 24:** ప్రధానిమోడీ ఒక గొప్ప వ్యక్తి. నేను ఆయన్ను ఎంతో అభిమానిస్తా, ఆయనకు మెగా ఫ్యాన్‌ను అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పొగడ్తలతో ప్రధానిమోడీని ముంచెత్తారు. మా రెండుదేశాల్లోను గొప్ప ఆర్థిక వ్యవస్థ ఉంది. రికార్డుస్థాయి స్టాక్ మార్కెట్లు పనిచేస్తున్నాయి. అమెరికానుంచి ఏది కావాలనుకుంటే భారత్ అది సాధించుకోగలదు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి 250 సంవత్సరాలు అయిన సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఏర్పాటుచేసిన మెగా కార్యక్రమంలో ట్రంప్ చేసిన విడియోకాల్ వైరల్ అయింది. అతిపెద్దస్క్రీన్‌పై మోడీని ప్రశంసిస్తున్న ట్రంప్‌ను చూసి ప్రేక్షకులు చప్పట్లు మారుమోగించారు. మోడీ తన ప్రసంగంలో భారత్‌కు ఏదికావాలన్నా ఎవరికి కాల్‌చేయాలో భారత్‌కు తెలుసునని, నేరుగా తమకే కాల్‌చేస్తారని, మా ఇద్దరిమధ్య మంచి స్నేహబంధం ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇద్దరం కలిసి రికార్డులు నమోదుచేయగలమని ట్రంప్ ధీమా ప్రకటించారు. అలాగే అమెరికా రాయబారి సెర్గియోగోరే, అమెరికా విదేశాంగమంత్రి మార్కోరుబియోలను కూడాప్రశంసించారు. అమెరికాకు ఒక గొప్ప విదేశాంగ కార్యదర్శి రుబియో అని అమెరికా చరిత్రలోనే ఇంతటి >>2

# 48.3°

### తూ.గో జిల్లా చిట్యాలలో ఉష్ణోగ్రత అత్యధికం

### తణుకు, పిడుగురాళ్ల: 48.1°

### వడదెబ్బకు మరో 18 మంది బలి

**విజయవాడ,మే 24, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రోహిణీ కార్తె ప్రవేశానికి ముందే ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరింది. వడగాలుల తీవ్రత తోడవడంతో జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాల పరిధిలోని దాదాపు 174 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటేశాయి. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత తీవ్రంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో అత్యధికంగా 48.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అటు పల్నాడు జిల్లా పిడుగురాళ్లతో పాటు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలో ఎండ తీవ్రత రికార్డుస్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. మరో మూడు రోజులు పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందన్నారు. వీలైనంత వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అత్యవసర ప్రయాణాల్లో తప్ప నిసరిగా మంచినీరు వెంట తీసుకుని >>2

రైతులకు ఎలాంటి

# నష్టం రానివ్వం



### ఉద్యాన, ఆక్వారంగాల సమస్యలు పరిష్కరిస్తాం

### యూరియా కొరతలేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రైతులు, పాలిటీ, ఉద్యాన, ఆక్వారంగాలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కూటమి ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా పనిచేస్తోందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా లభ్యత నుంచి మొక్కజొన్న ధరలు, రొయ్యల మార్కెట్ పరిస్థితులు, కొబ్బరి రైతులు సమస్యలు అనంతపురం నీటి ఎద్దడి వరకు ప్రతి అంశంపై వ్యవసాయ అనుబంధ శాఖల డైరెక్టర్స్ తో మంత్రి జూమ్ సమావేశం నిర్వహించి ప్రతి అంశంపై లోతైన చర్చ జరిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మా లక్ష్యం. కానీ వైసీపీ నాయకులు మాత్రం సమ స్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ లాభాల కోసం అబద్దాల ప్రచారం చేస్తు న్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సర ఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు వివరించారు. అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు దరలు అందేలా మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పరిశలిస్తోంది. మధ్య వర్తుల దోపిడిని అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వచ్చిన తాత్కాలి పరిస్థితులను అధిగమించేందుకు మత్స్య శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడు >>2

# అనుబంధ రంగాల్లో పరిశ్రమల వెల్లువ



### ఇంటికో పారిశ్రామికవేత్త ప్రభుత్వ లక్ష్యం

### వివిధ ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్ కావాలి

### 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం

### కార్మికులకు నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 24, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏర్పడే భారీ పరిశ్రమలకు అనుబంధ రంగాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలకు అవకాశం ఉందని. సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ పరిశ్రమకు ఎంఎస్ఎంఈ రంగంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తున్న సందర్భంలో ఏర్పడే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషించేలా కార్యచరణ చేపడుతున్నట్లు వివరించారు. విజయవాడలో ఈ నెల 26న ఎంఎస్ఎంఈల గ్లోబల్ సమ్మిట్ జరుగుతుంది, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్నిశాఖల అధికారులు విజయవంతం చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులను ఈ కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్తామన్నారు. "పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన సంస్థలకు భూ కేటాయింపులు వంటి విషయాల్లో ఏమైనా ఇబ్బందులుంటే వాటిని వెంటనే పరిష్కరించాలి. 22ఏ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించాలి. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీల ద్వారా నిషేధిత భూములను క్లియర్ చేయాలి. జిల్లాల్లోని వివిధ ఉత్పత్తులు పాన్ ఇండియా, గ్లోబల్ బ్రాండ్స్ కావాలి. అరకు కాఫీ లాంటి బ్రాండింగ్ ఏపీ ఉత్పత్తులకు రావాలి. మనం రోజూ వారీగా వినియోగించే చాలా ఉత్పత్తుల కొనుగోలు ద్వారా విదేశాలకు డబ్బులు చెల్లిస్తున్నాం. ఏపీ ఉత్పత్తులకు క్వాలిటీ, బ్రాండింగ్ వంటివి వస్తే ఆ ఆదాయం మనకే వస్తుంది. పారిశ్రామిక పార్కులు, ఉత్పత్తి యూనిట్ల వద్ద ఎంఎస్ఎంఈ ఎకోసిస్టమ్ అభివృద్ధి కావాలి. భారీ పరిశ్రమలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్ఎంఈలు అభివృద్ధి కావాలి. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏపీకి రావడంతో క్యారియర్ ఏసీ సంస్థ రాష్ట్రానికి వచ్చింది. డేటా సెంటర్లకు, క్వాంటం కంప్యూటింగ్ వంటి వ్యవస్థలకు బల్క్ చిల్లర్స్ ను ఏపీకి వచ్చిన ఏసీ సంస్థలే సరఫరా చేస్తాయి. అమరావతిలో క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ ఏర్పాటు అయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పని చేయటం ప్రారంభిస్తే వాటికి కావాల్సిన పరికరాల ఉత్పత్తి కూడా చేసేలా ఎకోసిస్టమ్ >>2

# ఎబోలాపై హై అలర్ట్

### కాంగో, ఉగాండాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు

### విశాఖ, తిరుపతి, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాలపై నిఘా

### అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు: మంత్రి సత్యకుమార్








**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ విస్తృతి, కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో 'ఎబోలా' వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాలు, సలహాలు, సూచనల ఆధారంగా 'ఎబోలా' వైరస్ వ్యాప్తి, కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్దంగా ఉందని మంత్రి ప్రకటించారు. ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా దేశాల్లో ఎబోలా తీవ్రత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సదరు దేశాల నుంచి రాష్ట్రంలోనికి వైజాగ్, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులను (ట్రావెల్ హిస్టరీ ఆధారంగా) వైరస్ >>2

## ఆఫ్రికా దేశాలకు వెళ్లొద్దు: కేంద్రం

**న్యూఢిల్లీ, మే 24:** ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వ్యాధి వ్యాప్తి చెందినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ప్రస్తుతం కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అత్యవసరం కాని ప్రయాణాలను మానుకోవాలని కేంద్రం దేశ ప్రజలకు సూచించింది. ఆయా దేశాలలో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న భారత పౌరులు, స్థానిక అధికారులు జారీ చేసిన ప్రజారోగ్య మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, అధిక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదివారం సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఒ) ఈ పరిస్థితిని అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి గా ప్రకటించింది. డెమొ క్రాటిక్‌రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇతర ప్రభావిత దేశా లలో మారుతున్న పరిస్థితి దృష్ట్యా, డబ్ల్యూహెచ్ఒ సిఫార్సులకు అనుగుణంగా, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్‌కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ లకు అత్యవసరంకాని ప్రయాణాలను మానుకోవాలని భారత ప్రభుత్వం >>2



## విద్యార్థి మిత్ర కిట్లు రద్దు చేయలేదు

### -మంత్రి లోకేష్

**విజయవాడ.మే 24, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విషప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు >>2

# కోళ్లు విలవిల

### ఉష్ణోగ్రత 45° దాటడంతో పౌల్ట్రీ రంగానికి దెబ్బ

### ఎపిలో రెండు రోజుల్లో 10లక్షలు పైగా కోళ్లు మృతి

### తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో బలవుతున్న వైనం



**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** భానుడి భగభగలకు పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోవడంతో మూగజీవాలు ఎండ వేడిని తట్టుకోలేక ప్రాణాలు విడు స్తున్నాయి. ముఖ్యంగా గుడ్లు పెట్టే లేయర్ ఫారాలపై ఈ ఎండల ప్రభావం తీవ్రంగా చూపిస్తోంది. చనిపోయిన కోళ్లను గుంతలు తీసి పూడ్చిపెడుతున్న దృశ్యాలు స్థానికంగా కలచి వేస్తున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో కోళ్లను కాపా డుకోవడం పౌల్ట్రి రైతులకు కత్తిమీద సాములా మారింది. షెడ్లలో చల్లదనం కోసం అదనంగా లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కోళ్ల ఫారాల చుట్టూ గోనె సంచులు కట్టి నిరంతరం తడపడం, షెడ్ల పైన గడ్డి వేయడం, లోపల కూలర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నా ఎండ తీవ్రతకు తట్టుకోలేక కోళ్లు ప్రాణాలు విడుస్తున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో పెద్దసంఖ్యలో పౌల్ట్రి రైతులు ఉన్నారు. దేశీయంగా కోళ్లు,గుడ్లఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంది. పౌల్ట్రి పరిశ్రమపై ఆధారపడి రాష్ట్రంలో దాదాపు 5లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. దేశంలోని కోళ్లలో తెలంగాణలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. నెల రోజులుగా ప్రతీ రోజూ 45 డిగ్రీలకు పైగా ఎండలు నమోదవుతుం డడంతో ఎండవేడిని తట్టుకోలేక ఫారాల్లోని కోళ్లు ఊపిరాడక కుప్పకూలిపోతున్నాయి. మండే ఎండలకు తోడు తీవ్రమైన >>2



# వెంపటి, గరిమెళ్లకు నేడు 'పద్మశ్రీ'లు



వెంపటి కుటుంబశాస్త్రి

ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ముర్ము



బాలకృష్ణప్రసాద్(ఫైల్)

**విజయవాడ,మే24, ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య సంకీర్తనాచార్యుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రిలకు పద్మశ్రీ అవార్డులను ఈ నెల 25వ తేదీన ప్రదానం చేయ నున్నారు. అన్నమయ్య కీర్తనకారులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, కేవలం తాళపత్ర గ్రంథాలకే పరిమితమైన అన్నమయ్య కీర్తనలను అద్భుతమైన రాగయుక్తంగా స్వరకల్పన చేసి, ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లిన అత్యంత ప్రతిభావంతుడైన వాగ్గేయకారుడు ఆయన. 1948 నవంబర్ 9న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన బాలకృష్ణ ప్రసాద్, చిన్ననాడే తల్లిదండ్రుల వద్ద ప్రాథమిక సంగీత పాఠాలు నేర్చుకున్నారు. అనంతరం ప్రముఖ సంగీత సమ్రాట్ డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి వద్ద శిష్యరికం చేసి, తన శాస్త్రీయ >>2

ఎవరెస్ట్ నుంచి దిగుతూ

# సందీప్ మృత్యువాత

### అమెరికాలో జాబ్ చేస్తున్న హిందూపురం వాసి



సందీప్ (ఫైల్)

**హిందూపురం, మే 24 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరం విజయవంతంగా అధిరోహించి కిందకి దిగివస్తూ ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురై హిందూపురానికి చెందిన సందీప్ ఆరే(47) మృతి చెందడం ఈ ప్రాంతంలో వారి సన్నిధిలో విషాదఛాయలు నెలకొన్నాయి. హిందూపురం పట్టణం మేళాపురం తెలుగుతల్లి సర్కిల్ సమీపంలో సొంత ఇల్లు కలిగి బెంగళూరులో స్థిరపడిన ఆర్అండ్‌బి శాఖ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణస్వామికి ఏకైక కుమారుడు సందీప్ స్థానిక దీప్తి స్కూల్ విద్యార్థి. తదుపరి బెంగళూరులో పీజీ చేసి వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. పర్వతారోహణపై తీవ్ర మక్కువ కలిగిన సందీప్ ఇందుకోసం లక్షల రూపాయలు వెచ్చించి ట్రెక్కింగ్ చేయడంలో శిక్షణ తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రపంచంలోని కష్టసాధ్యమైన పర్వతాలను ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి >>2

# విజయవాడకు మళ్లీ సినిమా వైభవం

### స్టూడియోల నిర్మాణానికి సినీప్రముఖులు ముందుకు రావాలి: మంత్రి కందుల దుర్గేష్

### చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా భరత్ భూషణ్ బాధ్యతల స్వీకారం




ఆదివారం విజయవాడలో ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో బాలకృష్ణ తదితరులు

**విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్‌గా సీహెచ్ మెహర్ రమేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.భరత్ భూషణ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో సినిమా, కళలు, నాటకరంగ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి ద్వారా సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. 1984లో నందమూరి తారకరామారావు డి.వి.యస్.రాజు అధ్యక్షతన ఇలాంటి పూర్తి స్థాయి కమిటీని వేశారని, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూటమి ప్రభు త్వం సినిమా రంగానికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ రంగంపై ఉన్న ప్రేమతో, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తనకు పూర్తి సహకారం అందించారని, అందుకు వారికి జీవితకాలం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్‌ల సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు చలన చిత్రరంగ అభివృద్ధికి, సినీ పరిశ్రమ విస్తరణకు తన వంతు బాధ్యతగా పూర్తి కృషి చేస్తానని సభాముఖంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, >>2

# అనుబంధ రంగాల్లో పరిశ్రమల వెల్లువ



>> వస్తుంది. ఈ విధంగా అభివృద్ధి చెందే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలకంగా ఉండాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించేలా ప్రణాళికలు:** రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం. కార్మికులు పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా. లేబర్ అడ్డాల్లో కూర్చొంటారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇస్తాం. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వారిలో ఆరోగ్య అవగాహన కల్పించాలి. ప్రివెంటివ్ హెల్త్ సక్సెస్ అయితే ప్రజలకు వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. జిల్లాల వారీగా హెల్త్ స్కోర్ లు తయారు చేయాలి. సోలార్ రూఫ్ టాప్, కుసుమ్ స్కీంలను ఇంటిగ్రేట్ చేసి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి. రానున్న కాలంలో విద్యుత్ నిమిత్తం ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం రానంతగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోలార్ పవర్ ఉత్పత్తి జరగాలి. 22 లక్షల పంపు సెట్లకు పీఎం కుసుమ్ ద్వారా సోలార్ పవర్ పెట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. బెస్ట్ ప్రాక్టీసెస్ కు మెంటార్లుగా జిల్లాల కలెక్టర్లను నియమిస్తాం. లాజిస్టిక్స్ పార్కులు వస్తే పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ వస్తుంది. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉంది... దీనికి తగ్గట్టు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షాధార పంటలు, మెట్ట పంటలు, ఉద్యాన పంటలకు అనుగుణంగా నీటి ప్రణాళికలు చేసుకోవాలి. పశువులకు దాణాకు ఇబ్బంది లేకుం డా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రీన్ కవర్ పెరగాలి.. అటవీ శాఖ దీనిపై చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణ... స్వచ్ఛ పథాల రహదారుల శుభ్రతపై దృష్టి పెట్టాలి. స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తాం." అని సీఎం చంద్రబాబు తెలిపాం రైలు మార్గం ద్వారా ప్రతీ కిలో మీటరుకు రూ. 1.83 వ్యయం అవుతోంది. రహదారి మార్గంలో జరిగే రవాణాపై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోంది. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారి ప్రాజెక్టులు వస్తున్నాయి. రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు.. రూ. 2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయి. ఎక్స్ ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. 4 లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగ బోతోంది. ఆర్వోబీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలన్నారు.ఇవన్నీ అత్యంత కీలకంశాలు ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఆ దిశలో కార్యాచరణ ఉంటుందన్నారు.



## శాంతి ఒప్పందంవైపు అమెరికా, ఇరాన్ అడుగులు..

**టెహ్రాన్,వాషింగ్టన్, మే 24:** అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు లీక్ అయ్యాయి. ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హార్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు ఆక్సియోస్ పేర్కొంది. ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని తెలుస్తోంది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరి ణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

**ఇరాన్‌తో శాంతి ఒప్పందం ఖరారు: డొనాల్డ్‌ట్రంప్**

ఇరాన్‌తో ఒక విస్తృత శాంతి ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఒప్పందం తుది దశలో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందంపై పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, బహ్రెయిన్ దేశాల అధినే తలతో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు తెలిపారు. అమెరికా, ఇరాన్‌తోపాటు పలు ఇతర దేశాల మధ్య ఈ ఒప్పందంపై చర్చలు చాలా వరకు పూర్తయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. కేవలం తుది మెరుగులు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కూడా తాను ప్రత్యేకంగా మాట్లాడానని, ఆ చర్చలు కూడా సఫలమయ్యాయని ట్రంప్ చెప్పారు. ఒప్పందంలోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరవనున్నట్లు స్పష్టం చేశారు.

ఈ పరిణామం భారత్‌కు ఎంతో ముఖ్యమైనదని, గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు అధికంగా చమురు దిగుమతులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభా వం పడే అవకాశం ఉందని అన్నారు. ఈ ఒప్పందం పూర్తి స్వరూపం, ఏ దేశం పాత్ర ఏంటి అనే వివరాలను ట్రంప్ వెల్లడించలేదు

# కోళ్లు విలవిల

>> వడగాల్పులు వీస్తుండడంతో ప్రతీ రోజూ వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక అటు బ్రాయిలర్, ఇటు లేయర్ కోళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రి రైతులకు భారీ నష్టాలు తప్పడం లేదు. మునుపెన్నడూ లేని విధంగా ఒకేసారి ఎండలు ముదరడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. పొరుగు రాష్ట్రం ఏపిలో రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 10 లక్షల కోళ్లు చనిపోవడంతో వేసవి తాపం పౌల్ట్రీ రైతులకు ఎంతటి నష్టాలను మిగులుస్తుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఎండల ప్రభావం కేవలం కోళ్ల మరణాలకే పరిమితం కాకుండా కోడి గుడ్ల ఉత్పత్తిని కూడా కోలుకోకుండా దెబ్బతీసింది. ఫారాలలో గుడ్ల దిగుబడి దాదాపు 5 నుండి 10 శాతం వరకు పడిపోయిందని పౌల్ట్రీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్లు మేత సరిగ్గా తినకపోవడం, నీరసించిపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోంది. వేసవి ఎండల కారణంగా రైతులు కూడా కొత్త బ్యాచ్‌లు వేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మార్కెట్‌లో చికెన్, కోడిగుడ్ల కొరత ఏర్పడి, వాటి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి పౌల్ట్రీ రంగానికి ఈ యేడాది అస్సలు కలిసిరాలేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన వ్యాధుల కారణంగా అప్పట్లో ఒక బ్యాచ్ పూర్తిగా నష్టపోయింది. ఆ నష్టం నుంచి తేరుకోకముందే.. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం పౌల్ట్రీపై గట్టి దెబ్బకొట్టింది. యుద్ధ ప్రభావంతో కోడిగుడ్ల ఎగుమతులు నిలిచిపోయి, మార్కెట్‌లో ధరలు పాతాళానికి పడిపోయాయి. ఒకవైపు వ్యాధులు, మరోవైపు మార్కెట్ లేకపోవడం, ఇప్పుడు ఊపిరాడకుండా చేస్తున్న ఉక్కపోత.. ఇలా వరుస సంక్షోభాలు పౌల్ట్రీ రంగాన్ని ముంచేస్తున్నాయి.అప్పుల ఊబిలో రైతులు..ఈ ప్రాంతంలో ఆక్వా రంగం తర్వాత ఎన్నో కుటుంబాలు పౌల్ట్రీ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. రూపాయి రూపాయి కూడబెట్టి, బ్యాంకుల దగ్గర ఆస్తులు తాకట్టు పెట్టి కోట్లలో అప్పులు తెచ్చిన నిర్వాహకులు ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. లక్షలకు లక్షలు బ్యాంకు రుణాలు తెచ్చి, అప్పులు చేసి పౌల్ట్రి ఫారాలను ఏర్పాటు చేస్తే వేసవి ఎండల కారణంగా కోళ్లు చనిపోతుండడంతో చేతికి పైసా రాకపోగా, ప్రతి నెలా బ్యాంకు వడ్డీలు, మేత (ఫీడ్) ఖర్చుల కోసం రైతులు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నష్టాలను భరించలేక కొందరు రైతులు తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

# రైతులకు ఎలాంటి నష్టం రానివ్వం

>> తున్నట్లు సమావేశంలో చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా మార్కెటంగ్ అవకాశాలు పెంచడం, సహాయక చర్యలు చేపట్టడంపై ఉద్యానవన శాఖకు మంత్రి దిశానిర్దేశం చేశారు. నీటి ఎద్దడిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని సాగు తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

# వెంపటి, గరిమెళ్లకు నేడు 'పద్మశ్రీ'లు

>> సంగీత పటిమను మరింత పదును పెట్టుకున్నారు. 1978లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించిన అన్నమాచార్య ప్రాజెక్ట్ లో చేరి, దాదాపు మూడు దశాబ్దాల పాటు నిరంతరాయంగా సేవలు అందించారు. ఆ తర్వాత కూడా జీవితాంతం టిటిడి ఆస్థాన విద్వాంసునిగా కొనసాగుతూ అన్నమయ్య సంకీర్తనల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించారు.ఆయన ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో దేశవిదేశాలలో 6,000కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత లోకానికి ఆయన చేసిన ఈ అనన్య సామాన్యమైన సేవలకు గాను భారత ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ అవార్డు (2020) తో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠంల నుంచి ఆస్థాన విద్వాన్‌బిరుదులను పొందారు. 2025 మార్చి 9న ఈ సంగీత శిఖరం శివైక్యం చెందింది. రాష్ట్రపతి భవన్లో జరిగిన వైభవ వేడుకలో ఆయన తరపున వారి కుటుంబ సభ్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని రాష్ట్రపతి చే అందుకుంటారు.ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి భాషా సేవలకు గుర్తింపుగా ఇప్పటికే 2014లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్ లభించింది.

# ఎబోలాపై హై అలర్ట్

>> నిర్ధారణ పరీక్షలు చేసే విషయంలో ఎయిర్ పోర్ట్ అథార్టీ, సదరు జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి, పక్కనున్న వారికి కూడా వెంటనే వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విశాఖ ఓడరేవు అధికారులతో కూడా మాట్లాడి, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని చెప్పారు. విమానాల ద్వారా కాకుండా రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారి విషయంలోనూ అవసరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎబోలా వైరస్ పీడిత దేశాలనుంచి వచ్చే ప్రయాణికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ఇందుకు అనుగుణంగా అవసరమైన సమాచారాన్ని సదరు రాష్ట్రాలకు పంపుతోందని తెలిపారు.కొవిడ్ హయాంనాటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని 'ఏబోలా' విషయంలో ముందస్తు జాగ్ర త్తలు, అత్యవసర పరిస్థితులుతలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**ఐసోలేషన్ వార్డులు సిద్ధం:** అంతర్జాతీయ విమానాశ్రయాల నగరాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే ఐసోలేషన్ వార్డుల్లో 15 పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారాన్ని జిల్లాలకు పంపుతూ అందర్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. పీపీఈ , వైరస్ నిర్ధారణ పరీక్షల కిట్లు తక్షణ అవసరాలకు సరిపడ ఉన్నాయని తెలిపారు.

**లక్షణాలు ఏలా ఉంటాయంటే:** ఎబోలా (బుండిబుగ్యో) వైరస్ కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాల్లోని అనేకమందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం కష్టం. వైరస్ సోకిన వారికి కొన్నివారాలపాటు లక్షణాలు బయటపడవు. దీనివల్ల ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలో సోకే అవకాశం ఉంది. సాధారణ జ్వరం, అకస్మాత్తుగా జ్వరం పెరిగిపోవడం, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, తీవ్ర తలనొప్పి, గొంతునొప్పి, కండరాల నొప్పులు, రోజురోజుకి నొప్పులు తీవ్రమవుతుండటం, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ల ఎర్రబారడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ బారినపడిన వారిలో కనిపిస్తున్నాయి.

# ఆఫ్రికా దేశాలకు వెళ్లొద్దు: కేంద్రం

>> భారత పౌరులందరికీ సూచిస్తోంది అని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ వల్ల కలిగే ఎబోలా వ్యాధికి సంబంధించిన ఒక్క కేసు కూడా భారతదేశంలో నమోదు కాలేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలను ప్రభావితం చేస్తున్న బండిబుగ్యో స్ట్రెయిన్ ఎబోలా వైరస్ కొనసాగుతున్న వ్యాప్తిని, ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (ఆఫ్రికా సిడిసి) అధికారికంగా ఖండాంతర భద్రత దృష్ట్యా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. అంతేకాకుండా, మే 22న డబ్ల్యూహెచ్ఓ ఐహెచ్ఆర్ అత్యవసర కమిటీ, "బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాల నుండి వచ్చే, కారణం తెలియని జ్వరంతో బాధపడుతున్న ప్రయాణికులను గుర్తించడం, అంచనా వేయడం, నివేదించడం, నిర్వహించడం"తో పాటు "బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాలకు ప్రయాణించకుండా నిరుత్సాహపరచడం" కోసం ప్రవేశ ద్వారాల వద్ద వ్యాధి నిఘాను బలోపేతం చేయడానికి తాత్కాలిక సిఫార్సులను జారీ చేసింది. ఎబోలా వ్యాధి అనేది ఎబోలా వైరస్ యొక్క బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ సంక్రమణ వలన కలిగే ఒక వైరల్ హెమరేజిక్ జ్వరం. ఇది అధిక మరణాల రేటు కలిగిన ఒక తీవ్రమైన వ్యాధి. ప్రస్తుతం బుండిబుగ్యో వైరస్ జాతి వల్ల కలిగే ఎబోలా వ్యాధిని నివారించడానికి లేదా చికిత్స చేయడానికి ఎలాంటి టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు ఆమోదించబడలేదు. బుండిబుగ్యో వైరస్ చాలా ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

# హస్త కళాకారులకు గౌరవ ప్రద జీవనమే లక్ష్యం

## తరంగా ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ రూపకల్పన

### రాష్ట్ర స్థాయి నుంచే లేపాక్షి షో రూమ్‌ల పర్యవేక్షణ: మంత్రి సవిత



**విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి:** హస్త కళారూపాలు కేవలం వస్తువులే కాదు ఆయా ప్రాంతాల సాంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలు. వారసత్వ ప్రదాతలు హస్త కళాకారులు. చరిత్రకు ఆనవాలుగా నిలిచే హస్త కళలకు, హస్త కళాకారులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. హస్త కళా కారులకు గౌరవప్రదమైన జీవనం అందిస్తూనే, హస్త కళారూపాలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు సాంకేతికతను సాధనంగా వినియోగిస్తోంది. రెండేళ్ళ కాలంలో లేపాక్షి ప్రగతి నివేదికను మంత్రి సవిత ఒక ప్రకటనగా వెల్లడించారు. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో పాటు కళాకారుల గుర్తింపు, సృజనాత్మకతతో వారు రూపొందించే కళా రూపాలను సామాన్య ప్రజలకు సైతం సకాలంలో అందించేలా ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించింది. ఆయా కళారూపాల విశిష్టత, సాంస్కృతి సంప్రదాయలను తెలిపేలా ఏఐ టూల్ ను వినియోగిస్తూ మరో ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో హస్త కళలకు ప్రాచుర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాచీన భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలను హస్త కళారూపాల్లో ప్రస్తుత తరానికి హస్త కళాకారులు అందిస్తూ వస్తున్నారు. సరైన ప్రాచుర్యం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో హస్త కళాకారుల జీవనం భారంగా గడుస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో ప్రభుత్వాలు హస్త కళలకు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. అవి పూర్తిస్థాయిలో హస్త కళాకారులకు భరోసా కల్పించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అటు కళలను ప్రోత్సాహిస్తూనే, ఇటు హస్త కళాకారులకు మెరుగైన జీవనం అందించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఒకవైపు నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తూ, లేపాక్షి షో రూమ్ లకు నూతన హంగులు కల్పిస్తోంది. మరో వైపు హస్త కళాకారులకు నూతన ఆవిష్కరణలు చేసేలా శిక్షణ అందజేస్తోంది. అదే సమయంలో హస్త కళాకారులు రూపొందించిన కళారూపాలను వినియోగదారుల చెంతకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు తరంగా అనే రియల్ టైమ్ వ్యవస్థను,ఏఐ టూల్‌తో కళాక్షి అనే యాప్ ను రూపొందించింది. ఈ రెండింటినీ త్వరలోనే ప్రారం భించి, హస్త కళల అమ్మకాలు పెంచేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది.

**తరంగాతో లేపాక్షినిర్వహణ:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్(ఏపీ హెచ్డీసీ) ఆధ్వర్యంలో 19 లేపాక్షి షో రూమ్ లున్నాయి. వాటిలో ఢిల్లీ, కోల్ కత్తా, హైదరా బాద్ మినహా మిగిలిన 16 షో రూమ్ లూ ఏపీలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా షో రూమ్ ల నిర్వహణలో జిల్లా స్థాయి అధికారుల నేతృత్వంలో సాగుతోంది.ఇకపై అన్ని షో రూమ్‌ల నిర్వహణకు రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగేలా తరంగా పేరుతో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించారు.

# రద్దు చేయలేదు

>> పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

## ఆయన గొప్ప ఫ్రెండ్

>> గొప్ప నాయకుడు లేడని కొనియాడారు. అంతకు ముందురోజే అమెరికా రాయబారి సెర్గియోగోరే ప్రధాని మోడీని అమెరికా సందర్శనకు రావాలని ట్రంప్ చేసిన ఆహ్వానాన్ని అందచేసారు. రుబియో తన పర్యటనలో మాట్లాడుతూ భారత్, అమెరికాలమధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుతోందన్నారు.

# 48.3º

>> వెళ్లాలన్నారు. ఇవాళ సీజన్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రత తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1డిగ్రీలు నమోదైందని పేర్కొన్నారు. 13 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు.17 జిల్లాల పరిధిలోని 174 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు.ఇందులో ముఖ్యంగా ఏలూరు 23, తూర్పుగోదావరి 21, పశ్చిమగోదావరి 17, కృష్ణా 16, బాపట్ల 15, ఎన్టీఆర్ 14, పల్నాడు 13, కోనసీమ 12, కాకినాడ 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందన్నారు.ఆదివారం తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీలు, పశ్చిమగోదావరిజిల్లా తణుకు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1,ఏలూరుజిల్లా కుక్కునూరు పోలవరం(జి)కూనవరం లో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1, కోనసీమజిల్లా రామచంద్రాపురం, కాకినాడజిల్లా కాజులూరులో 46.5, బాపట్లజిల్లా కూచినపూడిలో 46.2, ఎన్టీఆర్‌జిల్లా మైలవరంలో 45.7, విశాఖ రూరల్ 45.6, ప్రకాశంజిల్లా కారేడులో 45.5, నెల్లూరుజిల్లా కొమ్మిపాడులో 45.2, మార్కాపురంజిల్లా నందనమారెళ్లలో 44.6 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక అంచనాలను అనుసరించి రాష్ట్రంలో ఆదివారం 18 మరణించినట్లు ఆయా మృతుల కుటుం బాల సమాచారాన్ని అనుసరించి అధికార యంత్రాంగం అనుమానిస్తుంది.ఒక్క విజయవాడ నగరంలో పాత బస్తీ(వన్‌టౌన్)9, గుంటూరులో ఇద్దరు, మచిలీపట్టణం ఒకరు,జగ్గయ్యపేటలో ఇద్దరు, నందిగామ, ఏలూరు, విశాఖ, పాడేరు లో ఒక్కొక్కరు వడదెబ్బకు మృతి చెందినట్లు సమాచారం.

**విస్తరిస్తున్న ద్రోణి:** ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉంది దీని ప్రభావంతో మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అలాగే మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంబాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు.

# విజయవాడకు మళ్లీ సినిమా వైభవం

>> టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిక్కాల మెహార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సినిమా పరిశ్రమ పురోగతి సాధిస్తుందన్నారు. ఒకప్పుడు తమి ళనాడు, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలివెళ్లిన చిత్ర పరిశ్రమను, మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో ఒక మంచి 'ఫిలిం ఫ్రెండ్లీ' వాతావరణం కల్పించేందుకు ఈ బోర్డుని ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్రంలో సినిమా మౌలిక వసతుల అభివృద్ధి చేయడంతో పాటు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతోనే తాను ఈ బోర్డులోకి వచ్చానన్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు సాంస్కృతిక వ్యవ హారాలు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో కళలు, సినిమా, నాటకం మరియు టీవీ రంగాలకు ఎలాంటి ప్రోత్సాహం లభించలేదని, ఈ రంగాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రధాని నరేంద్ర మోదీల నాయకత్వంలో రాష్ట్రంలో కళల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో షూటింగ్ లొకేషన్లకు కొదవలేదని, అయితే సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు వంటి మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నిర్మాతలు, సినీ పెద్దలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు సినిమా పరిశ్రమకు కీలక కేంద్రంగా ఉన్న విజయవాడకు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చలన చిత్ర రంగంలో మళ్లీ పూర్వవైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన పి. భరత్ భూషణ్, వైఎస్ చైర్మన్ గా చిక్కాల మెహార్ రమేష్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, కమిటీ డైరెక్టర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1975లో ప్రారంభమైన ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర విభజన అనంతరం 2017లో నవ్యాంధ్రలో అంబికా కృష్ణ చైర్మన్‌షిప్‌లో తిరిగి ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా చిత్ర పరిశ్రమకు విజయవాడ ఒక రాజధానిగా, ప్రధాన కేంద్రంగా విలసిల్లిందని, ఇప్పటికీ సినిమాల ఆదాయంలో 65 నుండి 70 వరకు ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగాల సమగ్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా చైర్మన్‌తో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, కళాకారులు, ఉన్నతాధికారులతో కూడిన 17 మంది సభ్యులు డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది.

# సందీప్ మృత్యువాత

>> చేశారు. చిరకాల వాంఛ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు ఈనెల 20వ తేదీన మిత్ర బృందంతో కలిసి విజయవంతంగా అధిరోహించారు. మువ్వన్నెల భారత జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి కిందకి దిగివస్తూ కంటి సంబంధిత సమస్యతో ప్రారంభమై అనారోగ్యంతో ఆ వెంటనే కన్నుమూశారు. ఈ విషయం నారాయణస్వామి సన్నిహితులు హిందూపురానికి చెందిన వైసీ చంద్రశేఖర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని నేపాల్ నుంచి వీలైనంత తొందరగా భారత్‌కు తరలించి బెంగళూరుకు తీసుకువచ్చేలా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర బాలయ్యతో చర్చించారు. మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి ఢిల్లీలోని హోం శాఖ కార్యదర్శి, విదేశీ వ్యవహారాల శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. సోమవారం భౌతిక కాయం బెంగళూరు చేరుకునే అవకాశం ఉందని సన్నిహితులు తెలిపారు.

## వారం - వర్జ్యం

25-05-2026, అధికజ్యేష్ఠ సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
దశమి తె.5.11
ఉత్తరఫల్గుణి తె.4.09
వర్జ్యం : ఉ.10.27-మ.12.09
దు.మ.12.30-మ.1.22, 2) మ.3.06-3.58
శుభసమయం:ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** విదేశములో నున్న మిత్రుల నుండి కానుకలు, ధనము, లభించు అవకాశము కనిపిస్తున్నది. బంధువుల కలయిక.

**వృషభం:** నూతన వ్యాపార యత్నమును కొద్ది కాలము పాటు వాయిదాను వేయుటం మంచిది. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** దూరపు బంధువుల రాక విందులు, సమావేశములు,మిత్రులతో సంప్రదింపులు, ఆనందము నిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరము. వృత్తిలో మీ తెలివితేటలు బాగా ఉపకరిస్తాయి.

**సింహం:** రాజకీయములు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యములకు అనుకూలం. స్పెక్యులేషన్ దూరంగా ఉండండి.

**కన్య :** మీ నిపుణతలకు సమర్థతలకు సదవకాశము లభిస్తుంది. ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ కనబరుస్తారు. బంధువుల కలయిక.

**తుల :** సహోద్యోగులతో అనుబంధములు మెరుగు పడతాయి. పాత ఋణములు వసులౌతాయి. వాహన సౌఖ్యం కలదు.

**వృశ్చికం:** కష్టమునకు తగిన ఫలితము వస్తుంది. సంతానము విద్యా విషయములో మిత్రుల సలహాలు ఉపయోగపడతాయి.

**ధనుస్సు:** బ్యాంక్ ఖాతాలను, లాకర్స్‌ను ప్రారంభించుటకు, అనుకూలమైన సమయం. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** సమయమునకు ఆహారము తీసికొని మీ ఆరోగ్యమును పరిరక్షించుకోండి.వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

**కుంభం:** సంస్థలో మీరు ఆశించిన మార్పును పొందగలుగుతారు. కుటుంబ వ్యవహారాలు సైతం సానుకూలంగా ఉంటాయి.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమములను గురించి ప్రాథమిక చర్చలను వ్రాత, కోతలను పూర్తి చేస్తారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## తిరుమల సమాచారం



### చిన్నశేషుడిపై గోవిందుడి దివ్యమహిమ

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం గోవిందరాజస్వామి చిన్నశేష వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అనుగ్రహించారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. ముందుగా గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తబృందాలు చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామసంకీర్తనలతో మాడవీధులను భక్తిరస మయం చేశాయి. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చిన్నశేష వాహనం దివ్యశోభను సంతరించుకుంది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి గోవిందుడిని దర్శించుకొని పరవశించారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడు "శేషి", జగత్తు "శేషభూతం"గా భావించబడుతుంది. ఈ శేషశేషి తత్వానికి ప్రతీకగా చిన్నశేష వాహనం నిలుస్తుంది. చిన్నశేష వాహనసేవను దర్శించిన భక్తులకు కుండలినీ యోగసిద్ధి ఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. అనంతరం ఉదయం 10 గంటల నుండి కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నిర్వహించారు., రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



### బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు
## సర్వదర్శనానికి 30 గంటలు

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవిసెలవులు ఆపై వారాంతం రావడంతో ఆదివారం శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం నిరీక్షిస్తున్నారు. ఆలయం వెలుపల బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు నిండిపోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోవడంతో వెలుపల వచ్చాయి. శనివారం 97,561వేల మందికి పైగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టిటిడి అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి హుండీకి రూ.3.76 కోట్ల ఆదాయం వచ్చింది. భక్తులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని టిటిడి అధికారులు సూచించారు. సమాచారం అందిన వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి, శ్రీవారి మెట్లు తదితర ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు.



### కాలినడకన తిరుమలకు కేంద్ర మంత్రి రామ్మోహన్

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ఆదివారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుండి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు తిరుపతిలో టిడిపి నేతలు స్వాగతం పలికారు. అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు వచ్చారు. మెట్లమార్గంలో భక్తులను పలకరిస్తూ తదేకంగా భక్తిభావంతో తిరుమలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.



### శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ బుర్రా వంశీరామమోహన్, భారత క్రికెట్‌జట్టు ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ కుటుంబ సభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



### టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి చెందిన పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందించారు. గుంటూరుకు చెందిన మాదాల శేషగిరిరావు ఆదివారం శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. అలాగే గుంటూరుకు చెందిన వడ్లమూడి మిత్రేష్ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,111 లక్షలు విరాళంగా అందించారు. దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలోటిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

# శ్రమకు గుర్తింపు... శ్రామికులకు గౌరవం

- లేబర్ అడ్డాలతో నూతన అధ్యాయం
- కార్మికుల నైపుణ్యాలకు పదును పెట్టేలా స్కిల్ ట్రైనింగ్
- వివాహం నుంచి ప్రసూతి వరకు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్ష
- సేఫ్టీ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక భద్రతలో నూతన ప్రమాణాలు
- భవన నిర్మాణ కార్మికులకు కూటమి భరోసా
- ఇఎస్ఐ ఆస్పత్రులలో సరికొత్త డిజిటల్ విప్లవం
- రెక్కల కష్టానికి రక్షణగా నిలిచిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో కార్మిక శాఖ






**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తూ, సమాజానికి వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లల్లో విప్లవాత్మక అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధాన లోపాలు, నిధుల దారిమళ్లింపుతో కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను పునరుద్ధరిస్తూ కొత్త ఆశలు చిగురింపజేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, అటు పారిశ్రామిక అభివృద్ధిని, ఇటు కార్మికుల ప్రాణ భద్రతను సమానంగా ముందుకు తీసుకెళ్తూ కార్మిక శాఖలో సరికొత్త ప్రగతి ఆవిష్కృతమైంది. కార్మికుని సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, రక్షణే ధ్యేయంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. వివిధ రంగాల్లోని కార్మికులకు స్కిల్ అప్ గ్రేడ్ అయ్యేలా వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇదే సమయంలో వారి గౌరవాన్ని మరింత పెంచేలా లేబర్ అడ్డాలను నిర్మించడం.. వారి సంక్షేమం కోసం నిధులు కేటాయించడం.. అలాగే వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆస్పత్రుల నిర్మాణం వంటివి చేపట్టడం వంటి చర్యలు తీసుకుని కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఈ రెండేళ్ల పాలనలో జరిగిన పరిణామాల బట్టి కచ్చితంగా చెప్పొచ్చు.

**లేబర్ అడ్డాలతో కార్మికులకు సరికొత్త వైభవం:** రోజువారీ ఉపాధి కోసం ఉదయాన్నే రోడ్ల పక్కన, కూడళ్లలో ఎండనక, వాననక నిలబడి ఎదురుచూసే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలతోపాటు ఉమ్మడి జిల్లాల కేంద్రంగా లేబర్ అడ్డాల నిర్మాణాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆధునిక ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్స్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ లేబర్ అడ్డాల ద్వారా కార్మికులకు ఒకే చోట స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులతో పాటు ఉద్యోగ సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్నారు. పని ఉన్నప్పుడు అక్కడి నుంచి పనులకు వెళ్తారు.. పనులు లేనప్పుడు ఆ సమయాన్ని స్కిల్ అప్ గ్రేడ్ చేసుకునేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లోని కార్మికులకు ఉన్న అనుభవానికి టెక్నాలజీని జోడిస్తే.. వారికి మరింత మెరుగైన ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో నైపుణ్యాలు కల్పించేలా కటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కార్మికులను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర నిర్మాణంలో వారిని కీలక భాగస్వాములను చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మందికి పైగా నమోదైన అసంఘటిత కార్మికులు ఉండగా, అందులో 18 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత ఐదేళ్ల కాలంలో డూప్లికేషన్ సాకుల పేరిట, నిధుల దారి మళ్లింపుతో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు ధీమా కల్పిస్తూ ప్రసూతి సహాయం కింద రూ.20 వేలు, వివాహ కానుకగా రూ.40 వేలు అందిస్తోంది. అలాగే ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే రూ.20 వేల సహాయం, అంత్య క్రియల ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు అందించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు అందిస్తోంది. పారదర్శకత, బాధ్యత, భద్రత అనే మూడు సూత్రాలతో ఫ్యాక్టరీల శాఖను ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్లాంట్లలో ప్రమాదాల నివారణకు జులై 2024లో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంది. కార్మికుల ప్రాణాలకు రక్షణగా సేఫ్టీ అలర్ట్, ఇన్సిడెంట్ అలర్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రారంభించడమే కాకుండా, ప్రమాదకర రసాయన కర్మాగారాల పర్యవేక్షణకు కెమికల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల సృష్టికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జెఎన్‌టియు, ఎస్‌వియు వంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, 360 పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు, వందలాది మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా పారిశ్రామిక భద్రతలో ఏపి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది.

**ఇఎస్ఐ వైద్య సేవల్లో చారిత్రాత్మక మార్పులు:** రాష్ట్రంలోని 15 లక్షల మంది ఇన్సూర్డ్ పర్సన్స్ ఆరోగ్య రక్షణే ధ్యేయంగా భీమా వైద్య సేవల శాఖను ప్రభుత్వం పూర్తిగా ఆధునీకరించింది. అచ్యుతాపురంలో కొత్త ఇఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగగా, తిరుపతి ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 100కు పెంచింది. గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, నెల్లూరు ప్రాంతాలలో కొత్త ఆసుపత్రుల కోసం భూములను కేటాయించారు. విశాఖపట్నంలో 50 సీట్లతో కూడిన ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరు కావడం, అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలతో భవిష్యత్ వైద్య అవసరాలకు ఇప్పటి నుంచే కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను రూ.78 లక్షలతో పునరుద్ధరించి, సరికొత్త మొబైల్ యాప్‌ల (మైహెల్త్.ఈ ఔషధి) ద్వారా ఔషధాల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతను తెచ్చింది. పెట్టుబడుల రాకతో పరిశ్రమలు వృద్ధి చెందడమే కాకుండా, కార్మికుల ప్రాణాలకు, ఆరోగ్యానికి ధోకా ఉండకూడదనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగింది.

# పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్‌ల పంపిణి



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామనే మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్ఓసిలను ఎప్పటికప్పుడు అందిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలకు కష్టకాలంలో అండగా నిలబడుతున్నామని పేర్కొన్నారు. సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిగా మారిందని తెలిపారు. జగన్ హయాంలో సకాలంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు చెల్లించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ధ్వజమెత్తారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలని సిఎం చంద్రబాబు మొదటి నుంచి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పేదలకు ఆర్థికంగా చేయూతను ఇచ్చేలా సిఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా సిఎం సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి పేదవాడికి సిఎం రిలీఫ్ ఫండ్ రూపంలో రూ.8 కోట్లు ఇప్పటి వరకు అందజేశామని తెలిపారు. ఆదివారం విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 63 మంది లబ్దిదారులకు మంజూరైన రూ.87 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్ఓసిలను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవ చేస్తున్నారని ప్రశంసించారు. రాత్రింబవళ్లు కష్టపడుతూ, ఎక్కడ ఎవరికీ ఏ ఇబ్బంది వచ్చినా ఆయన సొంతంగా సాయం అందజేస్తున్నారని కొనియాడారు. 20 సంవత్సరాల నుంచి ఇక్కడ పేదవాళ్లకు తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. తాము ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేసినప్పుడు కూడా తమ అందరికీ అన్నగా ఉండి, తమకొక దిక్సూచిగా గద్దె రామ్మోహన్ ఉన్నారని మంత్రి అనగాని ప్రస్తావించారు. విజయవాడలో 22,000 మందికి రాబోయే రోజుల్లో పట్టాలు రానున్నాయని తెలిపారు. గద్దె రామ్మోహన్‌తో పాటు, ఇతర ఎమ్మెల్యేలు విజ్ఞప్తి మేరకు సిఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇవన్నీ రాబోయే ఒకటి, రెండు నెలల్లో రూపకల్పన కాబోతున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

### నేడు విజయవాడలో ఎంఎస్ఎంఇ గ్రోత్ సమిట్

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఈ నెల 25న ఎంఎస్ఎంఇ గ్రోత్ సమిట్ 2026 ప్రభుత్వం నిర్వహిస్తుంది. అంబేద్కర్ స్మృతివనంలోని భారీ కళావేదికలో నిర్వహిస్తున్న అతి పెద్ద ప్రభుత్వ కార్యక్రమం ఇది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఇ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్ఎంఇ రంగానికి చెందిన పారిశ్రామిక వేత్తలు, పిఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థలు సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. రాష్ట్రంలో ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక మౌలిక వసతులను కల్పించే లక్ష్యంతో ఈ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజక వర్గంలో 175 ఎంఎస్ఎంఇ పార్కులను ఏర్పాటు చేసే లక్ష్యంలో భాగంగా మూడో విడతలో ఈ 38 ఎంఎస్ఎంఇ పార్కులకు వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఎంఎస్ఎంఇల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ సహా పలువురు మంత్రులు పారిశ్రామిక వేత్తలు సదస్సులో పాల్గొననున్నారు.



**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలింగ్ బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రతి బిజెపి కార్యకర్తను ఒక సమర్థవంతమైన నాయకుడిగా

# కార్యకర్తలే బిజెపికి అసలైన బలం

- కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ
- స్పష్టమైన సిద్ధాంతం, జాతీయవాదం పునాదిగా ఏర్పడిన ఒక గొప్ప కుటుంబం బిజెపి
- బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నాయకులను తీర్చిదిద్దడమే ప్రశిక్షణ లక్ష్యం
- పునాదిపాడులో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్

తీర్చిదిద్దడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ప్రశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం, పునాదిపాడు గ్రామంలోని కనకమేడల గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, స్పష్టమైన సిద్ధాంతం, జాతీయవాదం పునాదిగా ఏర్పడిన ఒక గొప్ప కుటుంబమని కొనియాడారు. జిల్లా ప్రశిక్షణ వర్గ్‌లో భాగంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ బిజెపి ఘన చరిత్ర, పార్టీ నడుస్తున్న సిద్ధాంత పటిమ, అంత్యోదయ విలువల గురించి సవివరంగా వివరించారు. దేశాభివృద్ధే ఏకైక లక్ష్యంగా, పార్టీ ఆశయాలకు కట్టుబడి నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తే భారతీయ జనతా పార్టీకి నిజమైన బలమని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, సమాజ నిర్మాణంలోనూ కార్యకర్తలు పోషించాల్సిన బాధ్యతలపై ఆయన దిశానిర్దేశం చేశారు. అంతకుముందు బిజెపి ముఖ్య నాయకుల చరిత్ర, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ ప్రశిక్షణ కార్యక్రమంలో పార్టీకి చెందిన జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జులై 1 నుంచి 'విబి-జి రామ్‌జి' అమలులోకి

- ఉపాధి హామీ 125 రోజులకు పెంపు
- మౌలిక వనరులు, ఆస్తులు సృష్టి పనులే ఎక్కువ
- జిల్లా స్థాయిలో కలెక్టర్, క్షేత్రస్థాయిలో పంచాయితీ అధికారులే సమన్వయకర్తలు




**న్యూఢిల్లీ, మే 24:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకం స్థానంలో ఎన్డీయే ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విబి జి రామ్‌జీ 2026 చట్టాన్ని జులై ఒకటినుంచి అమలులోకి తెస్తోంది. గ్రామీణ వేతన ఉపాధిని మరింత విస్తృత పరిచి ఉత్పాదక ఆస్తుల సృష్టికి ప్రాధాన్యతనిస్తున్న ఈ చట్టం వికసిత్ భారత్ 2047 సాధన దిశగా మరింత పటిష్టంగా పనిచేస్తుందని కేంద్రం చెపుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచారు. కొత్త పథకానికి గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకూ ప్రస్తుత ఎంఎన్‌జిరేగా కార్డులు చెల్లుబాటు అవుతాయని, దరఖాస్తు చేసిన 15 రోజుల లోపు ఉపాధిని విధిగా కల్పించాలని చట్టంలో సూచించారు. కూలీ వేతనాలను డిబిటి ద్వారా నేరుగా కార్మికుల బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాల్లోకి వారానికి ఒకసారి లేదా గరిష్టంగా పని ముగిసిన పక్షం రోజులలోపు చెల్లించాలి. వేతనాలు 15 రోజులకు మించి జాప్యం జరిగితే, అప్పటినుంచి ప్రతిరోజుకు చెల్లించని వేతనాల్లో 0.05శాతం చొప్పున కార్మికులు నష్టపరిహారం పొందే అర్హత కూడా కలిగి ఉంటారు. మొదటి 30 రోజులకు ప్రకటించిన వేతన రేటులో కనీసం నాలుగో వంతు ఆ తర్వాత కనీస ఉపాధి అంతరాయం లేకుండా చూపించాల్సి ఉంటుంది. జులై ఒకటవ తేదీనాటికి కొనసాగుతున్న పనులన్నీ కూడా కొత్తచట్టంపరిధిలో కొనసాగుతాయని, వాటిని కూడా పూర్తిచేయాల్సి ఉంటుందని చట్టం చెపుతోంది. పనులు అంతరాయం లేకుండా ఉపాధికి అడ్డంకి లేకుండా కేంద్రం అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు తగినంత కార్మిక బడ్జెట్‌లు అందు బాటులో ఉంచింది. సరిపోని పక్షంలో కొత్త చట్టంలోని షెడ్యూల్‌కి అనుగుణంగా రాష్ట్రాలు కొత్తపనులు చేపట్టాలి. ముఖ ధృవీకరణద్వారా కార్మిక నమోదు జరుగుతుంది. కనెక్టివిటీ లేని ప్రాంతాలకు మినహాయింపు ఉంది. ఇంటికి వీలైనంత దగ్గరగా పని కల్పించాలి. ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలి. ఆదూరం దాటితే కార్మికులకు అదనంగా 10శాతం చెల్లిస్తారు. ఈ పనులన్నీ కూడా మానవ వనరులతోనే జరగాలని, యంత్రాలను వినియోగిస్తే కఠిన చర్యలుంటాయని కేంద్రం చెపుతోంది. వికసిత్‌గ్రామ్ పంచాయతీ ప్రణాళిక కేంద్రంగా ఈ పనులుంటాయి. పంచాయితీ పరిధిలోనే పనులన్నీ చేపట్టాల్సి ఉంటుంది. ఒకే ప్రణాళిక బహుళ నిధులు అనే వ్యవస్థనుప్రోత్సహిస్తూ కేంద్రరాష్ట్ర స్థానిక పథకాలతో సమన్వయానికి వీలు కల్పిస్తుంది. పిఎంఎవై జి కింద చేపట్టే గృహనిర్మాణ పనులను కూడా 90నుంచి 95రోజుల వేతన మద్దతుకింద పనులు చేపట్టవచ్చని కొత్తచట్టం చెపుతోంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ సమన్వయకర్త అవుతారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పనుల నమోదు అమలు రికార్డుల నిర్వహణ వంటివి చేపడతాయి. ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు కేంద్రం 90శాతం, రాష్ట్రాలు 10శాం నిదులు భరిస్తాయి. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు భర్తీచేస్తాయి. శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు నూరుశాతం కేంద్ర నిధులు అందుతాయి. కొత్తచట్టం కింద పెంచిన వేతన రేట్లను కూడా నోటిఫై చేస్తారని అప్పటివరకూ ఎంజిఎన్‌రేగా వేతనరేట్లే అమలవుతాయని కేంద్రం వివరించింది. గ్రామీణ స్థాయిలో మౌలిక వనరుల సృష్టి, నీటివనరుల సంరక్షణ, వంటి అత్యవసర పనులకు కూడా విబిజిరామ్‌జీ చట్టంకింద ఉపాధి కల్పించాలని ఎన్డీయే సర్కారు ఉత్తర్వులు జారీచేసింది.

వార్త

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.

- సెనెకా

# సమ్మె హక్కుకు సర్వోన్నత ముద్ర!

కార్మికుడి గళం 'సమ్మె హక్కు'కు అంతర్జాతీయ న్యాయస్థానం రాజముద్ర వేసింది. ప్రపంచ కార్మిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. కార్మికుడు తన గళాన్నివినిపించే ఒకేఒక సాధనం సమ్మె. తద్వారా తమ డిమాండ్లను వినిపించడం, చర్చించడం, దాని లోతుపాతుల విషయమై యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళడం లోని ఔచిత్యాన్ని అంతర్జాతీయ కార్మిక న్యాయ స్థానం సబబేనని పేర్కొనడమంటే కార్మిక లోకపు హక్కుల మీద పాలు పోసినట్లే. జీతాలు పెంచమని అర్థించినా, పని గంటలు తగ్గించమన్నా, భద్రత కల్పించమని కోరినా, లింగ వివక్ష చూపవద్దని ప్రాధేయపడినా యజమాన్యం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉంది. వినకపోతే కార్మికుడి చేతికి అందిన చివరి ఆయుధం సమ్మె మాత్రమే. అందుకే సమ్మె హక్కును నిరాకరించడం అంటే కార్మికుడిని మౌన బానిసగా మార్చడమే. 2024 గ్లోబల్ రైట్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచంలోని చాలా దేశాలు సమ్మె హక్కును పరిమితం చేయడం మొదలు పెట్టాయి. అనేకచోట్ల యూనియన్ నాయకుల అరెస్టులు కూడా పెరిగాయి. ఇలాంటి నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయస్థానం వెలువరించిన అభిప్రాయం కార్మిక వర్గాలకు ఒక మానసిక బలాన్ని అందిస్తోంది. ఐక్యరాజ్యసమితి అత్యున్నత న్యాయస్థానం అయిన ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్ కార్మికులకు 'సమ్మె హక్కు' అంతర్జాతీయ కార్మిక హక్కులలో అంతర్భాగమని స్పష్టంచేసింది. ఈ అభిప్రాయం అంతర్జాతీయ కార్మిక సంస్థ కోరిన మేరకు సలహా అభిప్రాయం రూపంలో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలకు, ట్రేడ్ యూనియన్లకు, శ్రమ హక్కుల ఉద్యమాలకు ఒక నూతన నైతిక బలం. 1948లో ఆమోదించబడిన ఐఎల్ఓ కన్వెన్షన్ నం. 87లో 'సమ్మె' అనే పదం ప్రత్యక్షంగా లేకపోయినా, 'సంఘ స్వేచ్ఛ'లహక్కులో భాగంగానే సమ్మెహక్కు ఉందని ఐఎల్ఓ నిపుణుల కమిటీ దశాబ్దాలుగా భావిస్తోంది. అయితే 2012 తర్వాత కొన్ని యజమాన్య వర్గాలు ఈ వ్యాఖ్యానాన్ని వ్యతిరేకించాయి. ఒప్పందంలో స్పష్టంగా లేని హక్కును ఎలా చట్టపరంగా గుర్తిస్తారు? ఈ వివాదం అంతర్జాతీయ కార్మిక వ్యవస్థలోనే సంక్షోభాన్ని తెచ్చింది. చివరకు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐఎల్ఓ, అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనం, ప్రసూతి సెలవులు, బాలకార్మిక నిషేధం ఇవన్నీ సమ్మెల కారణంగా సాధించుకున్న ఫలితాలే. వాటి పర్యవసానం కార్మిక సంక్షేమమే అయినప్పుడు, వాటిని వద్దనే పరిస్థితి ఉండదు. అందుకే ఉద్యమాలే ఆధునిక కార్మిక చట్టాలకు పునాదిగా భావించాలి.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ కార్మిక సంక్షోభ సమయంలో ఈ తీర్పు అందరికీ శిరోధార్యమే. ప్రపంచవ్యాప్తంగా 'గిగ్ ఎకానమీ', కాంట్రాక్టు ఉద్యోగాలు, ప్రైవేటీకరణ, ఆటోమేషన్ పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గుతోంది.ట్రేడ్ యూనియన్ల శక్తి క్షీణిస్తోంది.భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా 'సమ్మెహక్కు'ని ప్రాథమిక హక్కుగా గుర్తించక పోయినా సామాజిక స్వేచ్ఛకు శిఖరాయమాన ప్రాధాన్యతనిస్తూనే ఉంది. భారతదేశంలో తరచుగా ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెలపై ఆంక్షలు,నిత్యావసర సర్వీసుల చట్టాలు,కార్మిక చట్టాల మార్పులు వివాదాలకు దారితీస్తుంటాయి. కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి వస్తున్న తరుణంలో ఈ అభిప్రాయానికి ప్రాముఖ్యత సంతరించుకుంది.భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో కార్మికుడి గొంతుకను వినడం ప్రభుత్వ బాధ్యత.సమ్మెను శత్రుత్వంగా కాకుండా సామాజిక సంభాషణలో భాగంగా చూడాల్సిన అవసరాన్ని గుర్తించడం అవసరం. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రస్తావించిన అంశాలలోసమ్మె హక్కు అపరిమితం కాదు. అత్యవసర సేవలు, ప్రజాభద్రత, ఆరోగ్య రంగం వంటి కొన్ని సందర్భాల్లో పరిమితులు ఉండవచ్చు.కానీ ఆ పరిమితులు ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయబద్ధంగాఉండాలి. సమ్మెలు లేకపోతే తక్కువ జీతాలు,అధిక పని గంటలు, అసురక్షిత పరిస్థితులు పెరిగే ప్రమాదంఉంటుంది. ఎక్కడైనా, ఏసందర్భంలోనైనా హక్కులతో పాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపాడబడతాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మె హక్కుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సమ్మె ఒక శక్తివంతమైన ఆయుధం కాబట్టి, దాని వినియోగంలో సమతౌల్యం అవసరం. అలాంటప్పుడే హక్కుల సంరక్షణకు తిరుగులేదన్న మాటే! తరచుగా సమ్మెలు జరిగే ప్రాంతాల్లో పెట్టుబడిదారులు వెనుకంజవేయవచ్చు.దీంతో కొత్త పరిశ్రమలు రావడం తగ్గుతుంది.కొన్ని సందర్భాల్లో సమ్మెలు కార్మిక సమస్యలకంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించబడతాయి.అసలు కార్మిక సమస్యలు పక్కకు వెళ్లిపోతాయి, ఈ విషయంలో జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ప్రజల్లో సమ్మెలపై వ్యతిరేక భావన పెరుగుతుంది.ఎక్కడైనా, ఏ సందర్భంలోనైనా హక్కులతోపాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపాడబడతాయి. భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా సమ్మె హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించలేదు. కానీ సంఘస్వేచ్ఛను హామీఇస్తుంది.భారత కోర్టులుపలుమార్లు సమ్మెల సందర్భంగా హితవుపలికినసందర్భాలున్నాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మెహక్కుపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతున్న సందర్భంలో ఈతీర్పు స్వాగతించదగినది. నియంత్రణలేని సమ్మెలు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. కార్మికుడి గౌరవాన్ని కాపాడే సాధనం.సమ్మెలవల్ల సమాజంలో అనేక చారిత్రాత్మక మార్పులువచ్చాయి.అయితే సమ్మె ఒక శక్తివంతమైన ఆయుధం కాబట్టి, దాని వినియోగంలో సమతౌల్యం అవసరం.

ఒక అవకాశం చేజారిపోతే కళ్ల నీళ్లు పెట్టుకోకు. మరొక అవకాశం చేజారిపోకుండా జాగ్రత్తపడు.



అబ్రహాం లింకన్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టానిస్లావిస్కి

## ప్రజావాక్కు



### 'బొద్దింక'ల పార్టీ

ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లోబొద్దింకల జనతా పార్టీ ఒక సెన్సేషన్. కుక్కకీ ఒక రోజొస్తుంది అన్న ఇంగ్లీషు సామెత లాగానే బొద్దింకలకీ ఒకరోజు వచ్చినట్టుంది. ఇప్పుడా పేరుట్రెండ్ అయ్యింది దేశమంతా.సాధారణంగా బొద్దింకల్ని చూడడానికి ఎవరూ ఇష్టపడరు. చివరకి హిట్ యాడ్‌లో కూడా. అబ్బే,తిండి తింటున్న టైమ్‌లో టీవీలోఈయాడ్ ఏమిట్రా బాబూ అనుకుంటారు ఎక్కువ మంది. అలాంటిది దేశమంతా ఈ పేరు ట్రెండ్ అవ్వడం అంటే దాన్నే 'టైమ్ బాబూ టైమ్' అంటారు.ఇక విషయానికి వస్తే అసలు బొద్దింకకీ ,దీనికీ ఏ సంబంధమూ లేదు. ఒక రకంగా ఇది బుద్ధింకల పార్టీ. ఎందుకంటే దీన్నిస్థాపించింది, ప్రాచుర్యం చేస్తున్నదీ బుద్ధిమంతులైన యువకులు. దేశ ప్రధాన న్యాయమూర్తి ఒక తీర్పులో కొందరు యువకుల్ని ఉద్దేశించి బొద్దింకలతో పోల్చారన్న వార్తకి స్పందనగా ఈ వ్యంగ్య పక్షం అంకురం దాల్చింది. యువత పెద్ద ఎత్తున రాజకీయాల పట్ల, సామాజిక సమస్యల పట్ల దృష్టి సారిస్తే అది దేశానికి మంచిది.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### ఏదీ శాశ్వతం కాదు

అద్దెఇంట్లో కొందరు కొంతకాలం ఉంటారు. మరికొందరు చాలా కాలం ఉంటారు.అంతేకాని అద్దె ఇంట్లో ఎల్లకాలం ఉండటానికి ఎవరికి కుదరదు. లోక్‌సభ, శాసనసభలు కూడా అద్దె ఇళ్ల లాంటివే.అందులో ఉండే ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు,ఎమ్మెల్యేలు, ఎంపిలు మంత్రులుఎప్పుడో ఒకప్పుడు వాటినుంచి బయటికి పోవల సిందే. వారి స్థానంలో మరొకరు రావలసిందే. గతంలో ఇలా ఎంతోమంది వచ్చారు,పోయారు.అలానే ఎక్కడో ముఖ్యమంత్రులు అద్దెఇళ్లని ఖాళీచేస్తే ఇక్కడసంబరాలు ఎంటో.

- మిథునం,హైదరాబాద్

### రైతులకు ఆసరా కల్పించాలి

ఈ సీజన్లో తెలంగాణలో ఎక్కువ మొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి.తెలంగాణ వ్యవసాయంలో ఉత్పత్తి ఉత్పద్ధకతను పెంచడంలో పూడిక తీత పనులు ఉపయోగపడుతాయి.తెలంగాణలో నీటి వసతులు వివిధ మార్గాల ద్వారా పెరిగినా ఇప్పటికీ స్థిర నీటి వసతిలేని మారుమూల గిరిజన గ్రామాలున్నాయి.కుంటలు చెరువులు పూడికతీయించడం ఉపాధి హామీపథకం కిందవచ్చేట్టు చూసిరైతులకు ఎంతోకొంత ఆసరా కల్పించాలి.

- భారత అవినాష్, జనగామ

### పంటలను కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న, వరివంటి పంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరో పక్క ప్రగతి పేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొనిరోజులు తరబడి ఎదురుచూస్తున్న అధికారులు రావడం లేదంటూకొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరో వైపు ఈదురు గాలులవల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు.వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వంవిఫలమైందని చెప్పవచ్చు. రైతులపట్లప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. భవిష్యత్తు ప్రణాళికలు లేక యూరియా కష్టాలు వంటివి ఎన్నో చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వంలోఒకరకంగా రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### పెరుగుతున్న లింగ వివక్ష

భారతదేశంలో ఆర్థిక,సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్షరూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది. వివాహం, పిల్లల పెంపకం వల్ల కెరీర్ మధ్యలోనే ఉద్యోగాలు వదిలివేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో భద్రతా లోపాలు, వేధింపులు వేధిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ధైర్యమే ఆయుధం

నేటి సమాజంలో యువత పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననో, ఇంటర్వ్యూలోఉద్యోగంరాలేదని క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్న యువతరం పిల్లలు ఎంతో మందిని చూస్తున్నాం. మనకోసం మన కుటుంబం ఎల్లప్పుడూ వేచింటుంది అనేది ఆలోచన చేయాలి. రాబోయే భవిష్యత్ కాలం అంత మనదే, ఈ ఉద్యోగం కాకపోతే ఇంకో జాబ్ అనే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితేనే భవిష్యత్ జీవితాలు బాగుంటాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆదాయార్జనకే పెట్రో వడ్డింపులా?

ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణల సూచనలమేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకోవాలని ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాలలో మోసం చేయడం సాధ్యం కాదనే విషయం గుర్తించాలి.



అన్నవరపు బ్రహ్మయ్య

కేంద్ర ప్రభుత్వం ఆదాయమే పరమార్థంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచడంతోపాటు పెట్రోల్లో ఎథనాల్ కల్తీ చేయటానికి సిద్ధమవుతోంది. అమెరికా, ఇరాన్ యుద్ధం పేరు చెప్పి అనుకొన్నట్లుగానే కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు 3 నుంచి 3.50 రూపాయలకు పెంచింది. ఇదే సమయంలో పెట్రల్లో ప్రస్తుతం కలుపుతున్న 10 శాతం ఇథనాల్‌ను 20 శాతానికి పెంచడానికి రంగం సిద్ధం చేస్తోంది. పెరిగిన ధరలు ప్రజలకు భారంగా అనిపించకూడదనే ఎత్తుగడలో భాగంగా ఆయిల్ కంపెనీల ద్వారా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు కృత్రిమ కొరతను సృష్టించి, ధర సంగతి ఎలా వున్నా అసలు పెట్రోల్, డీజిల్ దొరికితే చాలనే రీతిలో ప్రజలను మానసికంగా సిద్ధం చేసి, తర్వాత రెండు దఫాలుగా ధర పెంచింది. అయినా పెరిగిన ముడిచమురు ధరలతో పోల్చితే పెరిగిన, పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు చాలా తక్కువ అంటూ ఆంగ్ల జాతీయ పత్రికలలో వార్తలను వండి వడ్డిస్తోంది. దీనిని బట్టి మరోసారి పెట్రోలియం ధరల పెంపునకు రంగం సిద్ధం అవుతున్నట్లు అర్థం అవుతోంది. ప్రజలపై పన్నుల భారం మోపడంలో ముందుండే కేంద్ర ప్రభుత్వం నిజానికి యుద్ధం ప్రారంభమైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచివుండేది. కానీ ఇటీవల వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల పుణ్యమా అని కొంత అలక్ష్యంగా ధరలు పెంచింది. పెట్రోలియం ధరలతో మాకేమి సంబంధం లేదు, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ఆయిల్ కంపెనీలు ధరలు స్థిరీకరించుకొంటాయంటూ కేంద్రప్రభుత్వం అనేకమార్లు ప్రకటించింది. కాని అదే కేంద్రప్రభుత్వం అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోతున్నప్పుడు పన్నుల మీద పన్నులు, సెస్లను విధిస్తూ తగ్గిన పెట్రోలియం ధరలు ప్రజలకు అందకుండా శాయశక్తులా ప్రయత్నం చేసింది.మనదేశంలో ఆర్థిక సంస్కరణలు అమలులోకి రావడానికి పూర్వంఅంటే 1980 సంవత్సరానికి ముందు వరకు దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్రోలియం రిజర్వుపూల్ మనీ వుంది. అంతర్జాతీయంగా పెట్రోలియ ఉత్పత్తుల ధరలలో ఒడిదుడుకులు వచ్చినప్పుడు ధర నియంత్రణ, క్రమబద్ధీకరణ నిమిత్తం ఈ నిధిని వినియోగించేవారు. అయితే ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలోని చమురు కంపెనీలకు ధరల నిర్ణయంలో స్వేచ్ఛనిచ్చి, ఇక ధరలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పి క్రమంగా రిజర్వుపూల్ మనీని కేంద్రప్రభుత్వం వినియోగించుకొంది. ధరల నిర్ణయం విషయంలో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛనివ్వడంతో అంతర్జాతీయం పెట్రోలియం ధరలను చూపిస్తూ ఆయిల్ కంపెనీలు మూడు అడుగులు ముందుకి, ఒక అడుగు వెనక్కి అన్న తరహాలో పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచాయి. కోట్ల రూపాయల లాభాలు పొందాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు విపరీతమైన లాభాలు పొందాయి. యుపిఎ ప్రభుత్వం తరపున మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 160 డాలర్లు వుంది. అయినా లీటరు పెట్రోల్ ధర 74 రూపాయలకే అందించారు. ఎన్డీయే ప్రభుత్వం తర్వాత అంతర్జాతీయ చమురు కంపెనీల మధ్య పోటీ పెరగడంతోపాటు రష్యాపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో బ్యారెల్ ధర రెండొంతులకు పడిపోయి బ్యారెల్ 46డాలర్లకు చేరింది. ఆ సమయంలో అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా కనీసం లీటరుపెట్రోల్ 25 రూపాయలకు తగ్గిపోవాలి. కానీ ఎన్డీఏ ప్రభుత్వం ధర



తగ్గించకపోగా వివిధకారణాలు చెబుతూ పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల మీద పన్నులు, సెస్లు విధిస్తూ క్రమంగా లీటరు పెట్రోల్ ధరను 74 నుంచి 109 రూపాయలకు పెంచుతూ వచ్చింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలో దాదాపు 50శాతం పన్నులే వున్నాయి.నిజానికి కేంద్ర ప్రభుత్వం తొలుత పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సయిజ్ (దిగుమతి సుంకం) విధించాలి. ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ రిటైల్గా అమ్ముతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సేల్స్ టాక్స్, టర్నోవర్ టాక్స్ విధించాలి. అయితే కేంద్రం ప్రభుత్వంపెట్రోలియం ఉత్పత్తులపై బేసిక్ ఎక్సైజ్‌టాక్స్ మాత్రమే విధించాలి.కానీ బేసిక్ టాక్స్ పూర్తిస్థాయిలో పెంచిన తర్వాత ఇంకా పెంచడానికి అవకాశం లేకపోవడంతో సెస్ ఆన్ ఎక్సయిజ్, మౌలిక సదుపాయాల సెస్ పేరుతో నాలుగు రకాలుగా విభజించి పన్నువేస్తోంది. ఈ కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ ఫలితం ప్రజలకు చేరకుండా లక్షల కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం కాజేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు బంక్ల నుంచి అమ్మకపు పన్నుతోపాటు టర్నోవరు టాక్స్‌తోపాటు రోడ్ సెస్, ఎడ్యుకేషన్ సెస్ పేరుతో లీటరు రూపాయి వంతున అదనంగా వసూలు చేస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో బ్యారెల్ ధర 100 నుంచి 110 డాలర్ల మధ్య వున్నప్పటికీ మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో క్రూడ్ అయిల్ బారెల్ ధర 148 డాలర్లతో పోల్చితే తక్కువగానే వుంది. అయినా ఏదో కారణంగా ఏదో జరిగిపోతుందనే ధోరణిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం మరల సిద్ధం అవుతోంది. ప్రస్తుతం క్రూడ్‌ఆయిల్ ధరలు 110 డాలర్లకు చేరినప్పటికీ పన్నుల మీద పన్నులు, అన్యాయంగా విధిస్తున్న సెస్లలు లేకపోతే మనకు లీటరు పెట్రోల్ న్యాయబద్ధంగా వసూలు చేసే పన్నులతో కలుపుకొని 82 రూపాయలకే లభిస్తుందని ఆయిల్ రంగనిపుణులు చెబుతున్నారు.ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా రష్యాకు చెందిన క్రూడ్ ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు వున్నాయి. ఆ సమయంలో రష్యాతో మన దేశానికి వున్న స్నేహసంబంధాల నేపథ్యంలో రష్యా చాలా చౌకగా క్రూడ్ ఆయిల్ సరఫరా చేసింది.అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గించలేదు. ఇరాన్ అమెరికా యుద్ధం జరుగుతున్నప్పటికీ రష్యా మన దేశానికి అంతర్జాతీయ ధరల కంటే తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తూనే వుంది. ఈ విషయాన్ని బహిర్గతం చేయకుండా మరల పెరిగిన క్రూడ్‌ఆయిల్ ధరలకు అనుగుణంగా ధరలు పెంచలేదని, అందువల్ల మరోసారి ధరలు పెంచడానికి సిద్ధం అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇక ఇథనాల్ విషయానికి వస్తే దేశీయంగా చౌకగా లభించే ఇథనాల్ ద్వారా కూడా కేంద్రప్రభుత్వం భారీగా ఆదాయం పొందుతోంది. మనదేశంలో దాదాపు 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు ఆయిల్ కంపెనీలు 10 శాతం మేరకు పెట్రోల్లో ఇథనాల్ కలుపుతోంది. ఈ మొత్తాన్ని 20 శాతానికి పెంచే ఆలోచన చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఇథనాల్ చెరకు పిప్పి, మొక్కజొన్న నుంచి దేశీయంగా, చౌకగా తయారవుతుంది. దీనికి ఎక్సైజ్‌సుంకం వుండదు. కానీ ప్రభుత్వం పెట్రోల్లో కలపడం ద్వారా ఇథనాలు కూడా ఎక్సైజ్ సుంకం కలపడంతోపాటు పెట్రోల్తో సమానంగా ప్రజల నుంచి ధరవసూలు చేస్తోంది.ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణల సూచనల మేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10 శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకొనేందుకు ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాల లో మోసం చేయడం సాధ్యం కాదనే విషయం గుర్తించాలి. ●

# పొగాకు విషవాయువు పట్ల బహు పరాక్!

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచ మానవాళికి పెనుశాపంగా పరిణమించిన ఈ పొగాకు వాడకం మూలాన ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మరణించడమే కాదు, వీరిలో 12 లక్షల మంది పరోక్ష ధూమపానం వల్ల కూడా మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణ్నాకాలు తెలియజేయడంతో వీటి వాడకం ఎంతటి ప్రమాద ఘంటికాలు మ్రోగిస్తున్నాయో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా ప్రపంచ మానవాళి విలువైన ప్రాణాలను అనంత వాయువుల్లో కలిపి వేస్తున్న ఈ పొగాకు విష వాయువులో భాగమైన హుక్కా, చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీవాడకం మూలాన అవి మన ఆరోగ్యంపై పలువిధాలా దుష్పరిణామాలు చూపుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అంతేగాకుండా పొగాకు వాడకంలో భారతదేశం రెండవ స్థానంలో ఉండటం, పొగాకు నుంచి వెలువడే పొగలో 40,000 పైగా హానికరమైన రసాయనాలు ఉండటం, అందులో 70కి పైగా అత్యంత అపాయకరమైన క్యాన్సర్ కారకాలు ఉండటం మనల్ని ఎంతో గగ్గుర్పాటుకు, ఒకింత భయాందోళనలకు గురిచేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అదేవిధంగా పొగాకు వాడకంలో భాగమైన ధూమపానం చేసే వారికే కాకుండా ప్రక్కన ఉండి ఆ పొగ పీల్చేవారికి కూడా పెను ప్రమాదం పొంచి ఉండటం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఇంకా చెప్పుకుంటూపోతే ధూమపానం వల్ల వచ్చే క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్లు, నోటి క్యాన్సర్లు, అన్నవాహిక, కడుపు,మూత్రాశయం, మూత్రపిండాల క్యాన్సర్లు ముఖ్యమైనవిగాప్రపంచ



ఆరోగ్య సంస్థ నిపుణులు నిర్ణయించిన నేపథ్యంలోయావత్ ప్రపంచ మానవాళి ఈ పొగాకు వాడకం విషయంలో ఎంతటి అప్రమత్తాన్ని పాటించాలో,వాటిని ఎంత దూరం పెట్టి మన విలువైన ఆరోగ్యాలను కాపాడుకోవాలో అంతా మన వివేకంపై ఆధారపడి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే యావత్తు మానవాళి పొగాకు వాడకానికి ఎంత దూరంగా ఉంటే అంతగా మన జీవితాలు నిండు,నూరేళ్ల ఆరోగ్యవంతంగా, పిల్లాపాపలతో అత్యంత దిగ్విజయంగా సాగిపోవడం తథ్యం. అన్నింటికి మించి మన పెద్దలు సెలవిచ్చినట్లుగా 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నీతి సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలంటే మాత్రం పొగాకు వాడకానికి అల్లంతా దూరంలో ఉంటూ,దానికి సంపూర్ణంగా రాం రాం చెప్పడం,పూర్తిగా మంగళం పాడటం మనందరికీ కూడా ఎంతైనా సర్వదా శ్రేయస్కరం. ఏదిఏమైనా పొగాకులో వుండే క్యాన్సర్ కారక రసాయనాల వల్ల కేవలం ఒకే రకమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదమే గాక 36 రకాల క్యాన్సర్లు సైతం వచ్చే అవకాశాలు పొంచి ఉండటంతో ఈ పొగాకు విషవాయువు ఏ స్థాయిలో మానవాళి ప్రాణాలతో చెలగాటమాడుతుందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏమైన మనం పొరపాటున ఈ పొగాకు వాడకానికి అలవాటు పడ్డామంటే మన రోగనిరోధక శక్తి తగ్గటంతో పాటు గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధి, మూత్రపిండాలు చెడిపోవడం, టీబీ వ్యాధులు, మధుమేహం, కంటి, వినికిడి సమస్యలు, చిగుర్లకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉండటంతో, మనకు ఒకవేళ పొగాకు వాడకం అలవాటు వుంటే ఎలాగైనా ఈ పొగాకు వాడకానికి గుడ్ బై చెప్పాల్సిందే. లేదంటే మన అమూల్యమైన ఆరోగ్యాన్ని కోరికోరి మనమే పాడుచేసుకున్న వారమవుతాము.తద్వారా మనకు మరణం సంభవించడానికిమనంతకు మనమే రాచబాట ఏర్పరచుకొన్న వారమవుతాం. ●

# సమగ్ర జనగణనే అభివృద్ధికి మూలం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

అనేక గణాంక వివరాల ప్రకారం దేశంలో 80శాతం జనాభా ప్రభుత్వ రాయితీలతో అభివృద్ధిలోకి రావాలని తాపత్రయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. పేదరికం పెరిగిపోయింది. కులాల గణాంకాలు తెలియకపోతే పేదరికాన్ని అంచనా వేయలేం. ఇటు రాజ్యాంగం అటు ప్రజాస్వామ్యం వైఫల్యంతో దేశంలో 80శాతం మంది తమను ఆదుకోవా లని అంటున్నారు అంటే ప్రజల ఈ దుస్థితిని మార్చాలి. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమాజంగా ఎలా మార్చేది. నిలువునా చీలిన సమాజాన్ని సమాంతర పరిచేదెవరు? కులాల సామా జిక ఆర్థిక స్థితులు తెలియకుంటే ప్రభుత్వాలు చేపట్టే పథకాలు,ఉపాధి అవకాశాలు ఎలా పేదలకు చేరుతాయి? దేశ వ్యాప్త జనాభా గణనలో భాగంగా కులాల వివరాలను తెలుసుకోవడంలో ఎలాంటి తప్పులేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఏ ప్రభుత్వానికైనా ఏ రోజుకైనా ఎంతమంది వెనుకబడి ఉన్నారో, ఎంతమందికి సంక్షేమం అవసరమో తెలియాలి. ఇది విధానపరమైన (పాలసీ) విషయం, అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.అటు కాంగ్రెస్ ఇటు బిజెపి పోటీపడి కులగణన కోసం విధాన నిర్ణయా లను రూపొందించుకోవడం నిజంగా అణగారిన వర్గాల శ్రేయస్సు కోసమేనని భావించాలి. కులాల గణాంకాలు లేకపోతే పేదలను, నిరుద్యోగులను అంచనా వేయలేం. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమా జంగా మార్చలేము.కులగణన వలన మాత్రమే సమానత్వం, సామాజిక న్యాయం, సాధ్యమవుతుంది. అంటే వారి సామా జిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం కులగణన వల్ల తేట తెల్లమవుతుంది కాబట్టి. దానికి అనుగుణంగా ప్రణాళికలు రచించి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయడానికి వీలు ఏర్పడుతుంది. కులగణన ఈ దేశానికి ఒక దిశానిర్దేశం చేస్తుంది. దేశ ప్రగతికి దిక్సూచిగా మారుతుంది. సామాజిక న్యాయానికి బాటలు వేస్తుంది. దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించే ప్రక్రియలో భాగంగా కులాన్ని నిర్ధారించడంలో ఏ ప్రభుత్వ తప్పిదమూ ఏమీ వుండదని సుప్రీం కోర్టువ్యాఖ్యానించింది. 2027 జనగణనలో కుల గణనను చేర్చా లని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ నిర్ణయించింది. 2027 జనా భా లెక్కల రెండవ దశలో కుల గణనను పొందుపరచను న్నట్లు పార్లమెంట్‌లో ప్రభుత్వం తెలియజేసింది. తొలి దశ లో ప్రతి ఒక్క కుటుంబం ఇళ్ల పరిస్థితులు, ఆస్తులు, సదుపాయాలు వంటి వాటికి సంబంధించి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్ఎ) సేకరణ వుంటుంది. రెండో దశలో,



ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఇతర వివరాలు సేకరిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం,ఈ ప్రక్రియలో కేవలం ఎస్సీ, ఎస్టీలను మాత్రమే లెక్కించేవారు. బడుగు బలహీన వర్గాలుగా ఎవరున్నారో అనేది తెలుసుకోవాలంటే కులగణన తక్షణ అవసరం. అప్పుడు పేదలు ఎవరో తెలుస్తుంది. తద్వారా ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేయాలి. ఆ విధంగా పెట్టుబడులు పెట్టాలి. తద్వారా ఆదాయ కల్పనలు జరగాలి. అదే సంక్షేమ రాజ్యం ఇలా సామ్యవాద తరహా సమాజాన్ని నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేసింది మన రాజ్యాంగం. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తర్వాత దేశంలో సంపద కేంద్రీకరణ జరగడం వలన పేదలు నిరుపేదలుగా సంపన్నులు ఎక్కువ సంపదను పోగు చేసుకుంటున్న తరుణంలో ఆర్థిక అభివృద్ధి ఫలాలు అందరికీ అందేదిగా చూసే బాధ్యత ప్రభుత్వాలదే. ఈ నేపథ్యంలో కులాల మయమైన ఈ దేశంలో ఏ కులం వెనుకబడిపోయిందో తెలుసుకోకుంటే ప్రభుత్వం సంతులిత వృద్ధినిసాధించలేదు. ఉత్పత్తి ఫలాలు అందరికీ చేరవు. ఆర్థిక అభివృద్ధి అంటే కేవలం స్థూల జాతియోత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు అది ఆర్థిక వృద్ధి మాత్రమే అవుతుంది. ఈ వైరుధ్యాన్ని తొలగించాలంటే అసలైన ఆర్థిక అభివృద్ధిని సాధించాలంటే ఈ వృద్ధి ప్రక్రియలో ప్రజలందరూ మమేకం కావాలి. దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం వద్ద స్వాతంత్ర్యం వచ్చే నాటికి జాతీయాదాయంలో 12 శాతం వాటా కలిగి ఉంటే, 1982 నాటికి వారి వాటా 6శాతానికి పడిపోయింది. నయా ఉదారవాద విధానాలు చేపట్టిన తరువాత 2022-23 నాటికి అది ఏకంగా 23 శాతానికి పెరిగింది. గత 100 సంవత్సరాలలోనూ ఆదాయాల అసమానతలు ఇంత దారుణంగా ఎన్నడూ లేవు. ఆర్థికాభివృద్ధికి సరైన కొలమానం ఏది? ప్రజాతంత్ర రాజ్యాంగ వ్యవస్థను కలిగి వున్న ఏ దేశంలోనైనా రాజకీయాధికారం అంతిమంగా ప్రజల చేతుల్లో ఉంటుంది. అటువంటి దేశంలో ఆర్థిక వృద్ధి సాధనతోబాటు సమాంతరంగా ప్రజలను ఆర్థికంగా శక్తివంతులుగా చేయడం అన్నది కూడా కొలమానంగా ఉండాలి. దేశంలో అత్యధిక శాతంగా ఉన్న శ్రామిక ప్రజల సగటు వాస్తవ ఆదాయాలలో పెరుగుదలను పరిగణనలోకి తీసుకోవాలి. దేశ జనాభాను మొత్తంగా ఒక్కటిగానే పరిగణించి సగటు ఆదాయ పెరుగుదలను లెక్కించడం వలన ఉపయోగం లేదు. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం ప్రజలవార్షికాదాయం 5.5 శాతం చొప్పున పెరిగింది. తక్కిన 99 శాతంప్రజల వార్షికాదాయాలు కేవలం 1.5 శాతం చొప్పున మాత్రమే పెరిగాయి. కాని దేశ జనాభానంతటినీ ఒక్కటిగానే పరిగణిస్తూ లెక్కిస్తే సగటు ఆదాయ వృద్ధిరేటు 2 శాతం మాత్రమే ఉంది.అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభాను, కడు పేదరికంలో ఉన్న జనాభాను కలిపి ఒక్కటిగానే లెక్కిస్తే ఏమిటి ప్రయోజనం? కావున కుల గణన ద్వారానే ఎవరు పేదలు ఎవరు ధనికులు తెలుసుకోవాలి. అంతేగాని కులగణనను వ్యతిరేకించడం సమాజ శ్రేయస్సుకి సంతులిత అభివృద్ధికి వ్యతిరేకం అవుతుంది. ●

# కీవ్‌పై 'ఒరెష్నిక్' ప్రయోగం



**- హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణితో దాడి**

**- నలుగురు మృతి, 60మందికి పైగా గాయాలు, భారీగా ఆస్తి నష్టం**

**- నాలుగేళ్ల యుద్ధంలో ఒరెష్నిక్ ప్రయోగించడం ఇది మూడోసారి**

**కీవ్, మే 24:** రష్యా ఆక్రమిత తూర్పు ఉక్రెయిన్‌లో జరిగిన దాడులకు ప్రతీకారంగా మాస్కో హెచ్చరించిన నేపథ్యంలో, కీవ్, దాని పరిసర ప్రాంతాలపై క్రెమ్లిన్ భారీ క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన దాడుల్లో ఉక్రెయిన్‌పై ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా ధ్రువీకరించింది. నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ యుద్ధంలో అణ్వాయుధ సామర్థ్యం గల ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడవసారి. ధ్వని వేగం కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది, అందువల్ల దీనిని అడ్డుకోవడం అసాధ్యమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గొప్పగా చెప్పుకుంటున్న ఒరేష్నిక్ క్షిపణితో రష్యా ఇప్పుడికే ఉక్రెయిన్‌పై రెండు సార్లు దాడి చేసిన విషయం తెలిసిందే. రష్యా భూభాగంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ జరిపిన ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందనగా, రష్యన్ ఫెడరేషన్ సాయుధ దళాలు ఒరెష్నిక్ బాలిస్టిక్ క్షిపణులు, ఇస్కాండర్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, కింజల్ హైపర్‌సోనిక్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, సిర్కాన్ క్రూయిజ్ క్షిపణులతో పాటు డ్రోన్‌లను ఉపయోగించి భారీ దాడి చేశాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా హైపర్‌సోనిక్ బాలిస్టిక్ కిపణిని ప్రయోగించవచ్చని ఉక్రెయిన్ వైమానిక దళం హెచ్చరించిన నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామున 1 గంట దాటిన వెంటనే పేలుళ్లు ప్రారంభమయ్యాయి. ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకారం, ఈ దాడిలో 600 డ్రోన్‌లు, 90 గగనతల, సముద్ర, భూ మార్గ ప్రయోగ క్షిపణులను కూడా ఉపయోగించారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు 549 డ్రోన్‌లను, 55 క్షిపణులను ధ్వంసం చేసి, వాటి పనితీరును నిలిపివేశాయని, మరో 19 క్షిపణులు తమ లక్ష్యాలను చేరడంలో విఫలమయ్యాయని వైమానిక దళం తెలిపింది. రాజధానిలో ఇద్దరు మరణించగా, 56 మంది గాయపడ్డారని కీవ్ మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు. కీవ్ పరిసర ప్రాంత అధిపతి కూడా అక్కడ ఇద్దరు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారని చెప్పారు. రాజధానిలోని పలు జిల్లాల్లోని నివాస భవనాలతో సహా 40 ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని కీవ్ సైనిక పరిపాలన అధిపతి టైమూర్ త్కాచెంకో ఒక టెలిగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. "రాజధానిపై భారీ బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది" అని ఆయన అన్నారు. తూర్పు ఉక్రెయిన్‌లోని తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఘోరమైన దాడులకు బాధ్యులైన వారిని "శిక్షిస్తామని" రష్యా ప్రకటించిన తర్వాత, కీవ్‌పై దాడి జరిగే అవకాశం ఉందని ఉక్రెయిన్ అధికారులు, అమెరికా రాయబార కార్యాలయం అంతకుముందు హెచ్చరించాయి.

ఈ దాడుల్లో ఒక కళాశాల వసతిగృహంపై దాడి జరిగి కనీసం 18 మంది మరణించారని మాస్కో పేర్కొంది. గురువారం రాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఈ డ్రోన్ దాడి గత కొన్ని నెలల్లో ఉక్రెయిన్‌పై జరిగిన అత్యంత ఘోరమైన దాడులలో ఒకటి. ఆక్రమిత లుహాన్స్క్ ప్రాంతంలోని స్టారోబిల్స్క్‌లో 42 మందిని గాయపరిచింది, శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయారు.

కీవ్‌లో, కార్యాలయాలు, దుకాణాలు, ఒక మెట్రో స్టేషన్ ఫోయర్‌కు నష్టం వాటిల్లిందని అధికారులు నివేదించారు. నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌లో, ఒక పోస్ట్ ఆఫీస్ దెబ్బతింది.



## క్వెట్టాలో రైలుపట్టాలపై భారీ పేలుడు

**24 మంది దుర్మరణం, 50 మందికిపైగా తీవ్ర గాయాలు**

**పేలుడు పదార్థాలున్న కారు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ప్రమాదం**

**మృతుల్లో పాక్ ఆర్మీ సిబ్బంది, కుటుంబ సభ్యులే ఎక్కువ**

**ఇస్లామాబాద్, మే 24:** పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో 24 మంది మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆదివారం బలూచిస్థాన్ ప్రావిన్స్‌లని క్వెట్టాలోని చమాన్ పాతక్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న రైలు అక్కడి సిగ్నల్ దాటుతుండగా, పేలుడు పదార్థాలతో ఉన్న ఒక కార్ ట్రాక్‌పైకి దూసుకొచ్చి, రైలును ఢీకొని పేలిపోయింది. ఈ ఘటనలో 24 మంది మరణించగా, 50 మంది వరకు గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువగా పాక్ ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబసభ్యులే ఉన్నారు. ఇది ఆత్మాహుతి దాడిగా అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు ధాటికి రైల్వే స్టేషన్ సమీపంలో పార్క్ చేసిన పలు కార్లు దెబ్బతిన్నాయి. రైలు బోగి కూడ ధ్వంసమైంది. పేలుడు తీవ్రతతో వాహనాలకు చెందిన గ్లాస్‌లు, వాహన భాగాలు ఎగిరిపోయి సమీపంలోని బిల్డింగ్‌లపై పడ్డాయి. పేలుడు జరగగానే స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ఘటన సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో అధికారులు క్వెట్టాలోని ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి సెలవులు రద్దు చేసి అందరూ విధులకు హాజరుకావాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

**మేమే దాడి చేశాం: బలోచ్ లిబరేషన్ ఆర్మీ**

రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు ఘటన తమ పనేనని బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి పాక్ దళాల సిబ్బందిని తీసుకువెళ్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బలోచ్ ఆర్మీ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. బలోచ్ ఆర్మీలోని మహిళా షైనాజ్ బలోచ్ ఓ విడియోలో మాట్లాడుతూ.. పాక్ నేతలు తమ ప్రజలను అణచివేస్తున్నారని అన్నారు. తమ సంస్కృతి, గుర్తింపు, హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు గురైన ప్రతి బలోచ్ బిడ్డ తన మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచి ఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) గ్రూప్ ఈ రైలును పలుమార్లు లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైలులో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. తాజాగా కూడా సైనిక కుటుంబాలు ప్రయాణిస్తుండగానే దాడి చోటుచేసుకుంది. 2025లో కూడా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి వందల మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి.

### అడుగున్నర భూమికోసం కర్రలు రాడ్లతో దాడి: ఇద్దరు మృతి

**భోజ్‌పూర్, మే 24:** బీహార్‌లో కేవలం అడుగున్నర భూమి కోసం చెలరేగిన వివాదం తీవ్ర హింసకు దారి తీసి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఈ దారుణ ఘర్షణలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. భోజ్‌పూర్ జిల్లాలోని చార్‌పోఖరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాద్రై గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘోరం చోటుచేసుకుంది. మృతులను అదే గ్రామానికి చెందిన రాధేశ్యామ్ సింగ్ (30), రాజ్నాథ్ సింగ్ (72)గా గుర్తించారు. ఘర్షణ సమయంలో కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో తల, ఛాతీ, మెడ భాగాల్లో తీవ్ర గాయాలై వారు అక్కడికక్కడే మరణించారు. గ్రామస్థుల కథనం ప్రకారం ఈ అడుగున్నర భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య ఏడాది కాలంగా వివాదం నడుస్తోంది. శుక్రవారం సాయంత్రం వివాదాస్పద స్థలంలో ఇటుకలతో నిర్మాణం చేపట్టే విషయమై మాటామాటా పెరిగి, అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది.



## ముస్లిం మైనార్టీల పరిరక్షణకు కట్టుబడిన కాంగ్రెస్!

**మైనార్టీల సమావేశంలో రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, మే 24:** కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మద్దతు ఇచ్చే విషయంలో ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ మైనారిటీ సలహా కమిటీ సమావేశంలో తమ అధినేత ముందు పలువురు నేతలు ఆందోళనల్ని వ్యక్తపరిచారు. రాహుల్ గాంధీ తమ నేతల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ముస్లింలకు మద్దతు నిలిచే విషయంలో భయపడొద్దని సూచించారు. ఇదే సమయంలో వచ్చే ఏడాదిలోగా ప్రధాని నరేంద్రమోడీ పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఆర్థిక అసంతృప్తి, అంతర్జాతీయ పరిస్థితులు మోడీ ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అంచనా వేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు కేవలం బీజేపీని ఓడించడానికి మాత్రమే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారే అభిప్రాయాన్ని పార్టీ మార్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సమాజం కోసం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇది పార్టీకి మద్దతు పెంచుతుందని చెప్పారు. ఇదే సమయంలో మరికొందరు నేతలు, మైనారిటీ సమస్యలపై ఇతర సీనియర్ నేతలు మాట్లాడేందుకు వెనుకంజ వేస్తున్నారని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కొంత మంది నేతలు ముస్లిం అనే పదానికి బదులుగా 'మైనారిటీ అనే పదాన్ని ఉపయోగించాలని కోరారు. దీనితో రాహుల్ గాంధీ విభేదిస్తూ భయపడాల్సిన అవసరం లేదని, అన్యాయాన్ని ఎదుర్కొంటున్న ఏ సమాజానికైనా బహిరంగ మద్దతు ఇవ్వాలని అన్నారు. హిందువులు, దళితులు, అగ్రవర్ణాలు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు ఎవరైనా సరే కాంగ్రెస్ అందరి హక్కుల కోసం మాట్లాడుతుందని ఆయన చెప్పారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## భారతీయులకోసమే అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థ!

### అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో



**న్యూఢిల్లీ, మే 24:** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థనుప్రకటించారు. అమెరికా కాన్సులేట్ కార్యకలాపాలను ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా ఫస్ట్ పేరుతో ఒక కొత్త వీసా షెడ్యూలింగ్ టూల్‌ను ఆయన పరిచయం చేశారు. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న ఆయన, ఈ కొత్త విధానం ద్వారా అమెరికాతో ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను పటిష్టం చేసే ప్రయాణికులకు వీసా అపాయింట్‌మెంట్లలో ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఒక్కటేనని రూబియో వివరించారు. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసే దరఖాస్తుదారులకు షెడ్యూలింగ్‌లో తొలి అవకాశం కల్పించడం దీని లక్ష్యం. ముఖ్యంగా, వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవడానికి, కార్యకలాపాలు విస్తరించడానికి, లేదా అమెరికా మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే భారతీయ కంపెనీల ప్రతినిధులు వంటి వారికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి వారికి వీసా అపాయింట్‌మెంట్లు వేగంగా లభిస్తాయి. భారత్ అమెరికా సంబంధాలు తరచూ వార్తల్లో కనిపించకపోయినా, ఎన్నో విధాలుగా బలపడుతున్నాయని రూబియో అన్నారు. భారత కంపెనీల నుంచి అమెరికాలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని, ఇండోపసిఫిక్‌లో సైనిక విన్యాసాల ద్వారా భద్రతా భాగస్వామ్యం కూడా విస్తరించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత వీసా ప్రక్రియలో జాప్యం, అనిశ్చితి వల్ల వ్యాపార పర్యటనలు, పెట్టుబడి సమావేశాలు వంటి కీలకమైన కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని ఆయన అంగీకరించారు. ఈ అడ్డంకులను తొలగించడానికి ఒక స్మార్ట్ షెడ్యూలింగ్ వ్యవస్థ అవసరం. పటిష్టమైన, సురక్షితమైన కాన్సులర్ వ్యవస్థ ఈ ముఖ్యమైన సంబంధానికి జీవనాడి అని రుబియో అభిప్రాయపడ్డారు. ఈ కొత్త సౌకర్యం కేవలం వీసా దరఖాస్తుదారుల కోసమే కాదని, అమెరికా జాతీయ ప్రయోజనాల కోసం ఫ్రంట్ లైన్స్ లో పనిచేస్తున్న కాన్సులర్ అధికారులు, సిబ్బంది పనితీరును కూడా ఇది మెరుగుపరుస్తుందని చెప్పారు. ఈ విధానం అమెరికన్ల డబ్బును ఆదా చేస్తుంది, ఎందుకంటే ఇది మమ్మల్ని మరింత సమర్థవంతంగా మారుస్తుంది. చేయాల్సిన పనిని మరింత కచ్చితంగా, వేగంగా చేయడానికి ఇది అనుమతిస్తుందని ఆయన వివరించారు.

### పెన్షన్ కోసం కష్టాల ప్రయాణం..

## అత్తను వీపుపై 9 కి.మీ. మోసిన కోడలు



**చత్తీస్‌గఢ్, మే 24:** చత్తీస్‌గఢ్‌లోని మారుమూల ప్రాంతంలో చోటుచేసుకున్న ఒక హృదయవిదారక ఘటన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. 90 ఏళ్ల వయసున్న అత్తను వీపుపై మోసుకుంటూ ఓ మహిళ ఎండలో అడవులు, రాతి మార్గాలు, వాగులు దాటుకుంటూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తున్న దృశ్యాలు విక్రమ్, భేతాళ కథలను గుర్తుకు తెస్తున్నాయి. సర్గుజా జిల్లాలోని మైన్‌పాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సుఖ్మానియా బాయి అనే మహిళ తన 90 ఏళ్ల అత్తకు పింఛను డబ్బులు ఇప్పించడం కోసం ఆమెను తన వీపుపై మోస్తూ దాదాపు 9 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు తీసుకెళ్లింది. ఈ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రాథమిక అవసరాల కోసం కూడా ప్రజలు ఇలాగే కాలినడకన ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పింఛను డబ్బులు లబ్దిదారులకు అందచేయాలంటే వారు తప్పనిసరిగా బ్యాంకుకు వచ్చి వేలిముద్రలు వేయాలన్న నిబంధన ఉంది. ఈ కారణంగానే సుఖ్మానియా బాయి గత కొన్ని నెలలుగా ఇదే విధంగా తన అత్తను బ్యాంకుకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో తీస్తున్న వ్యక్తి ఇంత కష్టపడి ఎందుకు మోసుకెళ్తున్నావని స్థానిక భాషలో అడగగా సుఖ్మానియా బాయి తన ఆవేదనను వెళ్లగక్కింది. బ్యాంకుకు స్వయంగా తీసుకెళితేనే పింఛను డబ్బులు ఇస్తున్నారు. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. అడవులు, వాగులు దాటుకుంటూ వెళ్లాలి. నెలనెలా వచ్చే రూ.1500 కోసం ఈ కష్టం తప్పడం లేదు అని ఆమె వివరించింది. గతంలో పింఛను డబ్బులు స్థానికంగానే అందేవని, కానీ ఇప్పుడు ఈ కష్టాలు పడాల్సి వస్తోందని ఆమె తెలిపింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఇంటి వద్దకే సేవలు అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య ఉన్న వ్యత్యాసానికి ఈ ఘటనే నిదర్శనమని విమర్శిస్తున్నారు.

## దేశాన్ని అస్థిరపరిచే కుట్రలుచేస్తున్న కాంగ్రెస్, రాహుల్!

**కేంద్ర మంత్రి పియూష్ గోయల్**

**న్యూఢిల్లీ, మే 26:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, విపక్ష పార్టీలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరపరచేందుకు వీరంతా కుట్రపన్నుతున్నారని, హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. పాలకపక్షాన్ని ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎదుర్కోవడంలో విఫలం కావడంతో ఉద్దేశపూర్వకంగా దేశంలో అశాంతి సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. దేశాన్ని అస్థిరపరచేందుకు కాంగ్రెస్, విపక్ష పార్టీలు కుట్ర పన్నుతున్నాయి. దేశాన్ని అస్థిర పరచాలని ఈ టూల్‌కిట్ గ్యాంగ్ కలలు కంటోంది. రాహుల్ గాంధీ ప్రకటన ఆషామాషీగా చేసినది కాదు. దేశంలో అరాచకం వ్యాప్తి చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగం. రాజకీయ నిరాశానిస్పృహాలే ఇందుకు కారణం.

### ఫాల్టా ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి ఘనవిజయం

**ఫాల్టా,(బెంగాల్),మే 24:** పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. అయితే పోలింగ్‌కు ముందే తాను ఎన్నికల బరినుంచి వైదొలగుతున్నట్లు జహంగీర్‌ఖాన్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనివల్లనే ఆయన లెక్కింపులో నాలుగోస్థానానికి పడిపోయారు. ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఫాల్తా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి. ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్తా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

## సంక్షిప్తంగా..

### బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి టివికె సై!

**చెన్నై, మే 24:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించారు. టీవీకే పార్టీ విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఆరాష్ట్రంలోని బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది.

### వైట్‌హౌస్ వద్ద కాల్పులు-ఎన్‌కౌంటర్‌లో ఒకరు మృతి



**వాషింగ్టన్, మే 24:** అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ దగ్గర కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. యూఎస్ సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్‌పై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. భద్రతాసిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో అతను మరణించాడు. ఈ ఘటనలో ఒక పౌరుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం 17వ వీధి, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న భద్రతా చెక్‌పాయింట్ వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన బ్యాగ్‌లోంచి తుపాకీ తీసి అక్కడున్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు ప్రారంభించాడు. తక్షణమే అప్రమత్తమైన అధికారులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపి నిందితుడిని నిలువరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నారని, ఆయన సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టంచేశారు.

### కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మలేం: ఉదయనిధి

**చెన్నై, మే 24:** డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20 ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని, ఈ రోజు అధికారం కోసం టివికెతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మరిచిపోవద్దని, ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు. దేశంలో బిజెపి వరుస విజయాలకు ప్రధాని మోడీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని, కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు.

### డిఎంకె కష్టకాలంలో ఎప్పుడూ అండగా నిలిచాం : కాంగ్రెస్



**చెన్నై, మే 24:** తమిళనాడులో డీఎంకే వల్లే కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిచారని, విజయ్ సారథ్యంలోని టీవీకేతో చేతులు కలిపి తమకు వెన్నుపోటు పొడిచిందని ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది.

డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా తమ పార్టీ వెన్నంటే ఉందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా కాంగ్రెస్ అండగా నిలిచింది. వాళ్లు మైనారిటీలో ఉన్నప్పుడు మేము బయటే వేచిచూసాం. ఉదయనిధి వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మాణిక్యం ఠాగూర్ అన్నారు.

### ముత్యపుచిప్పల కోసం వెళ్లి నదిలో ఎనిమిది మంది మృతి

**భట్కాల్(కర్ణాటక),మే 24:** నదిలో ముత్యపు చిప్పల కోసం వెళ్లిన ఒకే కుటుంబానికి చెందినఎనిమిది మంది మరణించారు. ఇంకో ఇద్దరు గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, భట్కాల్ తాలూకా, షిరాలి గ్రామ సమీపంలోని తట్టే హక్కాలు నదిలో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. తట్టే హక్కాలు అనే మంచినీటి నదిలోకి 14 మంది సభ్యుల బృందం ఆదివారం ముత్యాల చిప్పల కోసం వెళ్లింది. ఈ సీజన్‌లో ఇక్కడ ముత్యపు చిప్పలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిని సేకరించేందుకు స్థానికులు చాలా మంది నదిలోకి వెళ్తుంటారు. బాధితులు నదిలోకి వెళ్లి ముత్యాల కోసం వెతికే సమయానికి నీటి ప్రవాహం తక్కువగా ఉంది.

అయితే, ఉన్నట్లుండి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వేగంగా అలలు వీచాయి. పెరిగిన నీటి ప్రవాహం, అలల ధాటికి ఒక్కొక్కరు కొట్టుకుపోయారు.

## తమిళనాడులో కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలు!

**చెన్నై, మే 24:** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నాకు చేరనుంది. ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీసుకున్న ఈ తొలి కీలక నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. ప్రభుత్వ నూతన విధానానికి అనుగుణంగా అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి మార్పులను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచినట్లు టీఎన్‌పీడీసీఎల్ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం రెండు నెలలకు 500 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్ల లోపు వాడే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య ఏకంగా 1.2 కోట్లకు పెరగనుంది. మరో 85.83 లక్షల మంది వినియోగదారుల బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ. 235 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, 500 యూనిట్లకు మించి వాడే 34.24 లక్షల మందికి మాత్రం పాత పద్ధతిలోనే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగుతుంది. ఈ పథకం ద్వారా అయ్యే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

మే 10న ప్రభుత్వం ఈ ప్రకటన చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రక్రియను ప్రారంభించారు.

## డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే విజయ్ ప్రభుత్వం:స్టాలిన్

**చెన్నై, మే 24:** తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ మాత్రమేనని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు.



నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనం పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో ఈనెల 28 నుండి జూన్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

## భక్తుల రద్దీ మధ్య చెత్త తొలగింపు

**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు, వారాంతాలు, ప్రత్యేక దర్శనాల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. తిరుమలలో ప్రస్తుతం సుమారు 210 మరుగుదొడ్ల భక్తులకు అందుబాటులో ఉండటంతో పాటు మరో 130 సంస్థాగత మరుగుదొడ్లను టిటిడి నిర్వహిస్తోంది. ప్రతి మరుగుదొడ్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి, గంట గంటకూ శుభ్రపరిచే విధంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు చేస్తోంది. రసాయనాలు, డిసిన్ఫెక్టెంట్ల వినియోగం, పరిశుభ్రత ప్రమాణాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా అందించడం జరిగింది. భక్తుల వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని మరుగుదొడ్లను రోజుకు 1,500 నుంచి 2,000 మంది పైగా భక్తులు వినియోగిస్తున్నారు. ఇక రోడ్ల పరిశుభ్రత విషయంలో కూడా టిటిడి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రియల్ టైమ్ రోడ్ స్వీపింగ్, చెత్త సేకరణ, నీటి స్ప్రే వంటి పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. ఇటీవల ఆకుల రాలే కాలంలోనూ పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం శ్రమించి తిరుమల పరిశుభ్రతకు విశేష కృషి చేశారు. ఇటీవల భక్తుల రద్దీ భారీగా పెరగడంతో బయట క్యూ లైన్లలో భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ నిరంతరం కొనసాగుతున్న నేపథ్యంలో కొంతమంది భక్తులు ఆహార పదార్థాలను పూర్తిగా వినియోగించకుండా పారవేయడం వల్ల ఆహార వ్యర్థాలు అధికంగా పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో క్యూ లైన్ల వెనుక భాగాల్లో ఆహార వ్యర్థాలు ఎక్కువగా చేరుతున్నాయి. సేకరించిన వ్యర్థాలను తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు కూడా చేపడుతున్నారు. సాధారణ రోజుల్లో 50 టన్నుల వరకు ఉండే తడి వ్యర్థాలు ప్రస్తుతం భక్తుల రద్దీ పెరగడంతో 60 నుంచి 75 టన్నుల వరకు పోగవుతోంది. అదనంగా డ్రై వేస్ట్ కూడా గణనీయంగా పెరిగింది. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడు పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామి కావాలని, పారిశుద్ధ్య నిర్వహణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సిబ్బంది కృషిని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను వృథా చేయకుండా సహకరించాలని భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

## పండగలు సంప్రదాయాలకు మార్గదర్శకాలు



**శ్రీకాళహస్తి, మే 24 ప్రభాతవార్త:** ఎవరైతే భగవంతుని (అల్లాహ్) ఆదేశాలను తు.చ. తప్పక నిష్కల్మషంగా ఆచరిస్తారో వారు స్వర్గస్తులని, పండగలు సంప్రదాయాలకు దిక్సూచిలు అని, ఆచరించాల్సిన విధానాలతో ఆచరించాలని హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ ఆలీ అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన బక్రీద్ పండగ ప్రాధాన్యతను వివరిస్తూ పండగ రోజు ఆచరించాల్సిన విధి విధానాలను వివరించారు. పండగలంటే ఆనందాన్ని మన కుటుంబానికి, బంధులకు మాత్రమే పరిమితం కాదని ప్రతి ఒక్కరికి అవసరాలను గుర్తించాలని సూచిస్తుందన్నారు. సేవాభావంతో ప్రతి ముస్లిం దైవ ఆజ్ఞలను నేరవేర్చటానికి ముందుకు రావాలని, ప్రతి ఒక్కరి హృదయం ఆత్మదైవ గొప్పతనంతో నిండిపోవాలని వివరించారు. ఈద్ అనే పదం ఔద్ నుంచి వచ్చింది. దీని అర్థం తిరిగి రావటం అని వివరించారు.

# పాస్టర్ ఆనంద్ ఎస్సీ హోదా రద్దు

- బాపట్ల కలెక్టర్ డా.వినోద్‌కుమార్ కీలక నిర్ణయం
- అధికారిక వెబ్‌సైట్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం చర్యలు



**బాపట్ల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న వారికి ఎస్సీ హోదా వర్తించదన్న సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో బాపట్ల జిల్లాలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. కొన్నేళ్లుగా న్యాయస్థానాల్లో నడుస్తున్న వివాదానికి తెరదించుతూ పాస్టర్ చింతాడ ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా కొనసాగదనే అంశంపై స్పష్టత వచ్చినట్లయింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయిలో పలు విడతలుగా సమగ్ర విచారణ జరిపిన అధికారులు చివరకు ఆనంద్ సామాజిక హోదాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక గెజిట్‌ను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌తో పాటు మాన్యువల్ రికార్డుల్లోనూ మార్పులు చేశారు. ఈ ప్రొసీడింగ్స్ ప్రతిని సామాజిక సంక్షేమ శాఖతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

**వివాదం నేపథ్యం ఇదీ:** గత ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెంలో 2021 జనవరి 24న ప్రార్థనలు ముగించుకుని వెళ్తున్న తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారంటూ పాస్టర్ చింతాడ ఆనంద్ చందోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు అక్కల రామిరెడ్డి సహా మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే, ఆనంద్ తన ఫిర్యాదులోనే తాను క్రైస్తవుడినని పేర్కొన్నారని.. అలాంటప్పుడు అట్రాసిటీ చట్టం ఎలా వర్తిస్తుందని ప్రశ్నిస్తూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తప్పుడు కేసుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ జరిపిన హైకోర్టు.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా కోల్పోతారని స్పష్టం చేస్తూ, ఆనంద్ ఫిర్యాదుతో నమోదైన అట్రాసిటీ కేసును కొట్టివేసింది.

**కమిటీ నివేదిక ఆధారంగానే..:** హైకోర్టు తీర్పు అనంతరం ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలంటూ రామిరెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై స్పందించిన బాపట్ల కలెక్టర్.. జేసీ భావన నేతృత్వంలో జిల్లా స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 1న ఇరుపక్షాల వాదనలు విన్న కమిటీ.. ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌కు సిఫార్సు చేసింది. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నెల 3న ఆనంద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ.. 18వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. దీనికి స్పందనగా ఆనంద్ తపాలా ద్వారా సమాధానం పంపడమే కాకుండా, ఈ నెల 19న వ్యక్తిగతంగా తుది విచారణకు హాజరయ్యారు. తాను పుట్టుకతోనే ఎస్సీనని పేర్కొంటూ అందుకు మద్దతుగా 70 పేజీల పత్రాలను సమర్పించారు. అయితే ఆ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా యంత్రాంగం.. న్యాయ నిపుణుల సలహా మేరకు పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ వివాదానికి తాత్కాలికంగా ముగింపు పడింది.

**న్యాయపోరాటంలో గెలిచా: అక్కల రామిరెడ్డి:** గత ప్రభుత్వ హయాంలో నాపై పాస్టర్ ఆనంద్ అన్యాయంగా అట్రాసిటీ కేసు పెట్టి వేధించారు. నాటి అధికార పార్టీ నేతల బెదిరింపులను, పోలీసుల ఒత్తిళ్లను తట్టుకుని ఒంటరిగా సుదీర్ఘ న్యాయపోరాటం చేశాను. కలెక్టర్ స్పందించి ఆనంద్ ఎస్సీ హోదాను రద్దు చేయడం సంతోషంగా ఉంది.

**సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశా: పాస్టర్ ఆనంద్:** నా న్యాయపోరాటం ఇక్కడితో ఆగదు. నా ఎస్సీ హోదాను కాపాడుకునేందుకు ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాను. దీనిపై చట్టపరంగా ముమ్ముందుకు వెళ్తాను.

# తెనాలిలో మహిళ సెల్ఫీ సూసైడ్

## పోలీసుల వేధింపులే కారణమన్న మహిళ ఆరోపణలు

**తెనాలి, మే 24 ప్రభాతవార్త:** తనకు సంబంధం లేని కేసులో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారంటూ తిరుపతమ్మ అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. గుంటూరు జిల్లా తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు విషయంలో బంగారం రికవరీ కోసం పిలిపించి పోలీసులు వేదించారు అంటూ సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేసింది.

గతంలో కొన్ని సంవత్సరాల క్రితం కొత్తపేటలోని ఓ అపార్ట్మెంట్లో భర్తతో కలిసి వాచ్‌మెన్‌గా పని చేసిన తిరుపతమ్మ అనే మహిళ అపార్ట్మెంట్ ఫ్లాట్‌లోని ఓ మహిళ తనకు బంగారం ఇచ్చానంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిందని ఆరోపిస్తూ, చేయని నేరానికి వేధింపులకు గురి చేస్తున్నారంటూ తిరుపతమ్మ శనివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 3:00 సమయంలో మృతి చెందింది. దీంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. అనంతరం మృతదేహం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పుల బాధతో రైతు బలవన్మరణం

- అరటి పంట నష్టాలతో తీవ్ర మనస్తాపం
- పొలంలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్య
- రూ.18 లక్షల అప్పులు.. కుటుంబంలో విషాదం




**పులివెందుల, మే 24 ప్రభాతవార్త:** అప్పుల ఊబిలో చిక్కుకుని మరో రైతు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన వైఎస్సార్ కడప జిల్లాలో చోటుచేసుకుంది. పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణమూర్తి (42) అప్పుల భారాన్ని తట్టుకోలేక పొలంలోనే గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు బాలకృష్ణమూర్తికి స్వంతంగా 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగునీటి అవసరాల కోసం మూడు బోర్లు వేయించగా భారీగా అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చేందుకు అదనంగా ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. అయితే అరటి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడులు పెరగడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూశారు.

ఈ క్రమంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద సుమారు రూ.18 లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురైన బాలకృష్ణమూర్తి శనివారం సాయంత్రం తన పెద్ద కుమారుడికి ఫోన్ చేసి తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు చెప్పినట్లు తెలిసింది. అనంతరం పొలంలోనే గడ్డిమందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను పులివెందుల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మీ   మ్రదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మీ   మ్రదేవి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయానికి పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రైవేట్ అప్పుల ఒత్తిడి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బైండోవర్ ఉల్లంఘించిన నేరస్తుని అరెస్ట్

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** బైండోవర్ ఉల్లంఘించిన స్థానిక వాంబే కాలనీకి చెందిన గొల్లపల్లి పోతురాజును అరెస్ట్ చేసి జైలుకు తరలించామని గుడివాడ పట్టణ డిఎస్పీ పి.శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం గుడివాడలో డిఎస్పీ శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ సెక్షన్ 129(ఇ) బిఎన్ఎస్ఎస్ ప్రకారం ఏడాది పాటు బైండోవర్‌లో ఈ నిందితుడు ఉన్నారన్నారు. మే 15న మళ్లీ నేరానికి పాల్పడటంతో అతడిపై క్రైమ్ నం.132/2025 కింద కేసు నమోదు చేశామన్నారు. ష్యూరిటీ కింద రూ.2 లక్షల నగదు కట్టలేనని పోతురాజు సమాధానం ఇచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ డిటెన్షన్ ఉత్తర్వులతో పోతురాజును వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ అరెస్ట్ చేశారని వివరించారు. గుడివాడ సబ్ డివిజన్‌లో 444 మందిపై బైండోవర్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. బైండోవర్‌లో ఉన్నవారు నేరాలు చేస్తే జరిమానా, డిటెన్షన్, జైలు శిక్ష తప్పదని డిఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. కృష్ణా జిల్లాలో పోతురాజు తొలిసారి బైండోవర్ ఉల్లంఘించిన నిందితుడని డిఎస్పీ పోతురాజు వివరించారు.

# మతంలో నియంతృత్వ ధోరణి బాధాకరం

- చాంధస వాదుల నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి
- విరసం పూర్వ కార్యదర్శి చెంచయ్య




**తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మతం అనేది ఒక మత్తు మందు. మతంతో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం మతం సాహిత్యంలోకీ చొచ్చుకు పోతోంది, ఇది చాలా ప్రమాదకరం. మతం అనే దుర్మార్గం, చాంధసవాదం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి. ఇది కేవలం వామపక్ష భావజాలం ఉన్న వారితోనే సాధ్యమవుతుంది. సమాజ శ్రేయస్సు కోసం కమ్యూనిస్టులందరూ ఆచరణలో ఏకం కావాలి" అని విప్లవ రచయితల సంఘం (విరసం) పూర్వ కార్యదర్శి వి.చెంచయ్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో నిర్వహించిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 20వ రాష్ట్ర మహాసభల ముగింపు రోజైన ఆదివారం ఆయన హాజరయ్యారు. "మతం వర్తమాన సమాజం" అనే అంశంపై చెంచయ్య ప్రసంగం చేశారు. కాకినాడ జిల్లాకు చెందిన అరసం నేత సి.సబ్బరాజు అధ్యక్షత వహించిన ఈ సభను తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు తమటం రామచంద్రారెడ్డి సమన్వయం చేశారు. మతం మీద గట్టి పోరాటం చేయడానికి వామపక్షాలు ఐక్యం కావాలన్నారు. ఇది కేవలం ఒకచోట కూర్చొని మాట్లాడితే కుదిరే పని కాదని, ఆచరణలోనే దీనిని నిరూపించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. మనం 'జై శ్రీరామ్' నినాదంతో పోరాడాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందుకు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కారణాలు బలంగా ఉన్నాయని విశ్లేషించారు. మతం, దేవుడు అనేవి పూర్తిగా ఎవరి వ్యక్తిగత ఇష్టాలపై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రస్తుత పాలకుల విధానాల వల్ల మన సమాజం చాలా ప్రమాదకరమైన స్థితిలో పడిపోయిందని చెంచయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు భక్తులపై కూడా నియంతృత్వ ధోరణిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో క్రైస్తవులు, ముస్లింలు ఉండాలంటే వారు హిందువుల లాగే ఉండాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి పాలకులు చివరకు 'జనగణమన'ను పక్కన పెట్టి 'వందేమాతరం' మాత్రమే పాడాలంటూ ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. కేవలం మతాన్ని, దేవుని తిట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, సమస్య మూలాలను ఆలోచించి పరిష్కారం కనుగొనాలని సూచించారు. సనాతనం పేరిట మార్పును అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం సాహిత్యంలోకి కూడా మతం ప్రవేశిస్తోందని, ఈ నేపథ్యంలో అభ్యుదయ రచయితలందరూ తక్షణమే మేల్కోవాలని వి.చెంచయ్య పిలుపునిచ్చారు.

# ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థకు స్వాగతం

- సిపిఐ నేత నారాయణ



**తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ వచ్చి తీరుతుందనే విశ్వాసం తమకు ఉందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ అన్నారు. అది కాక్రోచ్ రూపంలో, మరో రూపంలో వచ్చినా స్వాగతం పలుకుతున్నామన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడిదారులు రెండు వర్గాలుగా విడిపోయి, వారికి వారే పోటీగా మారారని అన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాలు నిరూపించాయన్నారు. తాజాగా తమిళనాడులో సైతం వ్యవస్థీకృత పార్టీలను కాదని, కొత్తవారిని ఎన్నుకున్నారని గుర్తుచేశారు. యువత ఆవేశపూరిత రాజకీయ, సాంఘిక, ప్రత్యామ్నాయ ఆలోచనలు రాజకీయ స్వరూపం తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేందుకు వామపక్ష వాదులు ముఖ్యంగా సిపిఐ సిద్ధంగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో కూడా అవినీతికి, అవినీతికి మధ్యే పోటీ ఉందని, నీతికి, అవినీతికి మధ్య కాదన్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పరిణామాలు నివురు కప్పిన నిప్పులా ఉన్నాయన్నారు. ఉద్యమించే వారిని తుదముట్టిస్తే ఉద్యమాలు ఆగవని గుర్తు చేశారు. వ్యవస్థలో లోపాలను సరిదిద్దుకోవాలని అన్నారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ జనసేన నేతలపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక రాజకీయ అంశాలపై మాట్లాడినప్పుడు ఆధారం ఏమిటో నిర్దిష్టంగా చెప్పి ఉండాల్సింది కాదన్నారు. తర్వాత ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ కేసులు నమోదు చేయడం సరికాదని, ఆయన వ్యాఖ్యలను ఖండించేందుకు వివిధ ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఇటీవల గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇతర వర్గాల మాదిరిగా అవినీతిలో కూడా తమకు హక్కు ఉందన్నట్టు కులాన్ని వాడుకోవడం మంచిది కాదని అన్నారు. ఎవరు అవినీతికి పాల్పడినా తప్పేనని పేర్కొన్నారు.

# తిరుపతిలో భూమన ఇంటి ముట్టడికి హిందూ సంఘాలు, సాధువుల యత్నం



**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ టిటిడి మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ప్రతినిధులు, సాధువులు ఆదివారం ఉదయం ఆయన ఇంటి ముట్టడికి ప్రయత్నించారు. తిరుమలను భూమన రాజకీయాలకు వాడుకుంటున్నా రన్న ప్రముఖ సాధువు తిరుపతిలోని శిల్పారామం వద్ద నుండి పద్మావతిపురంలోని భూమన ఇంటి వద్దకు ప్రదర్శనగా బయలుదేరారు. ఈ ర్యాలీని తొలుతనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెల కొంది. భూమనను అరెస్ట్ చేయాలని, ఆయన ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న సాధువులను అప్ర మత్తమైన పోలీసులు నిరసనకారులను మధ్యలోనే అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడంపై హిందూ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధువు మాట్లాడుతూ తిరుమల అనేది రాజకీయాలకు అతీతమైన పరమ పవిత్ర క్షేత్రమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందువుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉందని గుర్తుచేశారు. అదృష్టం కొద్దీ రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేసే అవకాశం వచ్చినప్పటికీ, భూమన శ్రీవారి సేవను విస్మరించి తిరుమలను రాజకీయం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన చేసిన తప్పులకు గానూ వేంకటేశ్వర స్వామికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, సాధువులు రోడ్డుపైకి వస్తే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్ర పన్నాయని హిందూ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. భూమనను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు, సాధువుల డిమాండ్ చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారు. అదృష్టం కొద్దీ ఆయన రెండు సార్లు టిటిడికి చైర్మన్ అయ్యారు. అలాంటి ఆయన వెంకటేశ్వర స్వామి సేవలో ఉండాలి. కానీ, తిరుమలను రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. ఆయన చేసిన పాపాలకు వెంకటేశ్వర స్వామికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. సాధు, సంతులను చూసైనా భూమనలో మార్పు వస్తుందని కోరుకుంటున్నాము. కచ్చితంగా క్షమాపణ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. కాగా, సాధువులు రోడ్డుపైకి వస్తే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్ర చేసినట్లు తెలుస్తోంది.

# దళితుల భూములు ఆక్రమించి అవమానించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు



**తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** దళితులను కులం పేరుతో దూషించడమేకాకుండా దౌర్జన్యంగా వారి భూములు ఆక్రమించిన వారిని వదిలి పెట్టే ప్రసక్తేలేదని, బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని హెచ్చరించారు. మంగళం, బాలకృష్ణాపురంకు చెందిన సుబ్రమణ్యం భార్య గుర్రమ్మ, మురుగయ్య కుమారుడు మేకల రమేష్ ఆదివారం తిరుపతి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని ని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మంగళం, బాల కృష్ణాపురం గ్రామకంతానికి చెందిన సర్వే నెంబర్ 15/22లో తమకు చెందిన (గుర్రమ్మ కు చెందిన 3 సెంట్లు భూమి, మేకల రమేష్ కు చెందిన 3 సెంట్లు భూమిని) గిరిధర్ తన అనుచరులతో కలిసి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. కులం పేరుతో దూషించడమే కాకుండా ముఖంపై ఉమ్మేసి బూతులు తిడుతూ తరిమేశారని వాపోయారు. అంతేకాకుండా తమపైనే అక్రమ కేసులు బనాయించి పోలీసుల చేత బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. తమ భూములను సతీష్ చంద్ర అనే వ్యక్తికి అమ్మేశారంటూ చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కొందరు తిరుపతి అర్బన్ రెవిన్యూ అధికారులు వీరికి అండగా నిలిచి తమకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తమ స్థలంలో అక్రమంగా ఆరంతస్థుల భవన నిర్మాణం జరుగుతోందని ఆయనకు చెప్పారు. దీంతో తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని బాధితులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరుగుతున్నా పోలీసులు, రెవిన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. దళితులకు చెందిన భూమిపై ఎవరికీ హక్కులు ఉండవన్నారు. వారిని కులం పేరుతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేసి, భయపెట్టి, పోలీసుల అండతో వారి స్థలాలను ఆక్రమించుకోవడం చట్టవ్యతిరేకమైన చర్య అన్నారు. అతనిపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని స్వయంగా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెడతానని అన్నారు. అవసరమైతే రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ గారి దృష్టికి అలాగే హోమ్ మినిస్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు.

# నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847లకు ఫోన్ చేసి సమస్య చెప్పవచ్చని సిఎండి తెలిపారు.

# విశాఖలో బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్

● 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం ఆవిష్కరించిన ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ● కూటమి పార్టీల నేతలు, వైకాపా నాయకులు



**విశాఖపట్నం, మే 24 ప్రభాతవార్త:** విశాఖ నగరంలో ఆదివారం ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మాజీ కేంద్ర మంత్రి, హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాజకీయాలక తీతంగా రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలను తెలంగాణలో మాదిరిగా ఒక తాటిమీదకు తెచ్చి ప్రజల సేవలో వారిని మమైకం చెయ్యాలనే సంకల్పంతో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం విజయవంత మైంది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నేతలు మాజీ గవర్నర్ దత్తాత్రేయకు బ్రహ్మారథం పట్టారు. వారితో తమకు ఉన్న అనుభవాలు అనుభూతులను నెమరు వేసుకొని ఘనంగా సత్కరించారు. బిజెపి నాయకులు చెరువు రామకోటయ్య అధ్యక్షతన నగరంలో తొలిసారిగా జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమానికి వైస్సార్సీపి నుంచి మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు హాజరు కాగా తెలుగుదేశం నుంచి మాజీ మంత్రి, భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు, జనసేన నుంచి మాజీ మంత్రి అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, బిజెపి నుంచి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజ్య సభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహ రావు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల అధ్యక్షులు పరుశురాం రాజు, ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు. ఆహ్వానించినా కాంగ్రెస్‌తోపాటు ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నుండి నేతలు హాజరుకాకపోవడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభపాటి హరిబాబు మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, తన ప్రస్థానం ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా, కేంద్ర కార్మికశాఖ మంత్రిగా, హర్యానా రాష్ట్ర గవర్నర్‌గా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు నాయకులు అందరూ కలిసి ఒక తాటిపైకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తెలంగాణలో అలయ్ బలయ్ అనే కార్యక్రమాన్ని దత్తాత్రేయ విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అటువంటి గొప్ప నాయకుడు 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పుస్తకాన్ని రచించారని తెలిపారు. ఆ పుస్తకాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అంతకు ముందు దత్తాత్రేయ స్వీయచరిత్ర పుస్తకాన్ని డాక్టర్ హరిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక మంత్రిగా ఉన్న సమయంలో విశాఖపట్నంకు ఇఎస్ఐ ఆసుపత్రి మంజూరుకు కృషి చేసిన దత్తాత్రేయను నేవల్ డాక్ యార్డ్ హిందూస్తాన్ షిప్ యార్డ్ పోర్ట్ ట్రస్ట్, స్టీల్ ప్లాంట్ పరిశ్రమలకు చెందిన పలు కార్మిక సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.

# టీచర్ పోస్టుల భర్తీలో ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం

● నెల్లూరులో విద్యపై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి ● 20కోట్లతో అంతర్జాతీయ స్థాయి పాఠశాల నిర్మాణం ● 15వేల మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యంగా అడుగులు



**నెల్లూరు, మే 24 ప్రభాతవార్త-వైద్యం:** విద్యా వ్యవస్థలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలవాలన్నది యువనేత నారా లోకేష్ సంకల్పమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు సిటీలో 15 వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. నెల్లూరులోని పరమేశ్వరి నగర్‌లో మంత్రి నారాయణ పర్యటించారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో 20 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ ఫుల్‌తో కూడిన అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆశయాలకు అనుగుణంగా వీఆర్సీ తరహాలోనే మరో 14 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో సిద్ధం చేస్తున్నామన్నారు. అవన్నీ పూర్తయితే 15 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. డిసెంబర్ నాటికి ఎండ్ టు ఎండ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, అమృత్ పనులు పూర్తి చేసి, నగరాన్ని దుమ్ము లేని నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. గత పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

ప్రస్తుతం చంద్రబాబు పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. పారదర్శకంగా జరుగుతున్న ఉపాధ్యాయుల నియామక పక్రియను చూసి ప్రతిపక్షాలు అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల పట్ల మంత్రి నారాయణ చూపుతున్న ప్రత్యేక చొరువను డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రశంసించారు. సొంత నిధులు, సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్న తీరు అభినందనీయమన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో స్కూల్ నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఇరుగాళ్లమ్మ సంఘంలోని మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. అక్కడ నుంచి14వ డివిజన్ బాలాజీనగర్ చేరుకుని గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు. ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్న స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్య క్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, 42వ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ ఖలీల్ అహ్మద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ అహ్మద్, పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి షేక్ కాలేషా, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఉమర్, నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇంతి యాజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నౌషాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ భువనేశ్వరి ప్రసాద్ పాల్గొన్నారు.



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

**ఇంద్రకీలాద్రి, మే 24, ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం భక్తజన రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇన్‌చార్జ్ ఇఓ రంగారావు క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని, దర్శనం సాఫీగా సాగేలా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎండ వేడి నుండి భక్తులను రక్షించేందుకు క్యూలైన్లలో చల్లని మజ్జిగ, శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. ఎక్కడా నీటి కొరత లేకుండా దేవస్థాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. భక్తులకు ఇఒ వికె శీనా నాయక్ ఆదేశాల మేరకు క్యూలైన్లలో నూతన మంచినీటి పంపిణీ విధానం చేపట్టారు. మొబైల్ వాటర్ క్యాన్ల ద్వారా చల్లటి మంచినీరు పంపిణీ చేశారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి మోహన్ కుమార్, అనుపమ దంపతులు రు.1 లక్ష విరాళం ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

# సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం

● క్యూలైన్ల తనిఖీల్లో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతంగా, భక్తుల్లో విశ్వాసం పెంపొందేలా విస్తృత ఏర్పాట్లు చేపట్టామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నా రు. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా తిరుపతి భూదేవి కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శనం, దివ్యదర్శనం టోకెన్ కౌంటర్లను టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీ కృష్ణలతో కలిసి ఆదివారం సాయంత్రం అదనపు ఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తిరుమలలో శ్రీవారి దర్శనం, అన్నప్రసాదం, తాగునీరు, భద్రత తదితర సేవలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం కేంద్రాలలో సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం, ఎప్పటికప్పుడు సమాచారం అందించే విధానం, వర్షాలకు తడవకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టిటిడి విజిలెన్స్, జిల్లా పోలీసులు, టిటిడిలోని వివిధ విభాగాలు, శ్రీవారి సేవకులు సమన్వయంతో నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రోజుకు లక్ష మందికి పైగా భక్తులు తిరుమలకు వచ్చినప్పటికీ, భక్తుల సంఖ్య, దర్శన సమయం, క్యూలైన్ల పరిస్థితి, ముందురోజు దర్శనాల వివరాలు వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను తప్పుదోవ పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు హెచ్చరించారు. పోలీసు, ట్రాఫిక్, టిటిడి విజిలెన్స్ విభాగాలు సమన్వయంతో భద్రతా చర్యలు చేపడుతున్నాయని, భక్తులు కూడా సహకరించాలని కోరారు.

భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం ప్రాంతాల్లో కొందరు ఆటో డ్రైవర్లపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కొందరి ప్రవర్తన వల్ల తిరుపతికి చెడ్డపేరు రాకుండా చూడాలని సూచించారు. భక్తులను మోసం చేసే తప్పుడు సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దని టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీకృష్ణ సూచించారు. టిటిడి అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, మోసపూరిత చర్యలపై టిటిడి విజిలెన్స్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ టి.వి. సత్యనారాయణ, తిరుపతి పోలీసు అధికారులు, టిటిడి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఒజి హబ్ ప్రారంభించిన ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), మే 24 ప్రభాతవార్త:** యుతకు క్రీడాలు చాలా కీలకం అని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంకె లేవుట్‌లో భువనేశ్వర్ మురళీ, శైలజా కుమారులు మహాదేవ్, సిద్దార్ద, మిత్రులు మహేష్, మణికుమార్ కొత్తగా నిర్మించిన ఒ.జి హబ్‌ను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. కొద్ది సేపు షెటిల్ ఆడి అందర్ని ఉత్సాహపరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ మహానగరాలకు దీటుగా ఇటువంటి హబ్ బుచ్చి మున్సిపాల్టీలో ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. యువత నిత్యం ఇటువంటి హాబ్‌కి వస్తే వారు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, టిడిపి టౌన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షుడు బత్తల హారికృష్ణా, బుచ్చిరెడ్డిపాళెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాలకొండయ్య దంపతులు, నీటి సంఘం డైరెక్టర్ మారంపూడి జగదీష్, మైనార్టీ నాయకులు షబ్బీర్, ఫర్వీనా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడ కామాక్షితాయి వార్షిక ఆదాయం రూ. కోటి

● ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఇఒ ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి



**బుచ్చి (నెల్లూరు), మే 24 ప్రభాతవార్త:** పవిత్రపుణ్య క్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి వార్షిక ఆదాయం కోటి రూపాయలు వచ్చిందని ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో బ్రహ్మోత్సవాలు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించా మని అన్నారు. మంత్రికి,ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జొన్నవాడ కామాక్షితాయికి ఆదాయ పెరిగిందని అన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం హుండి ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఈ సంవత్సరం హుండి ఆదాయం 34 లక్షల 80 వేల పై చిలుకు ఆదాయం వచ్చిందని చెప్పారు. అలాగే 22 నెలలో 3 కోట్లా 6 లక్షల 92 వేలు పిక్సెడ్ డిపాజిట్ చేయడం జరిగిందని అన్నారు. దేవస్దానం మిగులు నిదుల నుండి మరో 75 లక్షలు పిక్సెడ్ డిపాజిట్ చేస్తామని ఆయన తెలిపారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో పవిత్ర పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, కాళహస్తి, విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధి నుండి మొట్టమొదట సారిగా సారె తీసుకొని రావడం జరిగిందని. ఇది శాశ్వతంగా వస్తుందని అన్నారు. బ్రహ్మోత్స వాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తి స్దాయిలో జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ట్రస్టుబోర్డు మెంబర్లు, అర్చక స్వాములు, మోతకాపులు, గ్రామప్రజలు అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా చేశామని అన్నారు. త్వరలో అన్నదానానికి నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తామని వారు తెలిపారు. మే 31వ పదహారు రోజుల పండుగగా స్వామి అమ్మవార్లకు కన్నుల పండుగగా నిర్వహిస్తామని చెప్పారు.

ఈకార్యక్రమంలో ట్రస్టు బోర్డు మెంబర్లు పి. సుమలత, కీలుకుప్ప శ్రీనివాసులు, సుధాకర్, సుధారాణి, శారద ప్రధాన అర్చకులు గంగా ప్రసాద్ స్వామి, అలాగే టిడిపి నాయకులు పవన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐ యుగంలో ఎంబిఎ విద్యపై 30న నెల్లూరులో జాతీయ సదస్సు

● మంత్రి నారాయణ చేతుల మీదుగా ఎన్‌సి-రైమ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త:** నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఎన్‌సి-రైమ్ 2026 రీ ఇమేజింగ్ ఎంబిఎ ఎడ్యుకేషన్ ఇన్ ఇద ఎరా ఆఫ్ ఏఐ, ఎనాలిస్టిక్స్ అండ్ ఫిన్ టెక్నాలజీకి సంబంధించిన జాతీ సదస్సు పోస్టర్‌ను ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సును ఈ నెల 30న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థ కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ), ఎనాలటిక్స్, ఫిన్ టెక్ డిజిటల్ సాంకేతికతలు అన్ని రంగాల్లో విస్తృత ప్రభావం చూపుతున్నాయని, మేనేజ్ మెంట్ విద్య కూడా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను మాత్రమే లక్ష్యంగా కాకుండా నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థం, నిర్ణయాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేసే ఇటువంటి జాతీయ సదస్సులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, కెరీర్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.

ఈ సందర్భంగా ఎంబిఎ డీన్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ డాక్టర్ గంగినేని ధనంజయ్ మాట్లాడుతూ ఎన్‌సి-రైమ్2026 జాతీయ సదస్సు ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదిక పైకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు అకడమిక్ పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక అవగాహన, పరిశోధనా దృక్పథం, పరిశ్రమలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మేనేజ్ మెంట్ విద్య సంప్రదాయ బోధనా విధానాలకు మాత్రమే పరిమితం కాకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందుతోందన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

ఎపి సర్కార్‌కు బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** ప్రొఫెసర్ నాగేశ్వర్.. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసం హరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్‌రావు హితవు పలికారు. భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## బాన్సువాడలో ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ లంచం తీసుకుంటున్న విడియో వైరల్

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా బాన్సువాడలో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఒకరు పాస్‌పోర్టు పరిశీలనకు దరఖాస్తుదారుడి నుంచి లంచం తీసుకుంటున్న విడియో జిల్లా వ్యాప్తంగా వైరల్‌గా మారింది. జిల్లాలోని బాన్సువాడ డివిజన్‌లో పాస్‌పోర్టుల పరిశీ లన బాధ్యతలను సురేష్ అనే హెడ్ కానిస్టేబుల్ చూస్తుంటాడు. బాన్సువాడలోని ఓ కాలనీలో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఇంటికి వెళ్లిన సమయంలో సురేష్ లంచం తీసుకుంటున్నట్లు వీడియో ఆదివారం జిల్లావ్యాప్తంగా టివిల్లో ప్రసారం అయ్యింది. ఈ ఘటన ఎప్పుడు జరిగిందనేది తెలియ రాలేదు.

# హైదరాబాద్‌లో ఉగ్ర కలకలం

## పాక్ ఉగ్రవాదులతో సంబంధాలున్న యుపి యువకుడి అరెస్టు

**హైదరాబాద్, (మేడ్చల్) మే 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి ఉగ్ర కలకలం రేగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఓ యువకుడు పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడ ఓ హోటల్‌లో కార్మికుడుగా పనిచేస్తూ ఏకంగా పాక్‌లోని ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి, ఉగ్రవాద సంస్థల్లో చేరేందుకు సోషల్ మీడియా ద్వారా యత్నించి పోలీసులకు దొరికి పోయాడు. ఈ సందర్భంగా ఇతని వద్ద డమ్మీ తుపాకీని, ఉగ్రవాదులతో చాటింగ్‌కు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

ఘజియా బాద్‌కు చెందిన జయీద్‌ఖాన్ (26) కొన్ని నెలల క్రితం ఇదే ప్రాంతంలో పనిచేసే తన స్నేహితుడు ఫైజల్ ఆహ్వానం మేరకు పొట్టకూటి కోసం నగరా నికి వచ్చాడు. అనంతరం మేడ్చల్‌లోని ముబారక్ హోటల్‌లో కార్మికుడుగా చేరాడు. అయితే కొంత కాలంగా ఇతను డమ్మీ తుపాకీతో రీల్స్ చేస్తూ అసలైన తుపాకీలా దానిని తిప్పుతూ సినిమా స్టయిల్‌లో వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇతని రీల్స్‌కు వ్యూవ్స్ బాగానే రావడంతోపాటు పాక్‌లోని కొందరు ఉగ్రవాదులు సోషల్ మీడియా ద్వారా వీటిని గమనించారు. అనంతరం జయీద్ ఖాన్‌తో వారు వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయం పెంచుకుని చాటింగ్ చేయసాగారు. దీని తరువాత పాక్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్ కలిగిన ఓ సంస్థకు చెందిన షహబాద్ అనే ఉగ్రవాది జయీద్‌ఖాన్‌తో నేరుగా చాటింగ్ చేయసాగాడు. తమతో కలిసి పనిచేయాలని, ఇందుకోసం అసలైన ఆయుధాలను ఇస్తామని అతను కోరగా అందుకు జయీద్‌ఖాన్ అంగీకరించాడు. అయితే జయీద్ ఖాన్ సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా వుంచగా అతని బండారం రట్టయ్యింది.



పాక్ ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి మేడ్చల్ పోలీసులకు పట్టుబడిన జయీద్ ఖాన్

ఇతని వివరాలపై ఆరా తీయగా అతను మేడ్చల్‌లో ఉంటున్నట్లు తేలింది. దీంతో ఆదివారం ఉదయం జయీద్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. నిందితుడి వద్ద ఒక డమ్మీ తుపాకీని, పాక్‌లోని ఉగ్రవాదులతో చాటింగ్ చేసేందుకు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. ఇతని బ్యాంకు ఖాతాలపై ఆరా తీస్తున్నారు. పాక్ ఉగ్రవాదులతో ఇతను ఎలా చాటింగ్ చేశాడు? దీని వెనుకున్న వారెవరు? భారత్‌లో ఇతను ఏదైనా కుట్రలకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించారు. ఈ సమావేశంలో డిఐ కిరణ్ కూడా పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్త హత్య

9 రోజుల తర్వాత బయటపడిన నిజం

సంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన



ముత్యంరెడ్డి (ఫైల్)

**నారాయణఖేడ్, మే 24, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లాలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఈ విషాదకర సంఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి (30) తన భార్య ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేస్తూ తరచూ ప్రశ్నించేవాడు. దీంతో అతడే తమ అక్రమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన భార్య కల్పన, తన ప్రియుడు చింటుతో కలిసి అతడిని అంతమొందించాలని పథకం రచించింది. అనుకున్న ప్రకారమే ఇద్దరూ కలిసి ముత్యం రెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం నేరాన్ని గుట్టుగా ఉంచేందుకు జేసీబీతో గొయ్యి తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు సమాచారం. ఆ తర్వాత భర్త కనిపించడం లేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసి అనుమానం రాకుండా ప్రయత్నించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించి అనుమానాస్పద అంశాలపై దృష్టి సారించారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా ఘటన జరిగిన 9 రోజుల తర్వాత భార్య, ఆమె ప్రియుడు అసలు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నారాయణఖేడ్ డిఎస్పి వెంకట్ రెడ్డి వెల్లడించారు. అధికారుల సమక్షంలో జెసిబి సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపగా, స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఆట

# రాయల్‌గా ప్లే ఆఫ్‌లోకి రాజస్థాన్

*అర్చర్ ఆల్‌రౌండ్ షో * ముంబైపై విక్టరీ * పంజాబ్ కింగ్స్ ఆశలు గల్లంతు * తొలి ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో ఢీ *







*అందరి చూపు వాంఖడేపైనే. ఐపీఎల్‌లో ఇప్పటివరకు జరిగిన 68 మ్యాచ్‌లు ఒకెత్తయితే, ఇది నాలుగు జట్ల భవిష్యత్‌ను నిర్ణయించే మ్యాచ్. మైదానంలో ఆడుతున్న జట్లలో ముంబైకైతే గెలిచినా, ఓడినా పరక్ పడదు. గుజరాత్ రాయల్స్‌కైతే డూ ఆర్ డై, గెలిస్తేనే ముందుకు. ఆ జట్టుతో పాటు మరో మూడు జట్లు పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు మైదానంలో ఆడకున్నా ఈ ఫలితంపై వారి భవిష్యత్తు. చివరకు ఒక్క హాఫ్ సెంచరీ నమోదుకాకున్నా తలా ఓ చేయి వేసి మొదట ముంబైకు 206 టార్గెట్ ఇచ్చారు. 200 ప్లస్ దాకా రావడం అంటేనే గ్రేట్. అలాంటిది ఈ స్కోరును కాపాడుకుంటూ స్టార్ ఆటగాళ్లున్న ముంబైకు ముకుతాడు వేశాడు. అనుకున్నది సాధించారు. నాలుగో ప్లే ఆఫ్ బెర్త్‌ను అందుకున్నారు.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచిది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసిన రాజస్థాన్ రాయల్స్... ఆ తర్వాత ముంబైను 20 ఓవర్లలో 9 వికెట్లకు 175 పరుగులకే పరిమితం చేసింది. పంజాబ్ కింగ్స్, కోల్‌కతా ఆశలపై నీళ్లు చల్లుతూ ప్లే ఆఫ్‌లోకి దూసుకెళ్లింది. 26న న్యూ చండీఘర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడేందుకు సిద్ధమైంది.

లక్ష్య చేధనలో ముంబై ఇండియన్స్ మరోసారి తడబడింది. కనీసం పరుగుల ఖాతా కూడా ఓపెన్ చేయకుండానే మొదటి వికెట్ కోల్పోయింది. హిట్ మ్యాన్ రోహిత్‌శర్మను జోఫ్రా ఆర్చర్ డకౌట్ చేశాడు. అదే ఊపులో తన రెండో ఓవర్‌లో నమన్ ధీర్(6)ను అద్భుత బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్ నుంచి బర్గర్...రికల్టన్(12)ను అవుట్ చేసి ముంబైని మరో దెబ్బతీశాడు. క్రీజులోకి వచ్చిన తిలక్(3) కూడా పెవిలియన్‌కు క్యూ కట్టాడు. దీంతో ముంబై 38 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన విల్ జాక్స్ కిరాక్ షాట్లతో బెంబేలెత్తించాడు. 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులతో 33 పరుగులు చేసిన జాక్స్ దూకుడుకు యష్‌రాజ్ పుంజా ఫుల్ స్టాప్ పెట్టాడు. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులోకి రాగానే భారీ షాట్లతో రాయల్స్ జట్టులో ఆందోళన రేపాడు. మరో ఎండ్‌లో క్రీజ్‌లో నిలదొక్కుకున్న సూర్యకుమార్(42 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడడంతో ముంబై గెలిచే ఊపులో కనిపించింది. ఈ దశలో మరోసారి అర్చర్ మ్యాజిక్ చేశాడు. హార్దిక్ పాండ్యాను అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో బర్గర్, యష్ పుంజా, బ్రిజేష్ వికెట్లు తీయడంతో ముంబై 175 రన్స్ కే పరిమితమైంది.రాజస్థాన్ బౌలర్లలో అర్చర్ 3వికెట్లు.. బర్గర్, బ్రిజేష్, యష్‌రాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

### ఆరంభంలో తడబడ్డ రాజస్థాన్

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు యశస్వీ జైస్వాల్(17 బంతుల్లో 27) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. మూడు సిక్స్‌లతో విరుచుకుపడ్డ యశస్వీ.. స్పిన్నర్ విల్‌జాక్స్ బంతిని బాదే ప్రయత్నంలో అవుటయ్యాడు. జైస్వాల్ అవుట్ తర్వాత స్కోరు పెంచే ప్రయత్నంలో వైభవ్(4)కూడా అదేస్కోరు వద్ద చాహర్ కు చిక్కాడు. దీంతో 33 పరుగుల వద్దే ఇద్దరూ విధ్వంసక ఓపెనర్లు అవుటవడంతో రాజస్థాన్ తడబడింది. క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రియాన్(14) రెండు ఫోర్లు,ఓ సిక్స్‌తో చెలరేగాడు. అదే క్రమంలో ఘజన్‌ఫర్ బంతిని స్టాండ్‌లోకి ఆడే ప్రయత్నం చేయగా, బౌండరీ లైన్ పైన అంతెత్తున ఎగిరి తిలక్ వర్మ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దీంతో రాజస్థాన్ 54 పరుగులకే 3 టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయింది.

### మిడిల్ ఓవర్లలో పుంజుకుని...

కష్టాల్లో పడ్డ రాజస్థాన్‌ను ధృవ్ జురెల్(26 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దాసున్ షనక(15 బంతుల్లో 29; 3 సిక్స్‌లు)కాసేపు వికెట్ల పతనానికి అడ్డుగా నిలిచారు. ముఖ్యంగా షనక... ధాటిగా ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. వందకు చేరువవుతున్న దశలో లేని పరుగుకు యత్నించి రనౌటయ్యాడు. దీంతో 45 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. షనక అవుటైన తర్వాత జురెల్ గేర్ మార్చి ఆడే ప్రయత్నం చేశాడు. కార్బిన్ బాష్ యార్కర్ లెంగ్త్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చిన డోనోవన్ ఫెరీరా (18) దీపక్ చాహర్ బౌలింగ్‌లో, శుభమ్ దూబె (5) శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో వరుసగా అవుట్ అవుటయ్యారు.

### స్లాగ్ ఓవర్లలో అర్చర్ మెరుపులు

స్లాగ్ ఓవర్లలో టెయిలెండర్లు దూకుడు చూపారు. జోఫ్రా ఆర్చర్(15 బంతుల్లో 32; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ముంబై బౌలర్లపై సిక్స్‌లతో విరుచుకుపడుతూ రాజస్థాన్ స్కోరును 175 దాటించాడు. ఇక ఇంఫాక్ట్ ప్లేయర్‌గా క్రీజ్‌లోకి వచ్చిన రవీంద్ర జడేజా(11 బంతుల్లో 19), నండ్రే బర్గర్(3 బంతుల్లో 10) చివరి రెండు ఓవర్లలో 30పరుగులు జోడించడంతో రాజస్థాన్ స్కోరు 200 పరుగులు దాటింది. మిడిల్ ఓవర్లలో పుంజుకుని.. గట్టిగ నిలబడి రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# విజయంతో ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్

**కోల్‌కతా:** ఐపీఎల్ ఈ సీజన్‌లో ప్లే ఆఫ్ చేరడంలో విఫలమైన ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపుతో ముగించింది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన నామమాత్ర మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. మొత్తం ఏడు విజయాలతో 14 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. కోల్‌కతా 13 పాయింట్లతో ఏడో స్థానం పొందింది. రెండు జట్లు కూడా ప్లే ఆఫ్ చేరకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించాయి.

మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. అభిషేక్ పోరెల్(18బంతుల్లో 22)తో కలిసి కెఎల్ రాహుల్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు. పోరెల్ ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. అతను అవుటైన తర్వాత రాహుల్ ఎదురుదాడికి దిగాడు. తన క్లాసీ షాట్లతో అలరించాడు. కోల్‌కతా బౌలర్లను చితక్కొడుతూ 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌ల సహాయంతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివరకు రాహుల్ ఇన్నింగ్స్‌కు అనుకుల్ రాయ్ తెరదించాడు. మరోవైపు క్రీజ్‌లోకి వచ్చిన సాహిల్ పారిఖ్(17 బంతుల్లో 24), అక్షర్ పటేల్(25 బంతుల్లో 39), డేవిడ్ మిల్లర్ (19 బంతల్లో 28), అషుతోష్ శర్మ(11 బంతుల్లో 18) ధాటిగా ఆడడంతో ఢిల్లీ స్కోరు 200 మార్కు దాటింది.

అనంతరం లక్ష్యచేధనలో తడబడ్డ కోల్‌కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ బౌలర్లు కోల్‌కతా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ముఖ్యంగా కుల్‌దీప్ స్పిన్ తిప్పేశాడు. చివరి నాలుగు వికెట్లు 9 పరుగులకే పడ్డాయి. కెప్టెన్ రహానే 63 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కోల్‌కతా బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, ఎంగిడి మూడేసి వికెట్లు, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టారు.






## 100 మీటర్లలో సరికొత్త రికార్డు

# అథ్లెటిక్స్‌లో నయా చిరుత

**రాంచీ:** భారత అథ్లెటిక్స్‌లోకి సరికొత్త చిరుత దూసుకువచ్చింది. రాంచీలో జరుగు తున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్‌కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. స్వర్ణాన్ని అందుకున్నాడు. అనిమేష్ కుజూర్ (10.20 సెకన్లు) రజతం, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు.

తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. సెమీఫైనల్లో 10.17 సెకన్ల టైమింగ్ నమోదుచేసిన గురిందర్ సింగ్... తన రికార్డును మరింత మెరుగుపర్చుకున్నాడు.

అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని గురిందర్‌వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇక విశాల్ 400 మీటర్ల పరుగులో 44.98 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పాడు.

## 500 బిలియన్ డాలర్ల దిగుమతులకు అంగీకారం



### ఐదేళ్లపాటు అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లు

**న్యూఢిల్లీ, మే 24:**అమెరికా ఉత్పత్తులను వచ్చే ఐదేళ్లపాటు 500బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసేందుకు భారత్ డీల్ కుదిరిందని, ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం రంగాలే ప్రధానంగా భారత్‌తో చర్చలు కూడా పూర్తి చేసినట్లు విదేశాంగమంత్రి మార్కో రుబియో అన్నారు.వాణిజ్యం, భద్రత,ప్రాంతీయ అంశాలవారీగా భారత ప్రతినిధి బృందంతో అమెరికా బృందం సమగ్ర చర్చలుజరిగాయన్నారు. క్వాడ్ మంత్రుల సమావేశాలో పాల్గొనేందుకు భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన రుబియో ఇంధన భద్రత, వాణిజ్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతులతో పాటు అమెరికానుంచి భారత్‌కు వచ్చే దిగుమతులపైనా ఎక్కువ చర్చలుజరిగాయి. ఇందుకోసం తమకు భారత ప్రభుత్వంనుంచి 500 బిలియన్ డాలర్లమేర ఉత్పత్తుల కొనుగోలుకు అంగీకార ఒప్పందం జరిగిందని రుబియో చెప్పారు. అలాగే అమెరికా భారత్‌లమధ్య వాణిజ్య ఒప్పందం సత్వరమే ఖరారవుతుందన్న విశ్వాసం ప్రకటించారు. చర్చల్లో సానుకూలత పెరిగిందని, తుదిదశకు వాణిజ్య ఒప్పందం చేరుకుంటున్నట్లు ఆదేశ విదేశాంగమంత్రి వెల్లడించారు. వాణిజ్యం, ఇతర రాంగాల్లో కేవలం మిత్రలుగానే కాకుండా వ్యూహాత్మక మైత్రీబంధం రెండుదేశాలమధ్య పెరుగుతున్నదని రుబియో ఆశాభావం వ్యక్తంచేసారు.

## భారీ డివిడెండ్ ప్రకటించిన 3ఎం ఇండియా




**ముంబయి, మే 24:** టెక్నాలజీ అండ్ సైన్స్ దిగ్గజ కంపెనీ 3ఎం ఇండియా ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం ఫలితాల్ని ప్రకటించడంతో పాటు డివిడెండ్ కూడా ప్రకటించింది. ఫైనల్ డివిడెండ్ రూ. 160 తో పాటు రూ.346 స్పెషల్ డివిడెండ్ కూడా ప్రతిపాదించింది.మొత్తంగా చూస్తే ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.506 చొప్పున డివిడెండ్ అందించనుంది. రూ. 10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుకు ఈ స్థాయిలో అర్హులైన షేర్ హోల్డర్లకు డివిడెండ్ ఇవ్వనుంది. ఇక ఈ డివిడెండ్ చెల్లింపులకు జులై 17 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. ఆ తేదీలోపు ఈ సంస్థ షేర్లను కలిగి ఉన్న వారు డివిడెండ్ పొందేందుకు అర్హులు అన్నమాట. ఆగస్టులో జరగనున్న తమ 39వ వార్షిక సర్వసభ్య సమావేశంలో బోర్డు, షేర్ హోల్డర్ల ఆమోదానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేసింది. ఇక్కడ ఆమోదం లభిస్తే అప్పటి నుంచి 30 రోజుల్లోగా డివిడెండ్ చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. ఈ కంపెనీ ఈ స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం ఇదేం తొలిసారి కాదు. ఇలా భారీ డివిడెండ్స్ గతంలోనూ ఆఫర్ చేసింది. 2025 జులైలో ఫైనల్ డివిడెండ్, స్పెషల్ డివిడెండ్ కలిపి రూ. 535 చొప్పున చెల్లించగా దానికి ముందటి ఏడాది రూ. 685 అందించింది. 2023 జులైలో రూ. 100 డివిడెండ్ ఆఫర్ చేయగా 2022 నవంబరులో స్పెషల్ డివిడెండ్ ఏకంగా రూ. 850 ఆఫర్ చేయడం విశేషం.

## టాప్10 బిలియనీర్ల సంపద 3.93 లక్షల కోట్లు

**ముంబై:** ఫోర్బ్స్ 2026 ప్రపంచ బిలియనీర్ల జాబితాలో భారత రియల్ ఎస్టేట్ రంగం తన సత్తా చాటింది. ఈ జాబితాలో 13 మంది భారత రియల్టీ దిగ్గజాలు స్థానం సంపాదించగా, వారిలో హైదరాబాద్‌కు చెందిన మై హోమ్ గ్రూప్ అధినేత జుపల్లి రామేశ్వర్ రావు మరోసారి తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మొదటిస్థానంలో ఎప్పటిలాగే డిఎల్ఎఫ్ నిలిచింది. మాజీ ఛైర్మన్ సిఇఒ కుశాల్ సింగ్ అగ్రస్థానంలో నిలిస్తే లోథాగ్రూపు, రహేజాకార్ప్ వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచాయి. గత ఏడాదితో పోలిస్తే రియల్టీ బిలియనీర్ల సంఖ్యలో మార్పులేదు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, మైహోమ్స్ రామేశ్వర్ రావు భారత రియల్టీ బిలియనీర్ల జాబితాలో ఆయన 6వ స్థానంలో నిలిచారు. ఆయన సంపద రూ.22,011కోట్లుగా ఉంది. సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే భారత రియల్టీ వ్యాపారులు తమ సంపదను కాపాడుకోగలిగారని ఫోర్బ్స్ ఇండియా విశ్లేషించింది.

మైహోమ్స్‌తో పాటు డిఎల్ఎఫ్ మాజీ సిఇఒ కుశాల్‌పాల్ సింగ్, లోథా గ్రూప్ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోథా, కె.రహేజా కార్ప్ ఛైర్మన్ చంద్రు రహాజా, ఓబరాయ్ రియాల్టీ ఛైర్మన్ వికాస్ ఓబెరాయ్, ఫోనిక్స్ మిల్స్ అతుల్ రూయా, ఫైవ్ హోల్డింగ్స్ ఛైర్మన్ కబీర్ ముల్చందానీ, కల్పతరు ఫౌండర్ మొఫత్‌రాజ్ మునోత్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ నుంచి రెజ్వాన్ ఇర్ఫాన్, నోమన్‌రజాక్‌లు బిలియనీర్స్ టాప్ టెన్ జాబితాలో చేరారు. మొత్తం టాప్‌టెన్ రియాల్టీ బిలియనీర్ల సంపద భారత్‌వరకే రూ.3.93 లక్షలకోట్లకుపైగా ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

## పెట్రోలుపై రూ.13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టం

# చమురు కంపెనీలకు ఇప్పటికీ నష్టాలే

**ముంబయి, మే 24:** పదిరోజుల్లోపే వరుసగా మూడుసార్లు పెట్రోలుడీజిల్‌ధరలు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్‌కంపెనీలకు ఇంకా నష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో చమురు సరఫరాలో ఆటంకాలు, ముడిచమురు కొరతకారణంగా ధరలు పెంచుతున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో కూడా ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైబడటంతో చమురుశుద్ధి కంపెనీలకు ఈ భారం మరింత పెరుగుతోంది. ఇప్పటికీ కూడా పెట్రోలుపై లీటరుకు 13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టాలు భరించాల్సి వస్తోందని చెపుతున్నాయి. సర్దుబాట్లు జరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలకు నష్టాలభారం రూ.1.98 లక్షలకోట్లు అని ఇప్పటికే ప్రకటించాయి. ఈ ధరల పెంపును ప్రకటించకముందు కేంద్ర పెట్రోలియం మంత్రి హార్‌దీప్‌సింగ్‌పూరి మాట్లాడుతూ రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఎదుర్కొంటున్నాయని, పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ సిలిండర్లను తక్కువధరలకే అందిస్తున్నట్లు గుర్తుచేసారు. సమిష్టిగా ఈ మూడు విబాగాల్లో రూ.1.98 లక్షలకోట్లు నష్టం వస్తోందని చెప్పిన సంగతి తెలిసిందే.

పెట్రోలు డీజిల్‌దరలు రూ.3 చొప్పున పెంచిన తర్వాత కూడా ఇక్రారేటింగ్స్ అంచనాలప్రకారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.500 కోట్లు నష్టం ఎదుర్కొనక తప్పదని అంచనా వేసాయి. అందువల్ల భవిష్యత్తులో మరిన్ని రేట్లపెంపు ఉంటాయనికూడా హెచ్చరించింది. ఇప్పటికి మూడుసార్లు ధరలు పెంచిన పెట్రో డీజిల్‌కంపెనీలు భవిష్యత్తులో నష్టాలను పూర్తిగా భర్తీచేసుకునేందుకు రేట్లపెంపు ఒక్కటే మార్గమని సంకేతాలిస్తున్నాయి. హార్మజ్ జలసంధి ఉద్రిక్తతలు, పశ్చిమాసియా యుద్ధ విరమణ అంటూ జరిగితే కొంతమేర ఉపశమనం లభిస్తుందని, లేనిపక్షంలో ధరల పెరుగుదల ఒక్కటే మార్గమని కూడా రేటింగ్ సంస్థలు అంచనావేసాయి.







## భారీగా ఆరు కంపెనీల మార్కెట్

# రూ.74,112కోట్ల ఎంక్యాప్ వృద్ధి

**ముంబయి, మే 24:**దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారంలో సానుకూలంగా స్పందించడంతో దేశంలోని టాప్10 కంపెనీలలో ఆరు కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ఈ ఆరు కంపెనీల సంయుక్త మార్కెట్ విలువలు ఏకంగా రూ.74,111.57 కోట్లు వృద్ధి చెందింది. ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపించడంతో ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, ఎల్ఐసీ వంటి దిగ్గజాలు లాభాల్లో పయనించాయి. గడిచిన వారంలో లాభపడిన కంపెనీలలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అగ్రస్థానంలో నిలిచింది. టీసీఎస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.19,338.68 కోట్లు పెరిగి రూ.8,38,401.33 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.14,515.93 కోట్లు ఎగబాకి రూ.9,06,901.32 కోట్లకు చేరుకుంది.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.9,076.37 కోట్లు పెరిగి రూ.5,14,443.69 కోట్లకు చేరగా, బజాజ్ ఫైనాన్స్ విలువ రూ.3,797.83 కోట్లు పెరిగి రూ.5,70,515.57 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో సంపద కూడా రూ.2,685.87 కోట్లు పెరిగి మొత్తం రూ.5,40,228.21 కోట్లుగా నమోదైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) తమ మార్కెట్ విలువలు కొంతమేర కోల్పోయాయి. అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.20,229.67 కోట్లు తగ్గి రూ.11,40,295.49 కోట్లకు పడిపోయింది. హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.16,212.18 కోట్లు,ఎస్బీఐ విలువ రూ.12,784.4 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.2,094.35 కోట్లు చొప్పున తగ్గాయి. దేశంలో అత్యంత విలువైన కంపెనీల ర్యాంకింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి.

# ఐపిఓకు వస్తున్న ఎస్ఎంఆర్ జ్యూయెల్స్

**ముంబయి, మే 24:** లిస్టింగ్ గెయిన్స్ పొందాలనుకునే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల కోసం కొత్త ఎస్ఎంఈ ఐపీఓ అందుబాటులోకి వస్తోంది. సాంప్రదాయ బంగారు ఆభరణాలతోపాటు హెరిటేజ్ డిజైనర్ నగల తయారీ, పెళ్లిళ్లు, పండగల కోసం సరికొత్త డిజైన్లను రూపొందించే కంపెనీ ఎస్ఎంఆర్ జ్యూవెల్స్ లిమిటెడ్ పబ్లిక్‌ఇష్యూకు వస్తోంది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ మే 26వ తేదీన ప్రారంభమవుతోంది. ఈ కొత్త పబ్లిక్ ఇష్యూ 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ద్వారా ఎస్ఎంఆర్ జ్యూయెల్స్ కంపెనీ మొత్తం రూ. 67.23 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓ ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 128 నుంచి రూ. 135గా నిర్ణయించింది. ఈ ఐపీఓలో పాల్గొనాలనుకునే వారు కనీసం 1000 షేర్లు కొనుగోలు చేయాలి అంటే రూ. 2.70 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇక కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ సహా ఎస్ఎంఈలో లిస్టింగ్ కానున్నాయి.ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 2.49లక్షల షేర్లు విక్రయిస్తోంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.3 కోట్లు సమీకరించనుంది.




పబ్లిక్‌కి రూ. 10 ఫేస్ వ్యాల్యూ గల 47.31లక్షల షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.64 కోట్లు పొందనుంది. ఈ ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలు, అదే విధంగా కంపెనీ తీసుకున్న లోన్స్ పూర్తిగా లేదా పాక్షికంగా పేమెంట్ చేసేందుకు ఉపయోగించాలని తెలిపింది.

చివరగా మూలధన వ్యయం అవసరాల కోసమూ వినియోగించనుందని తెలిపింది. ఇష్యూకు పూర్వ షేర్ రిజిస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనుండగా, వెల్త్ మైన్ నెట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఐపీఓ బుక్ రన్నింగ్ లీడ్ మ్యానేజర్‌గా వ్యవహరించనుంది. ఐపీఓలో రిటైల్ ఇన్వెస్టర్లకి 47.49 శాతం ఎన్ఐఐలకి 38.01 శాతం వాటా,మార్కెట్ మేకర్స్‌కి 5 శాతం వాటా, చివరగా క్యూఐబీలకి 9.50 శాతం వాటాని కంపెనీ కేటాయించింది. ఈ ఐపీఓ డేట్స్ పరిశీలిస్తే జూన్ 1 షేర్స్ ఎలాట్మెంట్ ఉండనుంది. జూన్ 2వ తేదీన ఎలాట్మెంట్ వచ్చిన వారికి డీమ్యాట్ అకౌంట్లోకి షేర్లు క్రెడిట్ అవుతాయి. అలాగే ఈ కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ ఎస్ఎంఈలో లిస్టింగ్ అవుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# చలివేంద్రాన్ని ప్రారంభించిన చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోక్వాల్

**కూనవరం, మే 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కూనవరంలో ఆదివారం రోజున బస్టాండ్ లో చలివేంద్రాన్ని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్ ప్రారంభించారు. స్థానిక యువకుడు ఎచ్చు రవి తన అన్న కుమారుడు రాహుల్ జ్ఞాపకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మండు వేసవిని దృష్టిలో పెట్టుకొని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మంచినీరు, మజ్జిగను చలివేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్



అధికారి మాట్లాడారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుందని, ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యశీతో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఎచ్చు రవి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ శాఖ ఓఎసి గౌతమ్ మీనా మాట్లాడారు. ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ ధర్మేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి రాజబాబు, జనాచుపల్లి వెంకన్న, గడ్డం నవీన్ పాల్గొన్నారు.

## రంపచోడవరంలో అంగ రంగ వైభవంగా ప్రారంభమైన

# ఆదివాసీల రేల ఉత్సవాలు..

### రంపచోడవరంలో భారీ ర్యాలీ.

**పోలవరం జిల్లా ప్రతినిధి, మే 24 ప్రభాత వార్త.** రంపచోడవరం జిల్లా కేంద్రంలో ఆదివారం ఆదివాసీ రేల ఉత్సవాలు అంగ రంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. రంపచోడవరం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించి చరిత్ర సృష్టించారు. ఆదివాసీ అస్తిత్వం, ఉనికి, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ ఐక్యతతోనే సాధ్యం అవుతుందని, వాటి రక్షణకు ప్రతి ఆదివాసీ నడుం భిగించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆదివాసి రేలా ఉత్సవాల సభలో పలువురు ఆదివాసి సంఘ నాయకులు, మేధావులు పాల్గొని ప్రసంగించారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు






రంపచోడవరంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివాసీ రేలా ఉత్సవాలు మొదటి రోజు అత్యంత ఉల్లాసభరితంగా జరిగాయని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్ లు తెలిపారు. వేలాది మంది ఆదివాసీలు,వందల మంది కళాకారులతో కళారూపాలు ప్రదర్శిస్తూ ఆదివాసి సంఘ నాయకులు పిఎంఆర్సి నుంచి ర్యాలీ ని ప్రారంభించి ఐటిడిఏ, అంబేద్కర్ సెంటర్, ఫారెస్ట్ కార్యాలయం మీదుగా సాగిన ర్యాలీ సభ ప్రాంగణమైన జూనియర్ కాలేజ్ క్రీడా మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలకు ఉట్టిపడే విధంగా ఆదివాసీ డాన్సులతో ప్రారంభమైన సభ కు ఎ వో లక్ష్మణ్ రావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ లు అధ్యక్షత వహించారు. ఈ సభలో పాల్గొన్న ఎస్టి కమిషన్ సభ్యులు గొర్లె. సునీత , ఆదివాసి గిరిజన సంఘం జాతీయ నాయకులు పి అప్పలనరస,రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, ఆదివాసీ సంఘాల నాయకులు పండ. సిద్ధార్థ్,బోండ్.వరప్రసాద్ లతో పాటుగా ఆదివాసీ సంఘాల నాయకులు,మేధావులు మాట్లాడుతూ ఆదివాసీల జీవనం,మనగడపై చట్టాలపై సంస్కృతి సాంప్రదాయాలపై ప్రస్తుతం దాడి జరుగుతుందని, భవిష్యత్ తరాలకు సంస్కృతి సాంప్రదాయాలను అందించడం కోసం, హక్కులు చట్టాలను కాపాడుకోవడం కోసం ఆదివాసీలంతా ఒక్కతాటిపై ఉండి ఐక్యత భావాన్ని చాటాలని అన్నారు. అందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చే ఈ ఆదివాసి రేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నందుకు ఆదివాసి గిరిజన సంఘాన్ని అభినందిస్తున్నట్టు అనేకమంది మేధావులు సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో పలువురు ఆదివాసి పెద్దలు,వివిధ ఆదివాసి సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం పార్టీ సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబం మహానాడు

## శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి మే 24 (ప్రభాత వార్త)** తెలుగుదేశం పార్టీ సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబం మహానాడు అని, నాలుగు దశాబ్దాల తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా, రాజకీయ వ్యూహాలకు వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందన పొదుపులో భాగంగా మహానాడు 2026 ను ప్రతి నియోజకవర్గశీ నందు క్లస్టర్ వారీగా నిర్వహించకోవడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గం నందు మే 27, 28 వ తేదీలలో క్లస్టర్ వారీగా పది ప్రాంతాల నందు నిర్వహించు మహానాడు ఏర్పాట్లను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి కొండబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబం మహానాడు అని, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదినం మే 28 వ తేదీ సందర్భంగా ప్రతి ఏటా మే 27, 28, 29 తేదీలలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమక్షంలో జరిగే అతి పెద్ద రాజకీయ వేడుక తెలుగుదేశం పార్టీ నిర్వహించే వార్షిక ఉత్సవమే మహానాడు అని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇందన పొదుపు పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మహానాడు 2026 ను మే 27, 28 తేదీలలో ప్రతి నియోజకవర్గము నందు క్లస్టర్ వారీగా నిర్వహించడం జరుగుతుందని, కాకినాడ నగరం నందు 10 క్లస్టర్లలో పది ప్రాంతాలు క్లస్టర్ 1 - కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాల్, శ్రీనగర్, క్లస్టర్ 2 - వి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్, సాంబమూర్తి నగర్, క్లస్టర్ 3 - లలిత ఫంక్షన్ హాల్, వార్ఫ్ రోడ్, క్లస్టర్ 4 - ఎమ్ ఎమ్ ఫంక్షన్ హాల్, జే. రామారావు పేట, క్లస్టర్ 5 - వి ల్ గ్రాండ్, జగన్నాథపురం, క్లస్టర్ 6 - పైండా శ్రీనివాస చలమయ్య కళ్యాణమండపం, క్లస్టర్ 7 - సూర్య కళామందిరం, క్లస్టర్ 8 - శ్రీరస్తు కన్వెన్షన్ హాల్, రామారావు పేట, క్లస్టర్ 9 - క్షత్రియ పరిషత్ కల్యాణ మండపం, క్లస్టర్ 10 - పెద్దిరెడ్డి కన్వెన్షన్, భానుగుడి నందు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఘనంగా మహానాడును నిర్వహించడం జరుగుతుందని, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అందించు సందేశాలు, తీర్మానాల, కొరకు ప్రతి క్లస్టర్ నందు లైవ్ టెలికాస్ట్ ఎల్ ఈ డి స్క్రీన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, మే 27 న పార్టీ సాధించిన విజయాలు, కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పరిపాలన, మరియు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని, మే 28 న స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు మరియు పలు తీర్మానాలును ఆమోదించడం జరుగుతుందని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, బచ్చు శేఖర్, ఒమ్మి బాలాజీ, పలివెల రవి అనంత కుమార్, చింతలపూడి రవి, పంతాడి రాజు, వాసి రహీమ్, చింతా పేర్రాజు, అమన్ జైన్, మల్లీపూడి నాగ దీపిక, హీరా తాజుద్దీన్, బోనెపల్లి శ్రీనివాస్, పల్లా సురేష్, ఎండీ ఖాన్, మల్లాడి ఏడుకొండలు, కొనాడ ప్రకాష్, ఓలేటి రత్నసాగర్, బొడ్డు సద్గురు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల వెంకన్నకు పోలవరం జిల్లా ఏజెన్సీ జీడిపప్పు

## పరిశీలించిన తీతిదే అధికారులు

**రంపచోడవరం,మే 24 : ప్రభాతవార్త.** రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం అందించేందుకు వందన్ వికాస కేంద్రంలోని జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ద్వారా తయారుచేసిన జీడిపప్పును తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)తో టైఅప్ చేసుకునే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రంపచోడవరం మండలం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో జీడిపిక్కల ప్రాసెసింగ్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం వారితో జీడిపప్పు సరఫరా చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకునే విధంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, టీటీడీ ప్రతినిధులు ప్రాసెసింగ్ యూనిట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని గ్రామాలలో జీడిపిక్కలు ప్రాసెసింగ్ చేసి తిరుమల తిరుపతి దేవస్థానం వారికి లడ్డు ప్రసాదంలో జీడిపప్పు ఏర్పాటు చేయుటకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం రంపచోడవరం కెవికె ప్రాంగణంలో వందన్ వికాస కేంద్రాలు సభ్యులు ఒక జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ కలదని,మరో రెండు యూనిట్లు ప్రైవేట్ ప్రతినిధులు



నిర్వహించుచున్నారని ఆయన తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రతిరోజు సుమారు 3000 కేజీల జీడి మామిడి ఆర్గానిక్ పప్పు అవసరమవుతున్నదని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులు తెలియజేయడం జరిగిందని అదేవిధంగా మన రంపచోడవరం నుండి కనీసం ప్రతిరోజు 500 కేజీల జీడి మామిడి పప్పు సరఫరా చేసే విధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రాంత గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరం, పార్వతీపురం ఐటీడీఏలలో టీటీడీ ప్రతినిధులు పర్యటించి మన రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని రైతులు పండించిన జీడిపప్పుకు మంచి గిరాకీ ఉందని ప్రతినిధులు తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. టిటిడి వంటి ప్రముఖ సంస్థతో అనుసంధానం కావడం ద్వారా స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ లభించడమే కాకుండా గిరిజన కుటుంబాల జీవనోపాధి మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. వందన్ వికాస్ కేంద్రంలో జీడిపిక్కల శుభ్రపరిచే ప్రక్రియ,ప్యాకింగ్,నిల్వ వంటి అంశాలను పరిశీలించిన అధికారులు, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తులను సిద్ధం చేయాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఈ టైఅప్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఉత్పత్తులకు మంచి గుర్తింపు లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, తిరుమల తిరుపతి దేవస్థానం జనరల్ మేనేజర్ ఉమాశంకర్,నాణ్యత నిపుణురాలు ఉషారాణి,పి హెచ్ ఓ నరేంద్ర కుమార్ ,డిపిఎం దుర్గాప్రసాద్,డిఆర్డిఏ యాంకర్ పర్సన్ రామరాజు,ఏపిఎం శ్రీరామ్,కే దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి నిత్యాన్న పథకానికి

# రూ.1,00,116/- విరాళం

### శ్రీవారి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణం లో పాల్గొన్న భక్తులు.







**ఆత్రేయపురం, మే ,24,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నిత్యాన్న పథకానికి రాజమండ్రి,ఎవి. అప్పారావు రోడ్డుకు చెందిన పరుచూరి గోపాలకృష్ణ, లక్ష్మి కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116/- విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు స్వామివారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ వై. శ్రీనివాస్ లు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు .

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన వివరాలు

**రాజమహేంద్రవరం సిటీ, మే 24( ప్రభాతవార్త)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సోమవారం రాజమహేంద్రవరం నగరంలో పర్యటించనున్నారు. ఆదివారం మంగళగిరి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటల 30 నిమిషాలకు స్థానికంగా ఏర్పాటు చేసిన వసతిగృహం కు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు. సోమవారం ఉదయం 6 గంటలకు హోటల్ షెల్టర్ నుండి బయలుదేరి పుష్కర ఘాటుకు చేరుకుని అక్కడ పుష్కరాల ఏర్పాట్లను పరిశీలిస్తారు అనంతరం బోటు ద్వారా కోటిలింగాల ఘాటుకు వరకు ప్రయాణిస్తూ నల్ల ఛానల్ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. ఉదయం 6 గంటల 50 నిమిషాల కోటిలింగాల ఘాట్ చేరుకుని అక్కడ ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం నడక దారిన నల్ల కాలువ ప్రాంతానికి చేరుకుంటారు అక్కడ వ్యర్థాలు శుద్ధి వేరు చేసే ప్లాంట్లను పరిశీలిస్తారు. అనంతరం ఉదయం 7 గంటల 50 నిమిషాలకు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు అనంతరం ఉదయం 9 గంటలకు హోటల్ సెల్టన్కు చేరుకుంటారు.

## వాడపల్లి దేవస్థానం అభివృద్ధి కి ఉప కమిషనర్

# 'నల్లం 'అహర్నిశలు కృషి...

### పంచాయతీ రాజ్ అధికారులతో పార్కింగ్ రోడ్లు పరిశీలన..





**ఆత్రేయపురం, మే ,24,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం రోజు రోజుకు భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్న సంగతి విదితమే..నూతనంగా పార్కింగ్ నందు వేసిన సీసీ రోడ్లను పంచాయతీ రాజ్ ఈ ఈ, రామకృష్ణ, డి ఈ, రాంబాబు లతో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు కలిసి పరిశీలించారు. అలాగే వకుళ మాత అన్నదాన భవనం, కోనేరు, తదితర పనులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతం చేయ్యాలని అధికారులకు తగు సూచనలు చేశారు.


వాడపల్లి(V),ఆత్రేయపురం (M), కోనసీమ జిల్లా.

**భూములు కౌలు హక్కు బహిరంగ వేలం మరియు షాపుల సీల్డ్ టెండరు/బహిరంగ వేలం ప్రకటన**

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము హక్కు భుక్తములైయున్న లొల్ల మరియు వాడపల్లి గ్రామాలలో గల ఈ క్రింది సర్వే నెంబర్లలో గల య. 9.75 సెంట్లు పల్లం భూములకు ఈ క్రింది వివరించిన విధముగా కౌలు హక్కుల కొరకు 3 సంవత్సరములకు కాలపరిమితిక 2026-27 నుండి 2028-29 వరకు గాను ది.10/06/2026 న బుధవారం ఉదయం 10.00 గం.లకు వాడపల్లి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ కార్యాలయం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షమున ఆంధ్రప్రదేశ్ హిందూ దేవదాయ ధర్మదాయ చట్టం లోని సెక్షన్ 82(1) ప్రకారం G.O.Ms.No.379,Dt.11/03/2003 మరియు సవరించిన G.O.Ms.No.425,Dt. 09/11/2015 లోని నిబంధన మేరకు దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఆమోదము మేరకు బహిరంగ వేలం నిర్వహించబడును.

| వ.నెం | భూమి ఉన్న గ్రామం | రి.స.నెం | విస్తీర్ణం (యు) | పల్లం/మెరక | ధరావత్తు | సాల్వెన్సీ |
|---|---|---|---|---|---|---|
| 1 | లొల్ల | 195 | 1.80 సెంట్లు | పల్లం | రూ.20,000/- | 2,00,000/- |
| 2 | వాడపల్లి | 40/3A | 2.52 సెంట్లు | పల్లం | రూ.25,000/- | 2,00,000/- |
| 3 | వాడపల్లి | 32/A | 2.90 సెంట్లు | పల్లం | రూ.30,000/- | 2,00,000/- |
| 4 | వాడపల్లి | 40/6A | 2.53 సెంట్లు | పల్లం | రూ.25,000/- | 2,00,000/- |
| | | | 9.75 సెంట్లు | | | |

| నెం. | టెండరు వివరములు | ధరావత్తు | పాట వివరములు |
|---|---|---|---|
| 1 | పార్కింగ్ ప్రదేశము నందు తాత్కాలిక షాపులు 10x10x10 కొలతలలో షాపు నెం. 1, 38, 39, 40, 41, 48, 49, 62, 66, 67, 68, 69, 75, 76, 84 (అప్పజెప్పిన తేది నుండి 3 సం.రాలు కాలపరిమితికి) | 50,000/- | బాక్స్ టెండరు దాఖలు : ది:10-06-2026 ఉదయం గం.11.00 లకు బహిరంగ వేలం : ది:10-06-2026 ఉదయం గం.11.00 నుండి బాక్స్ టెండరు తెరుచుసమయం: ది:10-06-2026 ఉదయం గం 11.30 లకు |

**షరతులు** 1. ఈ బహిరంగ వేలం దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీయుత ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి బహిరంగ వేలం నిర్వహించబడును. 2. సంస్థకు బకాయి ఉన్నవారు గానీ, ఇతరత్రా లావాదేవీలు ఉన్న వారు గాని పాటలో పాల్గొనుటకు అనర్హులు. 3. పాటలో పాల్గొను వారు పై పట్టికలో తెలిపిన ప్రకారం ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాటలో పాల్గొనదలిచిన వారు భూమి హెచ్చు తగ్గులను ముందుగా చూచుకొని, హిందువులు మాత్రమే పాటలో పాల్గొనవలెను. 4.ఏ కారణము చేతనైనా పాట నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకు గానీ కార్యనిర్వాహణాధికారి వారికి అధికారము కలదు. 5.హెచ్చుపాట దారుడు 3 ఖాళీ బ్లాంక్ చెక్కులు ఇవ్వవలెను. 6.మిగిలిన వివరములు షరతులను దేవస్థానం కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకోవచ్చును. 7. ధరవత్తును Tendar Deposit, The Executive Officer, Sri Venkateswara Swamy Temple, Vadapalli పేరున ఏదైన జాతీయ బ్యాంకు నుండి డి.డి. తీసి జతపర్చవలెను. మిగతా వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం: 08855-271888, Whatsapp: +91-9491000085. 8.టెండరు షెడ్యూలు ది.6-06-2026 నుండి ది. 09-06-2026 సా.5.00 వరకూ మాత్రమే ఆఫీసు పని చేయువేళలో దేవస్థానం ఆఫీసు నందు రూ 500/- రుసుము చెల్లించి పొందగలరు. 9. పూర్తి షరతులు కార్యాలయము నందు పొందవలెను.

ముదునూరి వెంకటరాజు ( గబ్బర్ సింగ్)
చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

నల్లం సూర్య చక్రధరరావు
డిప్యూటీ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

స్థలం: వాడపల్లి తేది: 24/05/2026

## ఎండల తీవ్రతకు తోడైన కరెంట్ కష్టాలు

### అడ్డతీగల మండలంలో ప్రజల తీవ్ర అసహనం!



**అడ్డతీగల, మే 24, ప్రభాతవార్త ప్రత్యేక కథనం** వేసవి కాలం వస్తే చాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కష్టాలు మళ్లీ మొదటికి వస్తున్నాయి. ఎండలు మండిపోతున్న వేళ అడ్డతీగల మండలంలో విపరీతంగా కొనసాగుతున్న స్థానిక ప్రజల సహనానికి పరీక్షగా మారుతున్నాయి. ముందస్తు సమాచారం లేకుండానే గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం అధిక ఉష్ణోగ్రతలపై హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే విద్యుత్ అంతరాయాల వల్ల ప్రజల దైనందిన జీవనం పూర్తిగా స్తంభించిపోతోంది. ఈ కరెంట్ కోతల వల్ల ముఖ్యంగా బాలింతలు, పసిబిడ్డలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉక్కపోత భరించలేక చిన్నారులు అల్లాడుతుండగా, వృద్ధులు శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట కష్టాలు ఎలా ఉన్నా, రాత్రి వేళల్లో సైతం గంటల తరబడి కరెంట్ తీసేస్తుండటంతో స్థానికులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. వ్యాపారాలపై తీవ్ర ప్రభావం విద్యుత్ అంతరాయాల ప్రభావం కేవలం ఇళ్లకు మాత్రమే పరిమితం కాలేదు. స్థానిక చిన్న వ్యాపారాలు, దుకాణాలపైనా దీని ప్రభావం గట్టిగా పడుతోంది. కరెంట్ లేకపోవడంతో వ్యాపారాలు సాగక, నిత్యావసర వస్తువులు పాడైపోతూ వ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు మండలంలో కూడా ఇదే విధంగా లో వోల్టేజ్, తరచూ జరిగే విద్యుత్ కోతలు, వేసవి కాలంలో పెరిగే డిమాండ్ వంటి సమస్యలు ఉండేవి. అయితే అక్కడ సమస్య తీవ్రతను గుర్తించి, ప్రజల చిరకాల కోరిక మేరకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు అదే తరహాలో అడ్డతీగల మండలంలో కూడా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచాలని, లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అడ్డతీగల మండలంలో ముందస్తు సమాచారం లేని కరెంట్ కోతలను అరికట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## గనిపోతు రాజు చెరువు సర్వే,

# సరిహద్దుల గుర్తింపు...



**తాళ్లరేవు, మే 24 (ప్రభాతవార్త)-** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు పంచాయతీ లోని గనిపోతు రాజు చెరువు,ఆర్ అండ్ బి రహదారి సరిహద్దులను అధికారులు గుర్తించారు. ఈ మేరకు శనివారం గని పోతురాజు రాజు చెరువును, తాళ్లరేవు పంచాయతీ కార్యదర్శి బండి రాజేంద్ర, సర్వేయర్లు సర్వే చేశారు. గనిపోతు రాజు చెరువు ఆక్రమన ల గుర్తింపులో భాగంగా చెరువు, ఆర్ అండ్ బి రోడ్డు హద్దులను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శి విజ్ఞప్తి మేరకు తహసిల్దార్, మండల సర్వేయర్ ఆదేశాలతో రెవెన్యూ, సర్వే విభాగం, పంచాయతీ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో మెగా రక్తదాన శిబిరం




**జగ్గంపేట, మే 24 (ప్రభాతవార్త)** అదానీ గ్రూప్స్ చైర్మన్ గౌతమ్ అదానీ జన్మదిన వేడుకలనుపురస్కరించుకునిఅదానీ ఫౌండేషన్, స్నేహ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్ లో మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. స్నేహ ఎంటర్‌ప్రైజెస్ కార్యాలయ ప్రాంగణం, అంబేద్కర్ నగర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో జరిగిన ఈ శిబిరాన్ని జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీనుమణి బాబు, దేవరపల్లి మూర్తి మాట్లాడుతూ "గౌతమ్ అదానీ జన్మదినం సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. రక్తదానం అత్యంత విలువైన సేవ. ఆసుపత్రులలో నెలకొన్న రక్త కొరతను తీర్చడానికి ఇటువంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. యువత పెద్ద సంఖ్యలో ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. స్నేహ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పాలకుర్తి సురేష్ మాట్లాడుతూ గౌతమ్ అదానీ జన్మదినాన్ని పురస్కరించుకుని అదానీ ఫౌండేషన్‌తో కలిసి ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం మాకు గర్వకారణం. ఒక వ్యక్తి చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. సామాజిక బాధ్యతతో భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. రక్తదాతలకు రెడ్ క్రాస్ సర్టిఫికెట్, 50 వేల రూపాయల ఇన్సూరెన్స్, ఆదాని ఫౌండేషన్ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో యువకులు, స్థానికులు, స్నేహ ఎంటర్ప్రైజెస్ ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

## రూ. 50 లక్షలతో పండూరు మంచినీటి చెరువు సుందరీకరణ

### శంకుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్ , మే 24 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామం లో రూ.50 లక్షలతో మంచినీటి చెరువు సుందరీకరణలో భాగంగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పి ఎం కే ఎస్ వై 2.0 పథకం కింద రూ. 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న చెరువు సుందరీకరణ పనులకు పంతం నానాజీ కూటమి నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం తో ఇటు కాకినాడ అటు పిఠాపురం పరిసర గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఆధునిక వాకింగ్ ట్రాక్, ట్రీ ప్లాంటేషన్ , యువకులకు ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ,గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్ సోలార్ లైట్లు, సిట్టింగ్ బెంచీలు ఏర్పాటు చేస్తామని,అదేవిధంగా చెరువు గట్టు వెడల్పు చేసి తదితర పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్ బాబా , రంభాల వెంకటేశ్వర రావు , మేకా లక్ష్మణ్ ,శిరంగు శ్రీనివాస్ , మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎ పి ఎమ్ గణేష్ ,తాటికాయల వీరబాబు,మాదారపు తాతాజీ ,నందిపాటి శ్రీనివాస్, దాసరి శివ ,గరగా శ్రీనివాస్ ,సుందర సతీష్ గారు,పోసిన రాము , శాండీ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మే 27, 28 తేదీల్లో జగ్గంపేటలో డిజిటల్ మహానాడు



**జగ్గంపేట మే 24 (ప్రభాతవార్త )** జగ్గంపేట స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో శనివారం క్లస్టర్ ఇంచార్జ్ దేవరపల్లి మూర్తి ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలో గల జగ్గంపేట, కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల బూత్ కమిటీ, యూనిట్ ఇంచార్జ్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల టీడీపీ అధ్యక్షులు జీను మణిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు 'ఇంధనం పొదుపు దేశానికి మేలుకొలుపు' అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ఈ ఏడాది మహానాడును డిజిటల్ మహానాడుగా నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా మే 27, 28 తేదీల్లో జగ్గంపేట గోకవరం రోడ్‌లోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో జగ్గంపేట క్లస్టర్ సంబంధించి డిజిటల్ మహానాడు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అమరావతి వేదికగా సీఎం చంద్రబాబు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనే మహానాడును ఇక్కడ ఎల్ ఈ డి స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని క్లస్టర్ ఇంచార్జ్ దేవరపల్లి మూర్తి తెలిపారు. క్లస్టర్ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ ఈ రెండు రోజులు హాజరై డిజిటల్ మహానాడును వీక్షించి విజయవంతం చేయాలని మణిబాబు, అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట టౌన్ టీడీపీ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, కాట్రావులపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్‌లు వేములకొండ జోగారావు, పిలా మహేష్, గెద్దాడ సత్యవేణి, మారిశెట్టి గంగాధర్, నాండ్ల చిరంజీవి, కొండ్రోతు శ్రీను, బూత్ కమిటీ ఇంచార్జ్‌లు వైభోగుల కొండబాబు యాదవ్, సాంబత్తుల చంద్రశేఖర్, నేదురి గణేష్ , ముత్యాల సత్యనారాయణ, బండారు నాని, బిక్కిన బాబి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మహాలక్ష్మమ్మ, వనువులమ్మ జాతర



**మామిడికుదురు.24 (ప్రభాతవార్త)** మండల పరిధిలోని పెదపట్నంలంక బొక్కావారిపాలెం లో కొలువై ఉన్న గ్రామ దేవతలు శ్రీమహాలక్ష్మమ్మ, వనువులమ్మ వార్ల జాతర మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, గరగ నృత్యాలు, పూజ ఘటం ఊరేగింపు, చిత్ర విచిత్ర వేషధారణలు, భారీ బాణాసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవం ఆద్యాంతం కన్నుల పండుగలా జరిగింది. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవార్లకు నైవేద్యాలు చెల్లించారు. సోమవారం సిరి బొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## మండలంలో చలివేంద్రాలు ఏర్పాటు




**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో జన సమూహ ప్రాంతాలు, బస్సు షెల్టర్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు తెలిపారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్న రీత్యా ప్రతీ పంచాయితీ చలి వేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎండలు ప్రభావ సమయంలో ప్రయాణాలు అత్యవసరమైతేనే వెళ్లాలని ప్రజలకు ఎంపిడిఓ తెలియజేస్తున్నారు. ప్రతీ రోజు ప్రతీ ఒక్కరూ సురక్షితమైన నీటిని మూడు లీటర్లను నీటిని త్రాగాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే ప్రభుత్వ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తలను పాటించాలన్నారు.

### విద్య ద్వార సమాజంలో

## ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు..

### ఎంపీ ,హరీష్ బాలయోగి .




**ఆత్రేయపురం, మే ,24,(ప్రభాత వార్త).** కృషి,పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. చూపిన మార్గంలో నడుస్తూ విద్య ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి అన్నారు.మండలంలోని వేలిచేరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ టాపర్స్ సన్మాన కార్యక్రమంలో కొత్తపేట తెలుగుదేశం పార్టీ యువనాయకుడు బండారు సంజీవ్, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా హరీష్ బాలయోగి మాట్లాడుతూ.. "పట్టుదల ఉంటే విద్యకు, మేధస్సుకు పేదరికం ఎప్పటికీ అడ్డుకాదని నిరూపించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆయన అని చూపిన మార్గంలో నడుస్తూ విద్య ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, మండల టిడిపి ఉపాధ్యక్షులు తోట రజిని, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలింగి రవిచంద్ర, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, మజ్జి తరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,కుటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ వేల అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా

### సిఐ నరేంద్ర ప్రసాద్



**రంపచోడవరం మే 24 ప్రభాతవార్త.** పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని అక్రమ పశువుల రవాణా జంతువులపై క్రూరత్వం మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు రంపచోడవరం సి. ఐ నరేంద్ర ప్రసాద్ తెలిపారు. హైకోర్టు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సరిహద్దు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పశువుల రవాణా చేసేటప్పుడు దానికి సంబంధించిన చట్టాలు రవాణా నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్రూరంగా పశువులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా అక్రమ పశువుల రవాణా లేదా జంతువులపై క్రోరత్వం అంటే అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే ప్రజలు వెంటనే రంపచోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ 9440900761 మరియు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు.

## ఈనెల 26న.బీఎల్ఏ ల శిక్షణా సమావేశం



**మామిడికుదురు.మే24(ప్రభాతవార్త)** ఈ నెల 26వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు గోగన్నమఠం గ్రామంలో రాజోలు నియోజకవర్గం స్థాయి బీఎల్ఏల శిక్షణా సమావేశం జరుగుతుందని నియోజకవర్గ కోఆర్డినేటర్ పాముల రాజేశ్వరి దేవి తెలిపారు. గోగన్నమఠంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, టాస్క్ ఫోర్స్ సభ్యులు ఒమ్మి రఘురాం హాజరవుతున్నారని తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్లతోపాటు పార్టీ ముఖ్య నాయకులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు. సమావేశంలో భూపతిరాజు సత్తిబాబు రాజు,కటకంశెట్టి ఆదిత్య, బొలిశెట్టి భగవాన్, కుసుమ శ్రీధర్, గుబ్బల మనోహర్, కొల్లాబత్తుల మున్న, ఎండివై షరీఫ్,కంచర్ల శేఖర్, గుర్రం జాషువా తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్.



**తాళ్లరేవు, మే 25 (ప్రభాతవార్త):** ఈనెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. వేసవి సెలవులు సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు ప్రతి సంవత్సరం ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో పిల్లలకు ఆటలు పాటలు వివిధ డాన్స్ పోటీలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఈసారి ఆలస్యంగా ప్రారంభిస్తున్నామన్నారు. తాళ్ళరేవు ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన క్లబ్ సమావేశంలో ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్, వెదురుపావులూరి నాని, బొంతు మోహన్, కన్నీడి వెంకటరమణ తదితరులు మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ఆటలపై శిక్షణ ఉంటుందన్నారు. తాళ్ళరేవు పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ప్రజా సంఘాల భవనంలో జరిగే ఈ సమ్మర్ క్యాంపును మండలంలోని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు తణుకు రాంబాబు, చిట్టి తల్లి, దుప్పి అదృష్టదీపుడు, టేకుమూడి ఈశ్వరరావు, ఒళ్ళు రాజబాబు తదితరులు మాట్లాడారు.

## జోరుగా అనుమతి లేని మట్టి తోలకాలు

**అయినవిల్లి మే 24 ప్రభాతవార్త** దాళ్వ వరి కోతలు ముగిసి వరి చేలుఆరుదలకు రావడంతో మట్టి త్రవ్వకాలు జోరశీదుకున్నాయి వ్యవసాయ పొలాల్లో విలువైన నల్ల మట్టిని తరలించుకుపోతున్నారు మట్టి తరలింపుకు రెవెన్యూ పోలీస్ అనుమతులు కావలసి ఉండగా ఇవి లేకుశీడా కొందరు ట్రాక్టర్లు మిషన్లతో మట్టి త్రవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు అయినవిల్లి మండలంలో అయినవిల్లి నేదునూరు మరికొన్ని గ్రామాల్లో మట్టి తరలింపు జోరుగా సాగుతుంది మట్టి తరలించే వాహనాలు రోడ్లపై జోరుగా నడపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు

## మండల తెలుగు యువత కృష్ణ చైతన్య,

### తెలుగు మహిళ చిన్నం లక్ష్మి..

### టిడిపి అనుబంధ కమిటీలు ప్రకటన..



**అంబాజీపేట, మే 24, (ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ మండల అనుబంధ కమిటీలు ప్రకటించినట్లు మండల శాఖ అధ్యక్ష,కార్యదర్శులు గూడాల ఫణి,రవణం రాములు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మండల తెలుగు యువత అధ్యక్షులుగా జోగి కృష్ణ చైతన్య, తెలుగు మహిళగా చిన్నం లక్ష్మీలను నియమించామని తెలిపారు. అలాగే వాణిజ్య విభాగం అధ్యక్షులుగా లక్కింశెట్టి లక్ష్మీనారాయణ,బీసీ సెల్ అధ్యక్షులుగా యడ్లపల్లి తుక్కియ్య, సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా కొల్లూరి దివాకర సత్యనారాయణమూర్తి, రైతు విభాగం అధ్యక్షులుగా దంతులూరి సూర్యనారాయణరాజు, టిఎన్టియుసి అధ్యక్షులుగా రంకిరెడ్డి రామారావు లతో పాటు వివిధ విభాగాలలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించినట్లు వారు తెలిపారు. వీరంతా ఈనెల 27, 28 తేదీలలో క్లస్టర్ల పరిధిలో నిర్వహించే హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేయాలని, అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేలా గ్రామస్థాయిలో పనిచేయాలని మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూచించారు. మండల అనుబంధ విభాగాలలో నూతనంగా ఎన్నికైన వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వడగాల్పులకు గురై గ్రామీణ వైద్యుడు మృతి..



**అంబాజీపేట, మే 24, (ప్రభాతవార్త):** వడగాల్పులకు గురై గ్రామీణ వైద్యుడు (ఆర్ఎంపి) మృతి చెందారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని వాకలగరువు అగ్రహారం వీధికి చెందిన పేరాబత్తుల వెంకటరత్నం (44) గ్రామీణ వైద్యుడిగా పనిచేస్తున్నారు.విధుల్లో భాగంగా వైద్యం చేసేందుకు గ్రామంలోకి వెళ్లిన వెంకటరత్నం మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చారు. అనంతరం ఎవరో రోగి నుండి ఫోన్ రావడంతో సాయంత్రం మూడు గంటల సమయంలో మరల విధుల్లో భాగంగా తన మోటార్ సైకిల్ పై బయటికి వెళ్లారు.ఏటిగట్టుపై మోటార్ సైకిల్ తో పాటు పడి ఉన్న వెంకటరత్నం ను సాయంత్రం నాలుగు గంటల సమయంలో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.దీంతో 108 వాహనంకు ఫోన్ చేయడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని తెలిపారు.అంబాజీపేట పోలీసులతోపాటు వైద్యాధికారులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికు భార్య, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు.

## వడగాల్పులతో వాడపల్లి వెంకన్న సేవకురాలు మృతి.



**ఆత్రేయపురం, మే ,24,(ప్రభాత వార్త).** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న దేవస్థానం అన్నదాన భవనంలో నిత్యం సేవచేస్తూ వాడపల్లి గ్రామానికి చెందిన సరిదే భాను (73) వడగాల్పులు వల్ల ఆదివారం మృతి చెందారు. నిస్వార్థంగా సేవచేస్తూ ఎలాంటి ఆశ లేకుండా స్వామి వారి సేవ మార్గంగా సేవచేసిన మహాత్మురాలు సరిదే భాను ఆమె మృతి అందరిని కలసివేసింది.వివరాల్లోకి వెళితే ఆమె గత 15 సంవత్సరాల నుండి కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ నిత్యాన్నదాన శాలలో బల్లలు శుభ్రం చేస్తూ సేవ చేస్తున్నారు. ఆమె స్వామి వారి సేవ చేస్తూ స్వామివారి నిత్యాన్నదాన పథకానికి దశల వారీగా సుమారు రూ 3 లక్షల వరకు విరాళాలు అందజేశారు. ఆమెకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో స్వామి వారి సేవ చేస్తూ ఆమెకు వచ్చిన ప్రతి రూపాయి కూడబెట్టుకొని స్వామివారి నిత్యాన్న పథకానికి ఇవ్వడం విశేషం.ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, తెలుగు యువత వెచ్చా అనిల్ కుమార్, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఏపుగంటి వెంకటేష్,ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## వై ఎస్ అర్ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ




**అనపర్తి మే 24(ప్రభాతవార్త)** వైయస్ఆర్ సిపి అనపర్తి టౌన్ ఆధ్వర్యంలో మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) మరియు అనపర్తి టౌన్ అధ్యక్షులు రంగంపేట మండలం ఇన్చార్జి నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి సౌజన్యంతో ఆదివారంఅనపర్తి కెనాల్ రోడ్ లోని వైయస్ఆర్ విగ్రహం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలంలో ముఖ్యంగా ప్రయాణం చేసేవారు వివిధ పనులపై బయట తిరిగేవారు తీవ్రమైన వేడికి గురి అవుతారని, వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని వీటినుండి మనల్ని మనం కాపాడుకోవడానికి ఇటువంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పొలమూరు మాజీ ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్ , తిరగటి శివ, మేడపాటి రామకృష్ణారెడ్డి, మేడపాటి శివశంకర్ రెడ్డి, కానూరి కృష్ణ , వీరయ్య కాపు, సత్తి పోతారెడ్డి, వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, సత్తి వెంకటరెడ్డి, చింతా ప్రభాకర్ రెడ్డి, ఓగిరెడ్డి నాగిరెడ్డి, గుడిమెట్ల బాల దేవి మణికంఠ, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి ,సత్తి మణికంఠ రెడ్డి , ఎన్. ప్రసాద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అబ్బాయి మరణం వైసిపి పార్టీకి తీరని లోటు..

### అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన వైసిపి నేత మురళి రాజు



**ప్రత్తిపాడు, మే 24 (ప్రభాతవార్త) మండలంలో** ధర్మవరం గ్రామ తాజా మాజీ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల భర్త, వైసిపి సీనియర్ నాయకుడు 'అబ్బాయి' అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ధర్మవరం గ్రామంలో అబ్బాయి భౌతికకాయాన్ని ఆయన సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ?అనంతరం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో మురళీకృష్ణంరాజు స్వయంగా పాల్గొని, శ్మశానయాత్రలో పాడె మోశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అబ్బాయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి వైసిపి శ్రేణులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ం?ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, కోన బాబ్జి, తూపాటి బాబ్జి, నాగులపల్లి ఏసు, రాపా అప్పన్నలతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్థానిక గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

మరిన్ని వార్తలు 6లో

## వైద్యం నిమిత్తం ఉచిత ఆటో సర్వీసు ప్రారంభించిన మంత్రి సుభాష్



**కె గంగవరం, మే 24,(ప్రభాతవార్త):** కే గంగవరం మండలం గంగవరం గ్రామీణ ఆరోగ్య కేంద్రం( కియా కంటైనర్ హాస్పిటల్) నందు ప్రజల అవసరార్థం ఉపయోగించే ఎలక్ట్రికల్ ఆటోని మంత్రి సుభాష్ ప్రారంభించారు. గంగవరం మండలం చుట్టుపక్కల ప్రాంతాల నుండి వైద్య సేవల్లో భాగంగా రోగుల,నిస్సహాయుల ఇళ్ల వద్ద నుండి ఆరోగ్య కేంద్రం కు తీసుకువచ్చి వైద్యసేవల అనంతరం మరలా వారి ఇళ్ల వద్ద చేర్చే విధంగా ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. ఇందుకుగాను చరవాణి 9951221750 నెంబర్ ను సంప్రదించవలసిందిగా వైద్యురాలు అనూష తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది పట్టాభి రామయ్య (రమేష్) ,జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజకుమార్ ను ఆటోలో ఎక్కించుకుని మంత్రి సుభాష్ స్వయంగా నడిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చందర్రావు,ప్రకాష్ రావు, రాజేశ్వరి, అనూష, జ్యోతి, మండల టిడిపి అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, డిసి సుబ్రహ్మణ్యం, పేరాబత్తుల నాగేశ్వరరావు, నేమాని అబ్బు, మేడిశెట్టి బాబి పుణ్యమూర్తి వాసంశెట్టి కృష్ణ, రవ్వ భూషణం, కొప్పిశెట్టి సతీష్,శ్రీ రామ్, సుబ్రహ్మణ్యం, చిట్టూరి రామ్మోహన్ రావు చక్రి,సోమేశ్, వెంటూరు వీర రాఘవులు, గొడవర్తి రామకృష్ణ కూటమి నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం..



**అంబాజీపేట, మే 24, (ప్రభాతవార్త):** దేవాలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని పలువురు అన్నారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారం గ్రామ దేవత శ్రీ రావులమ్మ అమ్మవారి ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆర్థిక సహకారం అందించిన దాతలను కొనియాడారు. గ్రామానికి చెందిన పట్టెం స్వామినాయుడు-సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బారావు (దొరబాబు), సూర్యప్రకాశరావు (బుజ్జి) లు రూ.2 లక్షలతో ఆలయానికి రంగులు వేయించారు. ఆలయాన్ని సుందరీ కరణంగా తీర్చి దిద్దిన పెయింటర్లు రావూరి సత్తిబాబు (వీరన్న), మణికంఠలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడపా బాబ్జి, ఆకెళ్ళ కృష్ణ శర్మ, ఇసుకపూడి వాసు, చిక్కాల సూరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

## 30,136 నోట్ బుక్స్ సిద్ధం..

### యం.ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర



**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల విద్యా శాఖ కార్యాలయంకు ఆదివారం 30, 136 నోట్ బుక్స్ వచ్చాయని రాజవొమ్మంగి మండల విద్యాధికారి కె. వి. వి. సత్యనారాయణదొర తెలిపారు. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకూ విద్యార్థులకు అవసరమైన 200 పేజీలు బ్రాడ్ రూల్, సింగిల్ రూల్, గ్రాఫ్స్ వచ్చాయని యం. ఇ. ఓ. టి. సూరయ్యరెడ్డి తెలిపారు. సిఆర్పీలు శ్రీనివాస్, విష్ణువర్ధన్, మంగరాజు, సతీష్, ఆదినారాయణరెడ్డి, సిబ్బంది యేసుబాబు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి హామీ



**పెదపూడి.ప్రభాతవార్త** పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో అడపా వారి వీది, గుండా వారి వీధి, పాఠం శెట్టి వారి వీధిలలో ఈ మూడు విధులకు కరెంటు ట్రాన్సఫర్ లు లేక సుమారు 200 కుటుంబాలకి కరెంటు ట్రాన్సఫర్ లేక కరెంటు లేకపోవడంతో వాళ్ళు చిన్న పిల్లలతో చాలా ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కరించమని, ట్రాన్సఫర్ వేయించమని కరకుదురు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింగనీడి దత్తుడు ని గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించిన దత్తుడు , వెంటనే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తో, అలాగే విద్యుత్ శాఖ తో మాట్లాడి బుధవారంలోగా ట్రాన్సఫర్ వేయిస్తానని గ్రామస్తులకు సింగినీడి నాద తిరుపతిరావు (దత్తుడు) హామీ ఇచ్చారు.

# కత్తిపూడిలో ఎమ్మెల్యే సత్య ప్రభ జన్మదిన వేడుకలు

**శంఖవరం మే 24 ప్రభాతవార్త** ప్రతిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా జన్మదిన వేడుకలు నియోజకవర్గం లో పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కత్తిపూడి లో శాసనసభ్య రాలు జన్మదినాన్ని పరిష్కరించుకుని అభిమానులు కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు .ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు వెన్న శివ మాట్లాడుతూ వరుపుల రాజా మృతితో నియోజకవర్గ ప్రజలంతా దుఃఖ సముద్రంలో ఉన్నప్పుడు కుటుంబ బాధ్యతలను పక్కనపెట్టి తన భర్తను నమ్ముకున్న కార్యకర్తలను కాపాడాలని



మొక్కవోని ధైర్యంతో ప్రజలను రక్షించాలని కష్ట కాలంలో బాధ్యతలు స్వీకరించారని, ఒక పక్క అభివృద్ధి సంక్షేమం చేస్తూ నియోజకవర్గంలో సీనియర్లును సమన్వయపరుస్తూ, చక్కని నాయకత్వంతో నియోజక వర్గాన్ని ముందుకు తీసుకెళుతున్న ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల అందిస్తూ నియోజకవర్గంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలను గుర్తించి వాటికి మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. రాజకీయంగా జూనియర్ అయినప్పటికీ ప్రజలు మనసు గెలుచుకోవడంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారని ,అదేవిధంగా రాష్ట్ర నాయకులతో సమన్వయం సాధిస్తూ ముందుకు సాగుతున్నారని ఆమె మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాబు కృష్ణమూర్తి కంచి బోయిన శ్రీను మచ్చ గంగరాజు కర్రి బుజ్జి కొయ్య రమణ దేశలింక వెంకటరమణ గాబు శివ గాబు ఈశ్వరరావు గజ్జి సత్తిరాజు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రాండ్‌గా వాకర్స్ క్లబ్ 40 వసంతాల వేడుకలు - జల్లి సుజాత

**అమలాపురం కలెక్టరేట్, మే 24 ప్రభాతవార్త** అమలాపురం పట్టణంలో వాకర్స్ క్లబ్ 40 వసంతాల పండుగ వేడుకలను శ్రీ సాయి సంజీవిని మహిళా వాకర్ క్లబ్ మరియు డిప్యూటీ గవర్నర్ జల్లి సుజాత సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి సుజాత మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ 40 వసంతాల వేడుక తన చేతుల మీదుగా నిర్వహించడం తన అదృష్టం, పూర్వజన్మ సుకృతం అన్నారు కళాగ్రాండ్స్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ జల్లి సుజాత ఆధ్వర్యం వహించగా డిస్ట్రిక్ట్ 103 గవర్నర్ తోలేటి సూర్యనారాయణ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ 103 రెండవ క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మూడు జిల్లాల వాకర్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షురాలు ఎం ప్రభావతి పాల్గొని కేక్ కటింగ్ చేసి వాకర్స్ క్లబ్ నలభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం ధనము కన్నా ఆరోగ్యం మిన్న ఎన్ని సంపదలు ఉన్నా శూన్యమని ఆరోగ్యమే మహాభాగ్యం అని నడు నడిపించు అనే నినాదంతో 1986లో వాకర్స్ క్లబ్ స్వర్గీయ సుంకర ఆళ్వార్దాస్ విశాఖపట్నంలో స్థాపించారని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ స్థాయికి ఎదిగి 2026 కీ 40 వసంతాల పండుగ వేడుకలు జరుపుకొనుచున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ లో నేడు 5 లక్షల మంది ఒక వేయి 650 క్లబ్బులలో కలరని తెలియజేశారు. ఈ వేడుకకు ముందుగా ఉదయం వాకర్స్ హెల్త్ క్లబ్ అమలాపురం వారి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ స్థానిక డిఎస్పి ప్రసాద్ కేక్ కట్ చేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిలుపుమేరకు ఇందనాన్ని



పొదుపు చేయుటకు ఆరోగ్యాన్ని కాపాడుకొనుటకు ప్రతి ఒక్కరు తగిన శారీరక శ్రమ చేయాలని అందుకు ఏర్పడ్డది వాకర్స్ క్లబ్ అని ఈ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కూడా చేస్తు ప్రజల ను ప్రభావితం చేస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో రీజనల్ కౌన్సిలర్ ఎం భాస్కరరావు, ఎలెక్ట్ గవర్నర్ ఎమ్మెస్ మూర్తి, తిలక్ బాబు, కోడి బాబ్జి సత్య వరప్రసాద్, చీప్ కోఆర్డినేటర్ నాగేంద్ర, క్యాబినెట్ సెక్రటరీ మల్లేశ్వరరావు, కోశాధికారి వెచ్చ నాగసత్య, మాజీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, తేతలి సత్యనారాయణ రెడ్డి, వైయస్సార్ మూర్తి గుర్రాల అమల భవాని ఒడిశా పుష్ప సాయి సంజీవని మహిళా వాకర్స్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖుల్లో కోనసీమ మహిళా మండలి అధ్యక్షురాలు పోలిశెట్టి అనంతలక్ష్మి, సంస్కార భారతీ అధ్యక్షురాలు ఎస్. పద్మావతి తదితరులు ఉన్నారు.

# ఉచిత రవాణా ఎలక్ట్రిక్ ఆటోలు ప్రారంభం

**రామచంద్రపురం మే 24 (ప్రభాతవార్త):** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేపడుతున్న ఆరోగ్య విప్లవం మరో ముందడుగు వేసింది. ఇప్పటికే కియా సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన మూడు కంటైనర్ క్లినిక్‌లకు అనుబంధంగా, ప్రజలను ఉచితంగా ఆసుపత్రులకు తరలించేందుకు రూ.10 లక్షల వ్యయంతో మూడు ఎలక్ట్రిక్ ఆటోలను ద్రాక్షారామం,కాజులూరు,కె గంగవరం మండలాల్లో మంత్రి సుభాష్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు.కంటైనర్ క్లినిక్‌కు ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కేటాయించారు.ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి రావడానికి ఇబ్బంది పడితే,సంబంధిత నంబర్‌కు ఒక మిస్ కాల్ ఇస్తే చాలు ఎలక్ట్రిక్ ఆటో వారి



ఇంటి వద్దకు చేరుకుని ఉచితంగా క్లినిక్‌కు తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తుంది.ప్రజలు సంప్రదించాల్సిన నంబర్లు ద్రాక్షారామం క్లినిక్ : 9951221760,కాజులూరు క్లినిక్ :9951221740,కె .గంగవరం క్లినిక్ : 9951221750.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,సహారా ఎన్జీవో రిప్రజెంటేటివ్ ,ప్రాజెక్ట్ మేనేజర్ సాహిత్ గౌడ్ తాడూరి, వైద్యులు పద్మిని,అనూష,లలిత కరుణ,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కౌడ చైర్మన్ తలాటం సత్య ప్రమాణ స్వీకారం

- **ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్**

**కాకినాడ రూరల్, మే 24, ప్రభాతవార్త:** కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా తలాటం సత్య ప్రమాణ స్వీకారం ఫాబిన్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి క్రియాశీలకంగా సేవలందించిన తలాటం నాగ సత్యనారాయణ (సత్య) ను జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ కూడ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ జిల్లా పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డిసిసిబి చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వేగుళ్ల లీలా కృష్ణ, వేటుకూరి సూర్యనారాయణ రాజు పాల్గొని అభినందనలు తెలియజేశారు. సందర్భంగా తలాటం సత్య మాట్లాడుతూ తనమీద ఉన్న నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు



తెలిపారు. పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా గుర్తింపు వస్తుందని, కేవలం పదవి కోసం కాకుండా బాధ్యతగా పనిచేసి పార్టీ కి మరింత విధేయుడుగా పనిచేస్తానన్నారు. కాకినాడ నగర సమగ్ర అభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన పట్టణ వికాసం లక్ష్యంగా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కాకినాడ నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తలాటం సత్య హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు కందుల దుర్గేష్ , వాసంశెట్టి సుభాష్, పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజాకేంద్రీకృత నిర్ణయాలకు ప్రాధాన్యం పెరిగిందని తెలిపారు. కాకినాడ నగరాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కుడా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరిపాలనకు కొత్త పునాది పడిందని, కాకినాడ నగర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుంది అని తెలిపారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ,కాకినాడ నగర అభివృద్ధి, యువతకు అవకాశాలు, మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తుందన్నారు.జనసేన పార్టీ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందనీ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యదర్శి కాళీ బాబు, కార్యాలయ సిబ్బంది, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కోటిపల్లి లో భారీ అన్నదానం



**కె.గంగవరం,మే 24,(ప్రభాత వార్త):** గంగవరం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైనటువంటి కోటిపల్లి గ్రామంలో వేంచేసినటువంటి సుచలాదేవి సమేత ఆంజనేయస్వామి కళ్యాణం సందర్భంగా నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు పప్పుల మసేన వెంకన్న (రేవు శ్రీను) తెలిపారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా సతి సమేతంగా ఆంజనేయ స్వామి వారి ఆలయం ఉండడం ఇక్కడ విశిష్టత. ఈ కార్యక్రమంలో పప్పుల గవర్రాజు, సాయిబాబు, వీరభద్రరావు, ఆలయ కమిటీతోపాటు యువత ఈ అన్నదాన కార్యక్రమంలో తమ సహాయ సహకారాలు అందించారు. ఈ అన్నదాన కార్యక్రమం అనంతరం భక్తులు స్వామివారిని అమ్మవారిని దర్శించి కృపకు పాత్రులు అయినారు.

## ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి నిత్యాన్న పథకానికి విరాళం




**ఆత్రేయపురం, మే,24,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి ,గోపాల స్వామి వారి అన్నదాన పథకానికి విశాఖపట్నం వాస్తవ్యులు చెల్లూరి అమర్ కుమార్ , ఝాన్సీలక్ష్మిదంపతులు రూ.5,116/-లు విరాళంగా అందించారు .దాతలకు స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, కార్యనిర్వాహణాధికారి, భాగవతుల వెంకటరమణ మూర్తి లు స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.

## వొమ్మంగి లో కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలు



**ప్రత్తిపాడు, మే 24 (ప్రభాతవార్త)** మండలం వొమ్మంగి గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ,నియోజకవర్గ అభివృద్ధిని వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ,అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్న ఆమె నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోందని ప్రశంసించారు.సేవాభావంతో కూడిన పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సత్యం శెట్టి సీతబాబు, రామిశెట్టి సీతారామయ్య (మునసిబు),సుంకర భవాని, కొప్పన నాని ,దేశెట్టి పెదకాపు, టీవీ మెకానిక్ జి సూరిబాబు, తోలేటి రామకృష్ణ, చవల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పీజీఆర్ఎస్ యధావిధి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం కలెక్టరేట్, మే24 ప్రభాతవార్త** నేడు జిల్లా కలెక్టరేట్ నందు ప్రతీ సోమవారం నిర్వహించే మీకోసం.పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల



పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు.అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్ ల్లో అందజేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను ఈ (మీకోసం.ఏపీ. జీవోవి.ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి,సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సదరు ప్రకటన ద్వారా సూచించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps